- జానపదుల వృత్తి విద్యా నైపుణ్యం
- నెల్లూరు శాసనాలు - సామాజిక భాషాంశాలు
- సినారె వచన నాటికలు
- వరకవి సిద్దప్ప సాహిత్యం - పూర్వ కవుల ప్రభావం
- భక్తి జ్ఞాన సాధనం 'శ్రీ రాజయోగానంద భజన మాల'
- పూతవట్టిన అడవి - పుల్లలెగదోసే పిలుపు
- పురుడు నవల - సామాజిక, సాంస్కృతికాంశాలు
- దళిత కవిత్వానికి బలమైన చేర్పు

# మూసీ

# MUSI


- Samputi : 29 • Sanchika : 01 • Pages : 64 • Rs. 20
- November 2025




Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన పత్రిక తెలుగు మాసపత్రిక

సంపుటి : 29 సంచిక : 1
నవంబర్ - 2025
'విశ్వావసు' కార్తీక, మార్గశిర మాసాలు

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

## ఈ సంచికలో ...

జానపదుల వృత్తి విద్యా నైపుణ్యం - ఆచార్య తంగెడ కిషన్ రావు - 7
నెల్లూరు శాసనాలు - సామాజిక భాషాంశాలు - ఆచార్య జి. అరుణకుమారి -15
సినారె వచన నాటికలు - ఆచార్య పాకనాటి జ్యోతి - 21
సిద్ధాంత గ్రంథ రచనలో 'అధ్యాయాలు' : తాత్త్విక పునాదులు, నిర్మాణ వ్యూహాలు ... ఆచార్య గంపా వెంకటరామయ్య - 29
వరకవి సిద్ధప్ప సాహిత్యం- పూర్వ కవుల ప్రభావం - డా.రాపర్తి శ్రీనివాస్ - 33
భక్తి జ్ఞాన సాధనం 'శ్రీ రాజయోగానంద భజన మాల' ..సుప్పని సత్యనారాయణ -37
స్థలదుఃఖం జనదుఃఖం ఈ కవి చిరునామా - డా.బెల్లి యాదయ్య - 39
తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో - అష్టవిధ శృంగార నాయికలు - కొలుకుల రజిత - 41
పూతవట్టిన అడవి- పుల్లలెగదోసే పిలుపు - డాక్టర్ సుంకర గోపాలయ్య - 45
పురుడు నవల - సామాజిక, సాంస్కృతికాంశాలు - రామా రత్నమాల - 49

### కవిత్వం

ముసలి తల్లి .. అల్వాల లక్ష్మణమూర్తి - 5; తుకారాం అభంగం - డా. మంత్రి శ్రీనివాస్-6; నువ్వు - నేను ... అవుసుల భాను ప్రకాశ్ - 20; అది...ఆ.. గీతం ... టి. శ్రీవల్లీ రాధిక - 28; క్యాంపస్ కవిత్వం ... డా. ఎస్. రఘు - 35; నానీలు - పిప్పి శ్రీలత - 44; మానవత్వము ... పసుపులేటి నరసింహారావు - 48; కృత్రిమ శిల్పం ... మునుగూరి పురుషోత్తం- 62.

### సమీక్ష

'గౌడన్న బతుకు చిత్రమే వంకతాదు' దీర్ఘకవిత సమీక్ష: ఒక సమగ్ర విశ్లేషణ - డా. రవి కుమార్ చేగొనీ - 54 ; దళిత కవిత్వానికి బలమైన చేర్పు - డా.పసునూరి రవీందర్ - 55; జానపద కళల పునరుజ్జీవనం - సమాలోచన - డా. వర్ధ వేణు - 58

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

## సంపాదకీయం






వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**




# తత్త్వం

లోకంలో పరిశీలించే ప్రతి పదార్థానికి మూడు గుణాలుంటాయి. మొదటిది రూపం, రెండవది గుణం, మూడవది ముఖ్యమైనది తత్త్వం. రూపం అందరికీ కనిపిస్తుంది. గుణం దాని అనుభవం పొందినపడు తెలుస్తుంది. దాని ద్వారా పొందే శక్తి తత్త్వం అవుతుంది. అది కనిపించకుండానే అనుభవం పొందినవానికి చేరుతుంది. ఉదాహరణకు : ఒక మంచి మామిడి పండు తన రంగు, రూపాదుల వల్ల కనిపిస్తుంది. దానిని తెంపుకుని కోసుకుని తిన్నవానికి దాని గుణం (పులుపు, తీపి, చేదు మొ॥) తెలుస్తుంది. దానిని తీసుకున్న తర్వాత తీసుకున్నవాని ఆకలి తీరుతుంది. శక్తి వస్తుంది. ఈ మూడు అంశాలూ మనకు తెలుస్తున్న అంశాలే అయినా మూడవది అర్థం కాదు. పదార్థాలన్నింటిలోనూ ఈ అంశం సమాన ధర్మమే.

తాత్త్వికుడైనా రూపాన్ని ఆశ్రయించక తప్పదు. దాని ద్వారానే గుణ తత్త్వాలు తన వద్దకు చేరుతాయి. అన్ని విషయాల్లోనూ ఇదే అంశాన్ని మనం గమనించాల్సి ఉంటుంది. పండు కేవలం రూపం కోసం తినం, గుణం కోసం కొంతవరకు ముందుకు వెళ్తాం. కానీ దానిలోని శక్తి కోసం తింటాం. అయితే శక్తి గురించి అధ్యయనం చేసే క్రమంలో మాత్రం రూప గుణాల అవసరం కనిపిస్తుంటుంది. శక్తి లేకుండా కేవలం రూప, గుణాలున్నంత మాత్రాన ప్రపంచంలో ఏ వస్తువును వినియోగించుకునే అవకాశం ఉండదు. దాని వల్ల చూడడానికి సంతోషం తప్ప వేరే ఏ రూపంలోనూ ఆనందం లభించదు. ఆ పదార్థ తత్త్వం అర్థం అయినప్పుడు దాని రూపం మనం ఆశించినంత ఉన్నా లేకున్నా దాన్ని స్వీకరిస్తాం.

కార్యనిర్వహణలోనూ కూడా భావన కార్య రూపం ధరించాలంటే నిర్వహించేవాని శక్తికే ప్రాధాన్యం ఉంటుంది. వాని అంతర తత్త్వాన్ని అనుసరించి నిర్వహణ ఉంటుంది. బండి లాగాలంటే తగినంత శక్తి ఉండి తీరాల్సిందే కదా. తన శక్తి, స్థాయి కన్నా ఎక్కువ బరువున్న బండిని లాగడం ఎవరికైనా కష్టమే. అందుకే శక్తిని పెంచుకుంటూ బండిని నిర్వహించే స్థాయిని పెంచుకోవాలి.

ఈ సృష్టి విశేషంలోనూ అంతే. శక్తిమయమైన సృష్టి, పంచభూతాత్మకమైన రూప, గుణాలుగా మారుతుంది. ఈ రూప గుణాదుల ద్వారా తత్త్వాన్ని ఆశ్రయించినవారు శక్తివంతులవుతారు. లోక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. శక్తి తక్కువైన వారు తొందరగా అలిసిపోతారు. పెద్ద స్థాయి కార్యక్రమాలను నిర్వహించలేరు.

మూడు విధాలుగా తెలుసుకునే ఈ సృష్టి యొక్క తత్త్వాన్ని అర్థం చేసుకునే వారిని తాత్త్వికులు అని అంటారు. తాత్విక దృష్టి అలవడిన తర్వాత రూప, గుణాదులతో కలిసి ఉన్నా వాటికి ప్రాధాన్యం ఉండదు. వానిలోని చైతన్యానికి మాత్రమే ప్రాధాన్యం ఏర్పడుతుంది. సర్వం శక్తిమయం జగత్ అన్నట్లుగా అన్నింటిలోనూ శక్తిని, చైతన్యాన్ని, తత్త్వాన్ని, జ్ఞానాన్ని దర్శిస్తుంటారు. వారు సాధారణ వ్యక్తుల కన్నా ఎన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలను నిర్వహించ గలుగుతారు.

అన్ని రంగాలలోనూ ఈ ప్రత్యేకతలు కనిపిస్తుంటాయి. సాధారణమైన వారు పదార్థంలోని రూపాన్ని దర్శిస్తే, కొంత శక్తి పెరిగినవారు రూపం ద్వారా గుణాన్ని అనుభవిస్తారు. అత్యంత విశేషమైన వ్యక్తులు విశేషమైన కార్యక్రమాల నిర్వహణ చేస్తారు. ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక, రాజకీయ, క్రీడా, పరిశోధనాది రంగాలేవయినా ఈ చైతన్య దర్శనం, తత్త్వ దర్శనం అలవాటు అయినవానికి అవన్నీ సాధారణాంశాలు. సాధారణమైన వానికి అవి బరువులే. విశేషాలే.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025



# ముసలి తల్లి !

కన్నపేగును తెంచలేకను కాచియుంటిని ప్రేమతో
కన్నబిడ్డలు నాదరించరు కష్టమయ్యెను జీవికన్
అన్నియున్నను లేకపోయెను నాదరంబు నొకింతయున్
పిన్న పెద్దలు కోపగింతురు వేగలేనిక నింటిలో!



“అత్తముండను” దొంగనైతిని నాగడంబులు నావయెన్
చెత్తకన్నను హీనమైతిని చేతకాదని నిందలున్
దుత్తలన్నియు వక్కలయ్యెను దూషణంబులు నిత్యమై
మిత్తి రాదయె వేచియుంటిని మ్రింగలేనిక దు:ఖమున్

ఎత్తుకెత్తుగ పెంచుకొంటిని నెంత ప్రేమయొ జూపితిన్
నుత్తవయ్యెను - తల్లి చేదయె నోర్వజాలరు పుత్రులున్
క్రొత్త కోడలు గూడ నేర్చెను కొండెముల్ తగబెట్టగా
కత్తిమీదను సాము చేయుటె కష్టముల్ యధికంబయెన్.

కన్నబిడ్డల కేమి యిస్తిరి కాంచనంబులు భూములో
పిన్నవారలమైన మాకును పెట్టుపోతలు దప్పు నా
ఎన్నడున్ తొలగేనొ పీడయు నింత పిండము పెట్టగన్
నిన్ను మేపిన లాభమేమని నింద వేసియు దిట్టరే.



కట్టు బానిస చందమయ్యెను కాళ్ళు చాచితి కాటికిన్
వెట్టి చాకిరి చేయజాలను వెన్ను వంగెను విల్లుగాన్
మట్టసంబుగ మ్రింగి కూర్కొను మాయలాడిగ నిల్చితిన్
తిట్టినా పడియుండు పీనుగు తీరునయ్యె గృహంబునన్.

**అల్వాల లక్ష్మణ మూర్తి**
కలువకుర్తి, ఫోన్ : 95504 67431

## మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రక్రియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

నిన్ను చూడకుండ ఉండలేనయ
నీ రూపమెంత మధురమయ
నీతోనే నా లోకం నీతోనే నా సంచారం
నిన్ను చూడకుండ ఉండలేనయ

నీ నామ గానము చేతు
చేతులార తాళము వేతు
వేతు కీర్తనల జాలము నీపై
తరలిరాగ తపమును జేతు
నిన్ను హృదయమందు దాచితి
నీతోనే వాసము నే చేసితి

జగము మిథ్య మిథ్య బంధములు
బంధనములు విడగొట్టవేమయ
విశ్వంభర విశ్వ వినుత నీ
నామంబును మీటుతుంటిరా
నిన్ను నమ్ముకుంటిరా విభూ
వేలు పట్టి నడిపించురా ప్రభూ

తుకా శ్రీధరుని దాసులవ్వరే
దాస భక్త మార్గమును పొందరే
సాధుజనుల బ్రోవు స్వామిని
నామ జపము జేసి పొందరే



అనువాదం
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025

# జానపదుల వృత్తివిద్యా నైపుణ్యం

✍ **ఆచార్య తంగెడ కిషన్ రావు,** పూర్వాధ్యక్షులు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్. ఫోన్ : 7702414100





ప్రతి మనిషికీ ఏదో ఒక వృత్తి జీవనాధారం అవుతుంది. పరిసరాలు, ప్రతిభ, ప్రయత్నం తోడుకాగా మనిషికి అబ్బిన గొప్ప విద్య - వృత్తి. మనిషిలో సహజంగా ఉండే సృజనాత్మకతకు రూపకల్పనగా, మనిషి మెదడు పొరలలో నిక్షిప్తంగా దాగి ఉన్న నైపుణ్యానికి గీటు రాళ్లుగా వృత్తులు వెలుగొందుతాయి. గ్రామ జీవితంలో వృత్తిని ఏదో ఒక కులం వంశపారపర్యంగా చేపట్టినా, దాన్ని జీవనాధారంగానే కాక, ఒక కళగా - విద్యగా ఆయా కులస్థులు స్వీకరించారు.

ప్రాచీన కాలం నుండీ మన దేశంలో 'వృత్తి' అనేది జీవనధర్మంగా భావించబడింది. జానపదులకు సంబంధించినంత వరకు వృత్తుల్లో చిన్నా పెద్దా భేద భావాలుండవు. అన్ని వృత్తుల వారూ సమానులే. గ్రామంలో ప్రతి ఇల్లూ ఏదో ఒక వృత్తి కర్మాగారమే. ఇంటి సభ్యులంతా అందులోని కార్మికులే. బాల్యం నుండీ వృత్తిపనుల్లో పాలు పంచుకోవడం వల్ల, వారికి నిశితమైన పరిశీలన ఏర్పడుతుంది. దానివల్ల వృత్తిపై గౌరవభావమే కాకుండా అతి తక్కువ కాలంలోనే అత్యంత నైపుణ్యం అలవడుతుంది. **'వెలి విద్య లెన్నియైనను కుల విద్యకు సాటిరావు'** అనే భావన ఏర్పడింతర్వాత, ఎవరి వృత్తుల పట్ల వారు ఏకాగ్రతను కూడా కనబర్చి, తను శ్రాయశక్తులా వాటి అభివృద్ధికి తోడ్పడ్డారు.

తొలుత ఒకే జాతిగా ఉన్న ప్రజలు, చేసే వృత్తిని బట్టి కులాలుగా విభజింపబడినారని మానవ, సామాజిక శాస్త్రజ్ఞుల్లో కొందరి అభిప్రాయం. ఇది జానపద జీవితాలను పరిశీలించి చూసినప్పుడు నిజమేననిపిస్తుంది. ఇందుకు ఉదాహరణగా 'సవరలు' అనే గిరిజనులను కూడా పేర్కోవచ్చు. సవరజాతి వారిలో కమ్మరి వృత్తిని చేపట్టిన వారిని 'లువారా' అంటారు. మేదర పనిచేస్తున్న వారిని 'కిండాల్' అంటారు. కుమ్మరం పనిచేసే వారిని 'కుంబి' అంటారు. నేతగాళ్లను 'అర్పి' అంటారు. (టి. వెంకట్రావు- 'సవరల జీవన సరళి' అనే గ్రంథం ఆధారంగా)

వృత్తికి - కులానికీ సంబంధించిన విషయాలను పరిశీలించి చూసినప్పుడు కూడా రెండింటి మధ్య గల అవినాభావ సంబంధం స్పష్టమౌతుంది.

**వృత్తి - కులం**

1. వ్యవసాయం - వెలమ, రెడ్డి, కరణం, కమ్మ, కాపు
2. వ్యాపారం - వైశ్య (కోమటి)
3. పౌరోహిత్యం - బ్రాహ్మణులు, వైష్ణవులు
4. నేత - సాలె (పద్మశాలి)
5. బట్టలుతకడం - చాకలి (మడేల్, రజక)
6. క్షురకర్మ - మంగలి (నాయీబ్రాహ్మణ)
7. మట్టి పాత్రలు - కుమ్మరి
8. బంగారు నగలు - కంసాలి, అవుసుల (విశ్వబ్రాహ్మణ)
9. కర్రపని - వడ్రంగి
10. ఇనుప పని - కమ్మరి
11. ఇత్తడి పని - కంచరి
12. రాతి పని - శిల్పి, కాసె, ఒడ్డెర
13. బట్టలు కుట్టడం - మేర (దర్జీ)
14. గృహ నిర్మాణం - ఉప్పరి (సగర)
15. పశువుల పెంపకం - గొల్ల (యాదవ)
16. కంబళ్ల నేత - కురుమ
17. కల్లు గీత - గౌండ్ల (ఈడిగ, కలాలి)
18. నూనె తయారీ - గాండ్ల (తెలికల)
19. చేపలు పట్టడం - బెస్త, జాలరి, తెనుగు (గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ)
20. తోటలకు కాపలా కాయడం - తెనుగు (ముత్తరాసి)
21. కంకబొంగులను చీల్చి ఇంటి సామగ్రిని అల్లడం - మేదరి (మహేంద్ర)



22. చర్మకారులు - మాదిగ (హరిజన) (చెప్పులు కుట్టడం, వ్యవసాయ సంబంధమైన తోలు వస్తువుల తయారీ, ఉత్సవాల్లో డప్పు వాద్యం మొ॥)

23. తాటి మట్ట చీరి ఇంటి సామగ్రిని అల్లడం - ఎరుకల, పందుల పెంపకం

పై పట్టికలో రాని ఇతర కులాలు కూడా ఉన్నాయి. గ్రామాలకు సంబంధించినంత వరకు వారు తమ సంప్రదాయ సిద్ధమైన ఆనువంశిక వృత్తులను నిర్వహిస్తూనే, కొద్దో గొప్పో వ్యవసాయ వృత్తిపైన కూడా ఆధారపడి జీవిస్తున్నారని భావించడం సముచితం. ఈ విధంగా వ్యవసాయ వృత్తి అత్యంత విస్తృతమై అన్ని వృత్తులలోకెల్లా అగ్రగణ్యాన్ని పొందింది.

గ్రామంలోని ప్రజలు ఏదో ఒక కుటుంబానికి చెంది, దానికి సంబంధించిన వృత్తిని ధర్మంగా స్వీకరించి, అమలుపరుస్తూ, తద్వారా గ్రామానికి సేవ చేస్తున్నారు. వృత్తి ధర్మ నిర్వహణలో వారికి ప్రధానంగా కావల్సినవి పనిముట్లు. జీవనభృతికి ఆధారమైన ఈ పనిముట్లను తెల్లవారి నిద్రలేచిం తర్వాత స్పృశించి, కళ్లకు అద్దుకోవడం జానపదుల్లో అతి సాధారణం. ఇది వారి నిర్మల స్వభావానికీ, పనిముట్ల పట్ల వారికి ఉన్న పవిత్ర భావనకూ దర్పణం పట్టే విషయం. ఈ వృత్తులూ - పరికరాల పుట్టుక గురించి జానపదులు ఎన్నెన్నో కథలు చెప్పుకుంటారు. వాటిలో ఉదాహరణకు ఒక కథను పరిశీలించి చూడటం సముచితం. ఈ కథను మాల కులస్తుడు, తూర్పుగూడెం గ్రామం, నల్లగొండ జిల్లా వాస్తవ్యుడైన శ్రీ ఎ.నర్సయ్య (48 సంవత్సరాలు) ద్వారా 1990 సంవత్సరంలో నేను సేకరించాను. కథ సంక్షిప్తంగా ఇలా ఉంటుంది-

పార్వతి కొడుకు మాల చెన్నడు. ఇతడు పార్వతి మాల బట్టల నుండి పుట్టిన వాడు కాబట్టి మాలవాడైనాడు. శంకరుని ఆజ్ఞప్రకారం ఇతనికి నేయి వాసన కూడా చూపకూడదు. నేయి రుచి తగిలితే మదం పెరిగే అవకాశం ఉన్నది. మదం వల్ల నీచబుద్ధి కల్గుతుంది. శివుడు లేని సమయంలో చెన్నడు తన కోరికను తల్లి ముందు పెట్టగా, ఆమె పుత్ర వాత్సల్యంతో వెన్న తీసిన మజ్జిగ పోస్తుంది. ఆ రుచి అతనికి చాలా గొప్పగా తోస్తుంది. ఈ చల్ల ఇంత బాగా ఉంటే, ఈ చల్లను ఇచ్చే కామధేనువు ఇంకెంత రుచిగా ఉంటుందో అనే ఆలోచన కల్గుతుంది. ఇతని దృష్టి తగిలిన కామధేనువు మరణిస్తుంది. కామధేనువు మరణానికి కారణం ఎవరికీ తెలియదు.

దేవతలందరికీ మరణించిన కామధేనువును వండుకొని తినాలనే కోరిక కల్గుతుంది. చనిపోయిన ఆ గోవును లేపేందుకు దేవతలందరి శక్తి కూడా సరిపోదు. అపుడు ఒక కొండపై ఉన్న మహాబలశాలియైన 'మహా' అనేవాడి సహాయాన్ని అర్థిస్తారు. 'మహా' అనేది జాంబవంతుని కున్న మరో పేరు. వారంతా గోవు ఒక పక్కను పట్టుకుంటే, 'మహా' ఒక్కడే ఒక పక్క పట్టి లేపుతాడు. అందరూ కలిసి దాన్ని వంటకానికి సిద్ధం చేస్తారు. తుక తుక ఉడుకుతున్న కామధేనువు ముక్కల్లో నుండి ఒక ముక్క కిందపడుతుంది. దానికి అంటిన మట్టిని తొలగించేందుకు మాలచెన్నడు నోటితో 'ఉఫ్' అని ఊది బాండువా (వంటపాత్ర)లో పడేస్తాడు. దాన్ని చూసిన మిగతా దేవతలు వంటకం అపవిత్రమైందని భావిస్తారు. దాన్ని తినకూడదని నిర్ణయించుకుంటారు. అపుడు 'మహా' ఆ కామధేనువు బొక్కలన్నిటినీ బయటికి తీస్తాడు. వాటితో పనిముట్లను తయారు చేస్తాడు. వాటిని అక్కడున్న దేవతలకు తలా ఒకటి పంచి, వాటిని ఉపయోగించుకొమ్మని తెల్పుతాడు - ఈ విధంగా పనిముట్ల వల్ల వృత్తి విభజనను 'మహా' యే కల్గిస్తాడు.

కామధేనువు ఎముకల నుండి తయారైన పనిముట్ల పుట్టుకను తెల్పే ఈ కథకూ, దధీచిముని ఎముకలతో తయారైన పురాణాల్లోని వజ్రాయుధపు పుట్టుకకూ కొన్ని పోలికలు కన్పిస్తాయి. ఈ విధంగా - విషయం ఏదైనా శ్రమ విభజన వృత్తుల ద్వారానే జరిగింది. వృత్తుల నిర్వహణకు పరికరాల అవసరం ఏర్పడింది అని జానపదుల విశ్వాసం. పరికరాల సహకారంతో నడిచే ఈ వృత్తుల పరిశీలనలో ప్రధానమైన వ్యవసాయాన్ని తొలుత పరిశీలిద్దాం-

**1. వ్యవసాయం :**

ఆదిమ దశలో ఆహార సేకరణ, ఆటవిక దశలో వేటద్వారా ఆహార సంపాదన, ఆ తర్వాత స్థిర నివాసాన్ని పెంపొందింప జేసుకొన్న మానవునికి వ్యవసాయం వృత్తిగా పరిణమించింది. మన దేశంలో సుమారు 70 శాతం మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు. అందులో 80 శాతం మంది వ్యవసాయాన్ని నమ్ముకొని బ్రతుకుతున్నారు. వారిలో భూమి స్వంతదార్లు, కౌలుదార్లు మరియు కూలీలు కూడా ఉన్నారు. సామాజిక సేవలోనే కాక, కేవలం వ్యవసాయపు పనిముట్లకు ప్రత్యేకంగా అంకితమైన వృత్తులు కూడా ఉన్నాయి. వడ్రంగి, కమ్మరి మొదలైన వృత్తులవారు గృహ సంబంధమైన వస్తువులను తయారు చేసినా, ప్రధానంగా వ్యవసాయపు పనులకు సంబంధించిన పరికరాలను కూడా సృష్టిస్తారు. 'బండి' మొదలైన వాటిని అందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. వీటిలో కఱ్ఱ పనిని వడ్రంగి చేస్తే, ఇనుప పనిని కమ్మరి చేస్తాడు. అందువల్ల వీటిని జంట వృత్తులుగా కూడా భావించవచ్చు.

ప్రజారంజకుడుగా పరిపాలనను సాగించిన శ్రీకృష్ణ దేవరాయలు (క్రీ.శ. 1487-1530) కూడా తన ఆముక్త మాల్యద కావ్యంలో వ్యవసాయ సంబంధమైన విషయాలెన్నిటినో వివరించాడు - అందులో పంట చేలకు నీరు తోడే 'ఏతాం' ఉంది-

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025

**".....సొగసై పాటిల్లె కుంభోంభనో / ద్భూతాంబు ధ్వని వాద్యమై.... / ... నంధు యంత్ర నతి కృత్రోద్గీత గేయౌఘముల్..."**(2-55) అనగా, అంధు యంత్రాలు అనబడే 'ఏతాము'లను తొక్కుతున్న జనుల పాటలకు, మునుగుతున్న ఏతాం కుండల నుండి పుట్టిన నీళ్ల చప్పుడు మద్దెల ధ్వని వలె సొగసుగా ఒప్పింది. వ్యవసాయానికి ప్రధానంగా కావల్సింది నీటి వసతి- **".... నేతములెత్తి కాల్వలుం / బాయలు, గోళ్లనూతులును బావులు రాట్నములున్ జలార్థమై చేయగ నామె....."** (6-70) అని, కొరవి గోపరాజు (క్రీ.శ. 1384- 1429) సింహాసన ద్వాత్రింశిక'లో ఇతర నీటి వసతులను తెల్పుతూ, వాటిలో నీటిని తోడే సాధనాలైన ఏతామును, రాట్నాన్ని కూడా వర్ణిస్తాడు.

వ్యవసాయానికి సంబంధించిన పంట చేలలో ప్రధానంగా కనబడేది 'మంచె'. జొన్న, చెరకు, మిరప మొదలైన చేండ్లు పంటకు వచ్చింతర్వాత దొంగలు, జంతువులు, పిట్టల బెడద ఆ చేలకు పడుతుంది. అందువల్ల రాత్రింబవళ్లూ వాటికి కాపలా అవసరం. అందుకుగాను చేను ఏ మూల చూసినా కనబడేందుకు రైతులు 'మంచె'ను నిర్మించుకొని కాపలా కాస్తారు. ఎత్తయిన నాలుగు కర్రలతో మంచం వంటి ఒక వేదికను రూపొందించడమే ఈ 'మంచె'. ఈ నిర్మాణం నేటి బహిరంగ సభలకు సంబంధించిన ఎత్తయిన వేదికలకు ఆదర్శంగా నిల్చింది. మంచెపై నుండి చేనుకు కాపలా కాయడం అంటే పంటకు రక్షణగా ఉండడమే. ఈ విధంగా వ్యవసాయ వృత్తికి సంబంధించిన 'కాపలా' పదం 'కాపు' కులానికి పరిమితమైంది. **"పంట భాగ్యాన్ని కల్గి పంటపై పంటలు పండించి పాడిపంట కల్గిన యా పంటలు మొదలైన కాపు ప్రజలానగరిన్"** (బాలకాండ-12) అని మొల్ల కవయిత్రి (క్రీ.శ. 16వ శతాబ్దం పూర్వార్ధం) తన రామాయణ కావ్యంలో 'కాపు'లను ప్రస్తుతించింది. కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక కావ్యం -

**".....అగిసెలు లంకెలు / గోధుమల్ జొన్నల్ గోరి విత్తి / పిట్టల ద్రోల నా పుట్ట పట్టున మంచె / గావించి యది యెక్కు"** (1-171) అని, మంచెను పిట్టలను పారదోలేందుకు ఉపయోగపడే నిర్మాణంగా వర్ణించింది. ధాన్యపు కంకులపై వాలే పిట్టలను పారదోలేటప్పుడు చేతిలో 'ఒడిసెల'ను పట్టుకొని, అందులో 'రాయి'ని ఉంచి వేగంగా విసిరితే ఆ రాయి పిట్టలను పారదోలుతుంది. నాచన సోముడు తన ఉత్తర హరివంశ కావ్యం (క్రీ.శ.1334-90)లో - **"ఒడిసెల జొన్నల కాచెడి / వడుపున పౌండ్రుడు తాలవై చెంబెలుచన్"** (3-103) అని, పౌండ్రుకి యుద్ధ పద్ధతిని తెల్పే సందర్భంలో ఒడిసెలతో రాళ్లు విసరడాన్ని వర్ణించాడు.

పిట్టల బారి నుండి పంట చేలను కాపాడేందుకు ఉపయోగపడే ఇంకొక సాధనం దిష్టిబొమ్మ. గ్రామంలోని ప్రతి చేనులోనూ నేటికీ మనకు కనిపించే సామాన్య దృశ్యమే ఇది. శ్రీ కాళహస్తి మాహాత్మ్య కావ్యంలో ధూర్జటి కవి (క్రీ.శ. 16 శతాబ్దం) **"బొమ్మలం దవిద**



**చేలం జేయుదుర్మాపుగన్"** (3-7) అని, ఆనాటి వ్యవసాయదారులు దిష్టిబొమ్మ ఆకారాన్ని అగరు కట్టెలతో తయారు చేసి, చామరాలను జుట్టుగా చుట్టి, ఏనుగు కుంభాలలోని ముత్యాలను కనుగుడ్లుగా పెట్టి తయారుచేసిన పద్ధతిని వర్ణించాడు. పిట్టలు - దిష్టిబొమ్మను చూసి చేసుకు కాపలాగా ఉన్న మనిషిగా భ్రమపడి చేనులోకి ప్రవేశించవు ఈ విధంగా దిష్టిబొమ్మ చేలకు రక్షణగా నిలుస్తుంది.

**2. పశుపోషణ - గొల్లలు :**

వ్యవసాయానికి ముఖ్యంగా తోడ్పడేవి పశువులు. నాగలికీ, మోటకూ, బండికే కాక వ్యవసాయ వృత్తిలో అడుగడుగునా పశువుల అవసరం ఏర్పడుతుంది. ఈ పశువులను పోషించడం కూడా గ్రామాలకు సంబంధించినంత వరకు ఒక వృత్తి పరమైన విషయమే. ఈ వృత్తి పోషకులు 'గొల్లలు'గా పిలువబడే యాదవజాతివారు. ఆవులు, ఎద్దులు, బఱ్ఱెలు, దున్నపోతులతోపాటు గొఱ్ఱెలు, మేకలను కూడా వీరు పోషించి పాలు, పెరుగులను అమ్మి పాడి పరిశ్రమలో భాగస్వాములు అవుతున్నారు. ఈ విధంగా పాడి పశువులు గొల్లల వృత్తిగా పేరుపొందినాయి. **"...... మొల .. బెట్టిన పిల్ల / గ్రోలు మూపున నిడుకొన్న గొడ్డలియు / నొసవుగా ముసుగిడ్డ యోర గొంగడియు"** అని, గొల్లల వేషాన్ని గౌరన కవి (క్రీ.శ. 1384- 1429) నవనాథ చరిత్ర కావ్యం వర్ణిస్తూ, గొల్లల వృత్తికి ముఖ్యమైన గొడ్డలిని గూర్చి కూడా తెలియజేసింది. పొడవైన కామ (కర్ర)కు చివరగా చిన్న పరిమాణపు ఇనుపగొడ్డలి ఉంటుంది. గొల్ల ఎటువంటి చెట్టుపైకైనా ఎక్కి గొడ్డలితో ఆకులను, రెమ్మలను, చిన్న చిన్న కొమ్మలను కొట్టి వాటిని తాను కాసే పశువులకు 'దానా'గా వేస్తాడు. ఈ విధంగా పశువులకు ఎప్పుడేమీ కావాలో తెలుసుకొని వాటి సాహచర్యంలోనే తాదాత్మ్యతను పొంది పశువుల అభివృద్ధికి కారకుడై తద్వారా వ్యవసాయానికి తోడ్పడుతాడు. అతని భుజాన ఉండే 'గొంగడి' అతడు పరుచుకునే దుప్పటిగానే కాకుండా చేల నుండి ఇంటికి వెళ్లేటప్పుడు కూరగాయలను, రైతుల వద్ద నుండి చిన్న మొత్తపు ధాన్యాన్ని తీసుకుపోయే సాధనంగా కూడా తోడ్పడుతూ అతన్ని అంటిపెట్టుకునే ఉంటుంది. ఈ గొంగడిని అతడు కాసే 'గొఱ్ఱె బొచ్చు'తో గొల్లల్లోని ఒక తెగ వారైన 'కురుమ' వారు నేస్తారు. **"మా పసులును గలిగిన నటు / నే పగిదిని బ్రతుకరాదె"** (5-220) అని, పశువుల మంద ఉ



న్నప్పుడు ఈ ఊళ్లోనే కాదు, ఎక్కడైనా బ్రతుక గలం అని, యాదవులు ధీమాను వ్యక్తం చేసిన విషయాన్ని, ఎఱ్ఱా ప్రగడ కవి (క్రీ.శ. 14వ శతాబ్దం పూర్వార్ధం) తన హరివంశ కావ్యం పూర్వ భాగంలో ప్రస్తావించాడు. పశువులు - పాడికీ, వ్యవసాయపు పనులకూ సంబంధించినవి కాబట్టి ఇవి సంపదకు చిహ్నాలుగా ఒప్పుతున్నాయి. అందుకే వీటిని విశాఖ మాండలికంలో 'సొమ్ములు' అని కూడా అంటారు. మహాభారతంలోని ఉత్తర, దక్షిణ గోగ్రహణాలు కూడా గో సంపదకున్న విలువను తెలియజేస్తాయి.

చిన్ని కృష్ణుని అల్లరిలో పాలు, పెరుగు, వెన్నల దొంగతనం కూడా ప్రముఖమైంది. ఇన్ని విషయాల వల్ల నాటి గొల్ల కులాల్లోని పశుసంపద, పాడి అభివృద్ధి విదితమౌతున్నాయి. ఈ ప్రాధాన్యతల వల్లనే పశుపాలన కూడా ఒక వృత్తిగా గౌరవాభిమానాలు పొందగల్గింది- **"కరిసనమును బేహారము / నరసి పసులం గూర్చుటయును ననగా వృత్తుల్ / నరులకు నిందెవ్వనికే / వెరవు చితం బడియ వానిలేల్పై యుండున్"** (7-130) అని, శ్రీకృష్ణుడు గొల్లవారిలో ఎవరి వృత్తి వారికి దైవంతో సమానమని (డిగ్నిటీ ఆఫ్ లేబర్) తెల్పిన విషయాన్ని, హరివంశ కావ్యం పూర్వ భాగంలో ఎఱ్ఱన వివరించాడు. అందుకే శ్రీకృష్ణుడు అవతార పురుషునిగా కంటే, జానపదుల్లో ఒక గోపాలకునిగానే ఎక్కువ ప్రసిద్ధిని పొందినాడు.

**3. కుమ్మరి :**

గ్రామాల్లో మరో ముఖ్యమైన వృత్తి 'కుమ్మరం'. వీరు తయారు చేసే మట్టిపాత్రల అవసరం ప్రతి ఇంటికీ ఉంటుంది. వంట కుండలు, నీళ్ల కడవలు, ముంతలు, ధాన్యపు కాగులు, నీళ్ల గోలాలు, ఇంటిగూన, కల్లు బింకులు మొదలైన వాటి నెన్నిటినో కుమ్మరి మట్టితో తయారు చేస్తాడు. వీటి తయారీకి కుమ్మరి ఉపయోగించే పరికరం - 'సారె' అనే చక్రం. భారత యుద్ధారంభ సూచకంగా పాండవులు మ్రోగించిన రణభేరి చప్పుడుకు - **"ధాత్రి కుమ్మరి సారె విధమున దిరిగె"** (4-116) అని, తిక్కన కవి (క్రీ.శ.1210-90) మహాభారతం, ఉద్యోగ పర్వంలో వర్ణిస్తాడు.

కుమ్మరి మట్టి పాత్రల తయారీ 'మృణ్మయ కళ' అనే పేరుతో మానవ నాగరికతకు, మేధస్సుకు, కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుంది. మట్టిపాత్రలు తయారు చేసేందుకు కుమ్మరి ఎండిన చెరువులో నుండి మట్టిని తీసుకురావడం మొదటి దశ. దానిని 'రాగిమట్టి' అని పిలుస్తారు. అది ఇంటికి తేబడిన తర్వాత రాశిగా పోసి, మధ్యలో గుంటను చేసి అందులో నీటిని పోసి, మట్టిని కలగలిపి, కాళ్లతో గట్టిగా పిసికి మెత్తగా తయారుచేయడం ఉంటుంది. ఈ విధంగా మట్టిని పిసికి మెత్తగా చేయడం రొట్టెల పిండిని అదిమినట్టు ఉంటుంది. బండి చక్రం వంటి 'సారె' మధ్య భాగంలో మట్టిని అమర్చి, సారెను కర్రతో వేగంగా తిప్పుతున్నప్పుడు ఆ మట్టికి ఒక ఆకృతి ఏర్పడుతుంది. దానిని కుమ్మరి తన చేతివేళ్ల కొసల నైపుణ్యంతో తనకు అనుకూలంగా చేసుకొని తనకు కావాల్సిన పాత్ర ఆకారానికి మలుచుకుంటాడు. ఈ విధంగా కుమ్మరి సారె నుండి మట్టిపాత్ర సంపూర్ణమైన ఆకారంతో కుమ్మరి చేతుల మీదుగా తయారు కావడం, స్త్రీ గర్భం నుండి మంత్రసాని సహాయంతో శిశువు బయటికి వచ్చే దృశ్యాన్ని స్ఫురణకు తెస్తుంది.

ఈ విధంగా తయారైన పచ్చి పాత్రను ఎండలో పెట్టడం, కొంత ఎండిన తర్వాత పాత్రలోపలి భాగాన్ని 'గుండ్రాయి'తో వెలుపలి భాగాన్ని 'చెక్క'తో చదును చేయడం, తర్వాత 'ఆవం'లో పేర్చి కాల్చడం ఉంటాయి. **"......కుమ్మరావమున రాగి /ముంత లేఅంగ గలవె నీకింత మేల"** (3-48) అని, నాచన సోమన ఉత్తర హరివంశ కావ్యం, కుమ్మరావపు పనిని తన కావ్యంలో పేర్కొంది.

ఈ మట్టిపాత్రలు ఎంతగా ఉపయోగానికి వస్తాయో, అంతే సునిశితత్వాన్ని కూడా కలిగి ఉంటాయి. ఏ కొంచెం దెబ్బ తగిలినా ఎంతో శ్రమకోర్చి చేసిన పాత్రలు పెంకులుగా పగిలిపోతాయి. ఇదే విషయాన్ని ధూర్జటి కవి - **"...కుమ్మరికొక యేడును / గుదె కొక పెట్టన్న మాటకున్ సరివచ్చెన్"** (2-99) అని, శ్రీకాళహస్తి మహాత్మ్య కావ్యంలో, నిర్మాణం ఎంత కష్టమో, నిర్మూలించడం అంత సులభం అనే అర్థంతో సామెతగా ప్రయోగించాడు.

**4. గాండ్ల :**

ఆహార పదార్థాల తయారీకి 'మంచినూనె' అవసరం ఉంటుంది. ఈ 'మంచినూనె' (వంటనూనె)ను తయారు చేయడం కూడా ఒక వృత్తియే. దీనిని 'గానుగ' అనే యంత్రం సహాయంతో ఉత్పత్తి చేసేవారిని 'గాండ్ల' లేదా 'తెలికలు'గా జానపదులు వ్యవహరిస్తారు. వృత్తికి సంబంధమైన 'గానుగ' యంత్రం వల్లనే వీరికి 'గాండ్ల' (గానుగ శబ్దభవం) వారు అనే పేరు కులపరంగా సార్థకమైంది. ఈ గానుగ యంత్రం ఒక పెద్ద రోలు, ఒక పట్టె (ఇరుసువంటి పెద్దకర్ర), రెండు ఎద్దుల సాయంతో నడుస్తుంది.

ప్రాచీనమైన ఈ గానుగ యంత్రమే నేటి 'గ్రైండింగ్ మిషన్' తయారీకి రూపకల్పన చేసి ఉంటుంది. **"తా తిరుపుటెద్దు ప్రతోపము మోపి రొప్పుచున్ / గానుగ పట్టెపై తిరుగ"** (పద్యం - 103) అని,

గానుగకు ఆధారమైన పట్టెపై కూర్చొని గానుగను కట్టే గాండ్ల స్త్రీని గూర్చి, శ్రీనాథుడు (క్రీ.శ. 1370–1450) క్రీడాభిరామం కావ్యంలో వర్ణిస్తాడు.

**5. బెస్త :**

గంగపుత్రులు, జాలరులు అని పిలువబడే బెస్త వారు చేపలను పట్టడం వృత్తిగా కల్గి ఉన్నారు. మాంసాహారమైన చేపలను – చెరువులు, వాగులు, ఏటికాలువలు, బావుల్లో వలలు వేసి పట్టి, వాటిని అమ్ముకొని జీవిస్తారు.

చేపలు పట్టే వలకు 'జాలము' అనే పేరుంది. జాలముతో చేపలు పట్టి జీవించే జాతివారు కాబట్టి వీరికి 'జాలరి' అని పేరు వచ్చింది. **"జాలిఁ బడి పాఱు జలచర / జాలంబులఁ బోవనీక చనిరోషాగ్ని / జ్వాలలు నిగుడక నూరక / జాలంబులు వైచి పట్టు జాలరులంతన్"** అని, ఈ జాలములతో జలచరాలను పట్టే జాలరులను గూర్చి పోతన కవి (క్రీ.శ. 1400–50) భాగవత కావ్యం, దశమ స్కంధం, ఉత్తర భాగంలో పేర్కొన్నాడు.

**6. సాలె :**

ప్రతి మనిషికీ అవసరమయ్యే కట్టుకునే బట్ట నిచ్చేది సాలెవారి నేత పరిశ్రమ – **"…. కు విందుకు చంద్రికా పటంబు / నేయ బన్నిన మగ్గమొకో యనంగ"** (8–15) అని, సాలె – మగ్గంపై నేసే వస్త్రాన్ని గురించి పింగళి సూరన (క్రీ.శ. 16వ శతాబ్దం) తన కళాపూర్ణోదయ కావ్యంలో వర్ణించి తనకాలపు నేత గాళ్ల సామర్థ్యాన్ని వ్యక్తం చేశాడు. సాలెవారి వృత్తికి ప్రధానమై, బట్టల నేతకు పనికి వచ్చే యంత్రాన్ని 'మగ్గం' అనే పేరుతో పిలుస్తారు. నూలు వడకడం, కండెలు పట్టడం, రంగులు వేయడం, ఆసుపోయడం, పడుగు వేయడం, అచ్చు అతకడం, అల్లు చేయడం ఐన తర్వాతే పడుగు, మగ్గం మీదికి ఎక్కుతుంది. అప్పుడే నేత పని మొదలవుతుంది. కాలూ, చెయ్యీ, కన్నూ పోగు కదలిక మీదే ఏకాగ్రతతో నిల్చి పనిచేసే వృత్తి ఇది. ఈ మగ్గపు నేతలో పలు రకాల వస్త్రాలు తయారైనా చీరెల తయారీయే అందులో ఎక్కువ భాగాన్ని పంచుకొంటుంది. అందుకే వస్త్ర పరిశ్రమలో చీరెలు ఎంతో వైవిధ్యాన్ని పొందగలిగాయి. ఈ విషయాన్నే – **"వోరు గంటిలోన వొక వీధిలోన / వొప్పంగ నేసిన ఆ సాలివారు / కట్టనే కొంగదే కళివి పూనేత / బిరుసుట్ట కొంగదే బీరపూనేత / తూగాడె కొంగదే తుమ్మ పూనేత / ముసుగానే కొంగదే మునగపూనేత"** అంటూ – సాలెవారి కళాత్మకమైన చేనేత చీరెలను గూర్చిన జానపద గేయాన్ని డా. తూమాటి దొణప్ప, తమ 'జానపద కళా సంపద' గ్రంథంలో పేర్కొన్నారు.

చీరెలతో పాటు – దోవతులు, కండువాలు, అంగీలకు కావల్సిన గుడ్డలు, దుప్పట్లు మొదలైన వస్త్ర సంపద అంతా సాలెవారి చేనేతలో విలసిల్లుతుంది.

**7. కుట్టుపని :**

ధరించే బట్టలను కుట్టి ఇచ్చే వృత్తి కళాకారుడు దర్జీ. ఈ వృత్తిని 'మేర' అనే పేరుతో జానపదులు వ్యవహరిస్తారు.

జానపదులు బట్టలను కుట్టించుకొనే విషయాన్ని చర్చించు కొన్నప్పుడు చేతి కుట్టు, మిషన్ కుట్టు అని కుట్టును రెండు రకాలుగా పేర్కొంటారు. మిషన్ కుట్టు చాలా వరకు వృత్తి పరంగా దర్జీలు చేస్తే, చేతికుట్టు జానపదుల్లో దాదాపు ప్రతి గృహిణీ చేస్తుంది. అందువల్ల – సూదీ, దారం లేని గృహం గ్రామాలకు సంబంధించినంత వరకు ఉండదు. పాత బట్టలు, చినిగిన బట్టలే కాకుండా చిన్న పిల్లల బట్టలు, సంచులు మొదలైన వాటిని కూడా ఇంట్లోనే చేతికుట్టుద్వారా జానపదులు కుట్టుకుంటారు.

అల్లికలు కూడా చేతి కుట్టులో ఒక భాగమే. బొమ్మలు, డిజైన్లు, అద్దాలు మాత్రమే కాకుండా బంగారు పురుగుల మెరిసే రెక్కలను అద్దాల బిళ్లలవలె కత్తిరించి కుట్టుకోవడం జానపదుల్లో ప్రత్యేకం. ఇది వారిలోని ప్రకృతి ప్రియత్వాన్ని సూచించే అంశం కూడా. రంగనాథ రామాయణం (క్రీ.శ. 13వ శతాబ్దం) బాలకొండలో స్త్రీల రవికెలపై గల కుట్టు పని తెలుపబడింది. – **"బంగారు సరిగె కన్పడు కుట్టుపనుల / కంగుల ఱయికలు కనుపట్ల దొడిగి"** అని, సీతను పెళ్లి కూతురుగా అలంకరించినప్పుడు ఆమె రవికపై గల కుట్టుపనులను కనిపించేలా ధరింపజేశారు.

పెళ్లి కూతురు తొడిగే రవికపట్ల కొందరు జానపదులు ప్రత్యేకమైన ఆచారాన్ని పాటిస్తారు. పెళ్లి కూతురు రవికపై కత్తెర మోపరాదు అనే నమ్మకాన్ని కలిగి, దానిని చేతితోనే చింపి, చేతి కుట్టు వేస్తారు. దీనిని 'రవిక చింపు' అని పిలుస్తారు.

మిషన్ కుట్టు కంటే ముందలి దశ కేవలం చేతికుట్టు అనేది సర్వ సామాన్యమైన విషయం. బట్టలు కత్తిరించి కుట్టడం కంటే ముందు వస్త్రానికి కావలసిన కొలత తీసుకోవడం ఉంటుంది. దీనికి కొలత పట్టె (టేపు)ను ఉపయోగిస్తారు. జానతో కొలవడం అనేది, కొలత పట్టె కంటే ముందలి దశ. ఇదే విషయాన్ని – **"కొలుచును జేనపట్టి… / సౌచిక పల్లవుండు"** అని, శ్రీనాథుడు క్రీడాభిరామం (106 పద్యం)లో వర్ణించి, తన కాలంలోని బట్టలను కుట్టే వృత్తి జనులున్న విషయాన్ని, తన కావ్యం ద్వారా తెలియజేసి, వారికి గౌరవాన్ని ఆపాదించాడు.

**8. చాకలి :**

కట్టుకునే బట్టలను ప్రతి రోజూ ఉతికి శుభ్ర పరచే పనిని చేసేందుకు, ప్రత్యేకంగా రజక వృత్తి జానపదుల్లో ఉంది. వీరిని 'చాకలి' వారిగా వ్యవహారంలో పేర్కొంటారు. వీరు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి మాసిన బట్టలను మూటలో కట్టుకొని, 'రేవు' కు తీసుకువెళ్లి ఉ తికి, అక్కడే ఆరవేసి, మళ్లీ ఎవరి బట్టలు వారికి అప్పగిస్తారు. ఈ విధంగా ఒక్కొక్క చాకలి కుటుంబానికి ఊర్లో వాళ్ల ఇళ్లు వృత్తి పరంగా

హక్కును కల్గి ఉంటాయి. కొన్ని వందల బట్టలను ప్రతిరోజూ ఉతకడం, మళ్లీ ఎవరివి వారికి మూటగా కట్టి ఒక్కటి కూడా అటూ ఇటూ పోకుండా అప్పగించడం అనేది జ్ఞాపకశక్తికి సంబంధించిన అంశం. అందుకే 'చదువు కున్నోని కన్నా చాకలి నయం' అనే మాట సామెతలా వ్యాపించింది.

పాల్కురికి సోమనాథుని (క్రీ.శ. 13వ శతాబ్దం పూర్వార్ధం) బసవ పురాణం నాల్గవ ఆశ్వాసం, అనేకులైన భక్తుల కథల్లో భాగంగా 'మడివేలు మాచయ్య'ను గూర్చి వర్ణించింది. **"మాసిన వస్త్రముల్ మఱిమోసికొనుచు / వేపుజామున నేగి వేఁతొక్క రేవు / గావించి ముదుకుచు ఘట్టనల్ సేసి"** అని, మడివాలు మాచయ్య తన చాకలి కులవృత్తిని చక్కగా నిర్వర్తించిన విషయం బసవ పురాణం కావ్యం వల్ల తెలుస్తుంది.

మడేల్, మడేలన్న, మడియేలు అనే పదాలు చాకలి కులానికి మారుపేర్లు. అది వారికి కులదైవం వల్ల అబ్బింది. **"మైల చీరెల చాకి మ్రోల నెదిరె"** అని, కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక (1-231)లో కూడా చాకలి వృత్తికి సంబంధించిన ప్రసక్తి వస్తుంది. **"..... ఉదికిన చీర లాఱు / చాకిరేవు లగములయ్యె సకల దిశలు"** అని, 'చాకిరేవు' గూర్చి శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్త మాల్యద (2-46)లో వివరిస్తాడు.

ఈ చాకిరేవుల్లో ప్రత్యేకంగా 'బాన'లను ఏర్పాటు చేసుకుంటారు. ఇవి పెద్ద పరిమాణంలో ఉండే కుండలు. వీటిలో బాగా మాసిన బట్టలను, పెద్దపెద్ద దుప్పట్లను ఉడకబెట్టి, ఆ తర్వాత ఉతుకుతారు. వీటిని 'చాకి బానలు' అనే పేరుతో జానపదులు పిలుస్తారు.

**9. మంగలి :**

వృత్తిపరంగా గ్రామంలోని ఇళ్లను పంచుకునే ఇంకొక వృత్తి కళాకారులు క్షుర కర్మ (క్షౌరం)ను నిర్వర్తించే మంగలివారు.

క్షుర కర్మలో కూడా శుభదినాన్ని, శుభ సమయాన్నీ జానపదులు విశ్వసిస్తారు. మంగళవారాన్ని క్షురకర్మకు పనికిరాని రోజుగా నేటికీ పాటిస్తున్నారు. క్షురకర్మ పట్ల ఈ విధమైన నమ్మకం ఉన్నట్లు - **"తారకంబులు తిథులను వారములను / జొస్పు లెఱిగించినవి మేలు సుప్రతైక / లోల మంగలి పనికిని తైలమునకు"** అని, మహాభారత అనుశాసనిక పర్వం (4-121) కూడా వివరించింది. క్షురకర్మను జానపదుల మాట అయిన 'మంగలిపని' గానే తిక్కన కవి పేర్కొనడం గమనించ తగిన అంశం.

తమ వృత్తికి సంబంధించిన కత్తెర, దువ్వెన, అద్దం, గోరుగల్లు (గోర్లు తీసే సాధనం), కత్తి, సల్ప (సానబట్టే నునుపైన చిన్నరాయి) మొదలైన పరికరాలను మంగలివారు తోలుపెట్టెలో అమర్చుకుంటారు. దీన్ని వారు 'మంగలి కల్ప' (బార్బర్స్ కిట్) గా పేర్కొంటారు. ఈ కల్పను గ్రామాల్లో చర్మకారులైన మాదిగలు తయారుచేసి ఇస్తారు. ఈ పెట్టెను పట్టుకొని గ్రామాల్లో తమ ఆసాముల ఇళ్లకే వెళ్లి మంగలివారు క్షురక్షర చేస్తారు.

**10. వడ్రంగి :**

రైతులకు ప్రధానంగా తోడ్పడుతూ వ్యవసాయ వృత్తికి ఉపవృత్తిగా పేరు పొందింది వడ్రంగం గృహానికి కావాల్సిన మంచాలు, కుర్చీలు, పీటలు- గృహ నిర్మాణానికి అవసరమైన ద్వారాలు, కిటికీలు, మొదలైన కర్ర పనిని వడ్రంగి చేసినప్పటికీ గ్రామాల్లో అతనిపై ఎక్కువగా ఆధారపడేది రైతులే. రైతులకు కావల్సిన సాధనాలెన్నింటినో వడ్రంగి తయారు చేసి ఇస్తాడు.

పాల్కురికి సోమనాథ కవి- **"చటుల సంస్కృతి జీవ ఘట చక్ర కర్మ / పటు పరివర్తన భ్రమణంబు కూర్చి / కీలు వొందించి యాక్రియ రాటనముల / వాలి యాడించు నా వడ్రంగి యతడ"** అని, వడ్రంగపు వృత్తి ప్రాధాన్యతను బసవ పురాణ కావ్యం (4 వ ఆశ్వాసం)లో అత్యంత గౌరవంగా పేర్కొన్నాడు.

బాడిస, ఉంపం, ఉలి, దుగోడ అనే పనిముట్లను వాడి, వడ్రంగి తన వృత్తి పనులను కొనసాగిస్తాడు. ఈ పరికరాల సహాయంతో ఎంత పెద్ద కర్రనైనా తనకు అనుకూలంగా మల్చుకొని వృత్తిని నిర్వహిస్తాడు. అందువల్లనే ఈ పరికరాల ప్రాధాన్యాన్ని మహాభారత విరాట పర్వం (5-35)లో తిక్కన కవి కూడా సందర్భానుసారంగా వాడుకొని వీటిని ప్రస్తుతించాడు- **"బాడిస నఱకిన భంగి గొన్నింటి దు / త్తు నియలుగా బిట్ట ద్రుంచి త్రుంచి / వెస అంపమున నిడ్డ వసిగ గొన్నిటి నిసు / మంతలుగా నుఱుమాడి యాడి"** అని, ఉత్తర గో గ్రహణ సందర్భంగా కౌరవసైన్యాన్ని అర్జునుడు తునుమాడిన సందర్భంలో బాడిస, అంపాలు చేసే పనిని కవి ప్రయోగించడం మనం గమనించవచ్చు.

**11. కమ్మరి :**

వ్యవసాయానికి ప్రధాన పరికరమై, బలరాముని ఆయుధంగా పురాణ ప్రసిద్ధి పొందిన నాగలిని వడ్రంగి తయారు చేస్తే - వాడిగా, పదునుగా ఉండి దున్నే సమయంలో నేలను చీల్చేందుకు ఉపయోగపడే నాగలి 'కర్రు'ను తయారు చేసేది - కమ్మరి.

కారుతున్న నీళ్ల కాగును కొలిమిలో పెట్టి దానిలోపలి భాగంలో ఆయస్కాంతపు ముక్కలను వేసి అతుకుపెట్టిన విషయాన్ని - **"అలపర్జన్యుడు భానుఁ డక్కొలిమిలో నభ్రంపు బెన్గొప్పెరన్ / జలమాగన్ బిడుగుక్కు ఔత్యపు టయస్కాంతంబు నత్తున్కలో పల జూప"** అని, ఆముక్త మాల్యద కావ్యం (4-80)లో శ్రీకృష్ణ దేవరాయలు కమ్మరి నైపుణ్యాన్ని వివరించాడు.

పొన్నిగంటి తెలగన (క్రీ.శ. 15వ శతాబ్దం పూర్వార్ధం) తన యయాతి చరిత్ర కావ్యంలో - **"సరగ మిన్నను కమ్మరి సంజ కొలిమి / బెట్టుగాఁ గాల్చి బంగారు చుట్టువాలు / పదను వెట్టగ గొనుపోమి"**

(2-68) అని, సూర్యాస్త సమయాన్ని వర్ణిస్తూ అందులో కమ్మరి వృత్తిని దర్శింపజేశాడు. **'సంధ్యా సమయం అనే కొలిమిలో బంగారు చక్రాన్ని పదునుపెట్టడానికి తీసుకుని పోవడం'**పై వర్ణనలో తెలుపబడింది. నిజానికి కమ్మరి కొలిమిలో అగ్నికీలల మధ్య పదును పెట్టబడేది - ఇనుము తప్ప బంగారం కాదు. కవి తన వర్ణనా సౌలభ్యం కోసం ఇనుముకు బదులు బంగారాన్ని అతిశయోక్తిగా ప్రయోగించాడు.

కొలిమిలో - ఇనుము పూర్తి ఎర్రగా కాల్చబడి పదును పెట్టబడిన తర్వాత, మెత్తబడి పరికరాల తయారీకి అనుకూలంగా మలచబడు తుంది. కమ్మరి వృత్తిలో కొలిమి చేసే పని ప్రధానమైంది. ఇనుప లోహాన్ని కాల్చేందుకు ఉపయోగపడే నిప్పుల గుంట కొలిమి. ఈ గుంటలోని బొగ్గులను ఎప్పుడూ మండేలా చేసేందుకు తోలుతిత్తిని ఉపయోగిస్తాడు. పెద్ద ఇనుప దిమ్మెపై కాల్చబడిన ఇనుప వస్తువును పెట్టి, పెద్ద సుత్తెతో దానిపై బలంగా దెబ్బలు వేస్తూ ఇనుమును సాగదీయడం, ఆ తర్వాత దానిని కావలసిన సాధనంగా మల్చుకోవడం అత్యంత శ్రమతో, శక్తితో కూడిన పని.

### 12. కంసాలి :

కర్రపని చేసే వడ్రంగి, ఇనుప పని చేసే కమ్మరి జాతికి చెందిన విశ్వబ్రాహ్మణుల్లో ఇంకొక వృత్తి కళాకారుడు - కంసాలి. ఇతనికి అవుసుల, అగసాలె అనే ఇతర వ్యవహార నామాలు కూడా ఉన్నాయి. బంగారంతో ఆభరణాలను, వస్తువులను, విగ్రహాలను తయారు చేయడం ఇతని వృత్తి కాబట్టి స్వర్ణకారుడు అనే పేరు కూడా ఇతని కుంది. ప్రాచీన కావ్యాల్లో ఈ వృత్తి కళాకారులను 'ఓజు' (గురువు) లుగా పేర్కొన్నారు.

ఐతమ్మ తన కొడుకు బాలచంద్రునికి బొంగరాలు చేయించేందుకు ఓజులను పిలిపించి - **"బొంగరంబులు సేయ పొసగును మీకు / పైడి యిప్పించెద పట్టిన యంత / పనిముట్లు తీసుక పరిగె రమ్మని"** తెలియజేయగానే - వారు వెనువెంటనే - "..... పట్టెళ్లు కార్లు / కమ్మచ్చులును నీరు కార్లు సుత్తెలును / ఘనమగు వడియచ్చు కత్తెరల్ మరియు / శ్రావణాల్ కోపులు చక్కని త్రాసు / లలరు మచ్చులు గుదులాదియైనట్టి / పనిముట్లు కొనితెచ్చి......" ఐతమ్మ చెప్పిన బంగారు బొంగరాలు తయారు చేసి ఇచ్చినట్లుగా శ్రీనాథ మహాకవి తన పల్నాటి వీరచరిత్ర కావ్యంలో వివరించాడు.

కాని, ఇక్కడ గమనించవలసిన అంశమేమంటే- బొంగరాలను వడ్రంగితో కర్రతోనే చేయించి, వాటికి ఇనుపముల్లును కమ్మరితో వేయిస్తారు. ఈ విధంగా బొంగరం తయారీకి బంగారులోహం పనికి రాదు. కాని ఐతమ్మ తన కొడుకునకు బంగారు బొంగరాలను తయారు చేయించడం వారి ఐశ్వర్యానికి చిహ్నంగా కవి వాడిన అతిశయోక్తి తప్ప వేరు కాక పోవచ్చు. ఈ విధమైన వర్ణనలు ప్రాచీన సాహిత్యంలోనే కాక, జానపద సాహిత్యంలో కూడా కొల్లలుగా కన్పిస్తాయి.



బొంగరాల మాట అటుంచి, కంసాలివారి పనిముట్లను పరిశీలిస్తే అవి బంగారు ఆభరణాలను తయారు చేసేందుకు ఉపకరించే - పట్టెలు, కార్లు, కమ్మచ్చులు, నీరుకార్లు, సుత్తెలు, పడి అచ్చులు, కత్తెరలు, శ్రావణాలు, కోపులు, త్రాసు, మచ్చులు, గుదులు ఇవన్నీ నేటికీ కంసాలి వారి పనిముట్లుగా వాడుకలో ఉన్నట్టివే.

కంసాలివారి ప్రధానమైన పనిముట్టు కమ్మచ్చును గూర్చి "....... కారుకుండు సొ / మ్మచ్చు పడంగ జేయుటకై యల క్రౌంచనగంబు పేరిక / మ్మచ్చున నీడ్చు " అని, అగసాలె అందమైన ఆభరణమును చేసేందుకు వెండి, బంగారు తీగెను తీసే ఉక్కు కమ్మచ్చును గూర్చి శ్రీకృష్ణ దేవరాయల ఆముక్త మాల్యద కావ్యం (4-148) కూడా వివరించింది.

### 13. కాసె :

విశ్వబ్రాహ్మణులు అనబడే పంచాణము జాతిలోకి వచ్చే ఇంకొక వృత్తివారు శిల్పులు. వీరు గృహాలు, గోపురాలకు సంబంధించిన రాతి పనిని చేస్తారు. వీరిని 'కాసె' వారు అని పిలువడం కూడా ఉంది.

వీరికి శిల్పశాస్త్ర పరిజ్ఞానం ఉన్న విషయాన్ని - "వరగోపురంబులు వంటసాలయును /...గట్టింపదలచి / కలయ నాచార్యుల కాసీలనపుడు / పిలిపింప వారలు... / యెలమించి వలకేలి యినుపకమ్ములును / నలవడ శిల్పశాస్త్రాగమ వేత్త'' అంటూ, తాళ్లపాక చిన తిరువేంగళనాథుడు (క్రీ.శ. 1498 - 1561) తన ద్విపద పరమ యోగి విలాసం (7-538)లో తెలియజేశాడు.

మందుగుండుతో బండలను పగులగొట్టి, గన్ను అనే ఆయుధంతో బండలను తొలిచి- ఉలి, సుత్తెలతో బండలను తమకు కావలసిన ఆకారంలోకి చెక్కుకొని, శిల్పులు నిర్మాణపు పనులను కొనసాగిస్తారు, అనే విషయం సామాజికులకు తెలిసినదే.

### 14. గౌండ్ల :

జానపదుల్లో - ఇంటి పనులు, పొలం పనులు, మంటి పనులు, కర్ర పనులు, ఇనుప పనులు, రాతి పనులు దినమంతా చేసి చేసి, ఒళ్లంతా హూనమై శక్తి హీనమైన తర్వాత, వారికి జ్ఞాపకమొచ్చి హుషారును కల్గించేది - కల్లు.

కల్లు తాగడం ద్వారా కల్గిన ఆనందపు మత్తులో ఆ శ్రమ జీవులంతా ఆ రోజుకు సేదదీరుతారు. దీని కొరకు వారు ఊరవతల తాళ్లు, ఈదులు ఉన్న ప్రాంతాలకు వెళ్లుతారు. అక్కడ వారికి అప్పుడే

చెట్టుపై నుండి తెచ్చిన తాజా కల్లు దొరుకుతుంది. ఈ కల్లును అమ్మడాన్ని 'గవుండ్ల వారు' (గౌడులు) వృత్తి ధర్మంగా కల్గి ఉన్నారు. 'ఈడిగపు పని' గా 'గీత పరిశ్రమ'గా ఈ వృత్తి అత్యంత ప్రసిద్ధమైంది. ఈ గౌడుల ప్రసక్తి కుమార సంభవం కావ్యం (6-45)లో వస్తుంది – **"జీతిక కల్లు ద్రావి మద సింధుర గామినులన్ని కేతియల్ / వాఱుచు గౌడు గీతములు పాడుచు"** అని, నన్నెచోడకవి (క్రీ.శ.12 వ శతాబ్దం ప్రారంభం) తెలియజేసింది గౌడ స్త్రీల గురించే.

గౌండ్ల వారు మొలకు వెనుక భాగంలో 'ముత్తాదు' అనే కత్తుల తోలు సంచిని అమర్చుకొని, ఆ సంచి ఇనుప కొక్కానికి 'బింకి' (కల్లుకుండ)ని తగిలించుకుంటారు. అపుడు వీపు భాగంలో వారు 'మోకు' (తాటినారతో అల్లిన బలమైన త్రాడు)ను కట్టుకొని, కాళ్లకు బంధాన్ని (తాటినారతో చేయబడింది) వేసుకొని అంచెలంచెలుగా తాటిచెట్టుపై భాగానికి పాకి, కల్లు ఉత్పత్తికి కేంద్రమైన స్థానాన్ని గుర్తించి, దాన్ని పదునైన మారుకత్తితో గీటుపెట్టి ఆ రంధ్రం వద్ద బింకి (లొట్టి)ని కట్టి వస్తారు. తెల్లవారిన తర్వాత ఆ బింకిలో పారిన కల్లు ఉంటుంది. **"కత్తులున్న సంచి కదువేగ కొన్నిరమ్ముట / పోయి యీడుగమ్ము సేయ వలయు"** అని, గౌడు తన భార్యను ఆదేశించిన విషయాన్ని గూర్చి దూబగుంట నారాయణ కవి (క్రీ.శ. 1470) తన పంచతంత్ర కావ్యం (1-203) ద్వారా తెలిపి ఈడిగపు వృత్తిని ప్రస్తుతించాడు.

**15. మేదరి :**

వెదురు బద్దలను చీరి వాటితో గృహానికీ, వ్యవసాయానికీ సంబంధించిన వస్తువులను తయారు చేసే వృత్తి కళాకారుల జాతి – 'మేదరి' లేదా 'మహేంద్ర' అనే పేరుతో పిలువబడుతుంది. వీరు వృత్తి పరంగా ఉపయోగించే పనిముట్లను గురించి తాళ్లపాక చినతిరువేంగళనాథుడు తన పరమయోగి విలాసం (2-65)లో పేర్కొన్నాడు. **"మొలత్రాట చెక్కిన మోటకత్తియును /...పెనుగొన్న నునుదబ్బ పీచుదాకేల / వెడ వెడ జివ్వాడు వెదురు సలాక / యెడమ చే బొటవ్రేలి యినుప యుంగరము"** వెదురు బద్దలను చీల్చే మోట కత్తి, నునుదబ్బ, దాకేల, వెదురు సలాక, ఇనుప ఉంగరం – ఇవన్నీ మేదర వృత్తికి సంబంధించిన పనిముట్లు. మేదరి వృత్తిపరంగా తయారుచేసే గృహోపకరణాలలో చేట, జల్లెడ, గంప, తడిక, పెట్టె మొదలైనవి ఎన్నో ఉంటాయి.

**"వీగుచు చేటల వేమయ్య భువిని / దాగాక మఱియు మేదరులు గౌందలకు / జీవితంబులు చేసి, చేటలు చాల"** అని, పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్ర (పురాతన ప్రకరణం)లో మేదర వృత్తినీ, వారు తయారు చేసే 'చేట'లనూ ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

మేదర స్త్రీ వృత్తిపరమైన అల్లికలను మెచ్చుకుంటూ భావుకుడైన జానపదుడు అల్లిన ఈ క్రింది గేయంలో, వృత్తి పరమైన శ్రమలోని జీవన సౌందర్యం కనులముందు కదులుతుంది – **"చిన్నా చిన్నా ముల్లు చిన్నారి ముల్లు / దాని కిందున్నాది జడల మేదారీ / మేదారీ నీ బిడ్డా మేలు సుందారీ / సుందారీ నీవెంతో సూడ సొంపున్నవ్ / గుమ్మడాకు సీరిందో గుల్లలల్లిందో / తాటాకు సీరిందో తడుకలల్లిందో / వేటాకు సీరిందో పెట్టెలల్లిందో / మొగిలాకు సీరిందో మొంటె లల్లిందో."** ఈ విధంగా మేదరి కులవృత్తి మాత్రమే కాకుండా – విభిన్నమైన మిగతా వృత్తులన్నీ కూడా శ్రమజీవన సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ, ఏదో ఒక కులంపేరుతో గ్రామాల్లో మనకు దర్శనమిస్తాయి.

**ముగింపు :** నిజానికి జానపదుల్లో కులం అనేది ఒక వృత్తిని తెలియజేసే పేరు మాత్రమే. కులం ఏదైనా కులం పట్టింపు లేకుండా అన్నా, తమ్మీ, అక్కా, చెల్లే, మామా, బావా, పెద్దనాయన, అవ్వ, తాత మొదలైన వరుసలతోనే గ్రామస్థులు తమను తాము పలుకరించుకుంటూ నగరవాసులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతారు. ఎవరింట్లో ఏ ఉత్సవం జరిగినా ఊర్లోని వాళ్లంతా ఓ చెయ్యి వేసి తోడు నిలుస్తారు. ఈ విధంగా గ్రామం అనే తల్లికి వృత్తుల వారు బిడ్డల వలె మెదిలి, ఆదాన ప్రదానాలు తమ ప్రధాన ఆశయంగా జీవిస్తారు. అందుకు ఉదాహరణగా ఒక దంపుడు పాటను పేర్కొనవచ్చు. ఈ దంపుడు పాటలు ఈ నాటివి కావు. **"పటికపు ఱోల ముచ్చెదురు ప్రాలొగి బోయుచు గౌరు కొమ్మురో / కటగొని దంచుచున్ శబరకామిని వెక్కులు రాగముల్ రసో / త్కటముగ పాడె...."** అని, నన్నెచోడ కవి తన కుమార సంభవ కావ్యం (6-47)లో నాడే (కీ.శ.12వ శతాబ్దం ప్రారంభం) పేర్కొని, వాటి ప్రాచీనతను తెలియజేశాడు. గృహ పరికరాలైన రోలు, రోకళ్లను గూర్చి నన్నెచోడ కవి ప్రస్తుతిస్తే జానపదుల ఈ దంపుడు పాటలో రోలు, రోకలి చేసే పనులతో పాటుగా వాటిని తయారు చేసిన వృత్తులవారు కూడా దర్శనమిస్తారు –

**"అడ్లోడు సేసిన్నె అన్నెల్ల గజము / కమ్మరి సేసిన్నె గంటలా పొన్ను / కుమ్మరి సేసిన్నె గుండు కుందేనే / కంకణాల సేత గజమందు కొనీ / నడుమంచి ఎయ్యండి / నాగరీక మేమీ / జంగ జాపెయ్యండి / జాణ తనమేమీ"** అని, ధాన్యం దంపుడుకు కావలసిన సాధనాలైన రోకలి, కుందెనల గురించి కూడా తెలియజేశారు. రోకలిని (గజము) వడ్రంగి తయారు చేస్తే, దానికి కింది భాగంలో ఉండే ఇనుప పొన్నును కమ్మరి అమరుస్తాడు. కుమ్మరి మట్టి కుందెనను చేసిస్తాడు. ఈ విధంగా ధాన్యాన్ని దంపడంతో పాటు అందుకు కావాల్సిన పరికరాలను, వాటిని అందంగా తీర్చిదిద్దిన వృత్తికళాకారులను పాటద్వారా జానపదులు కీర్తిస్తున్నారు. ఆ కీర్తనలో – జానపదుల నిర్మలత్వం తప్ప నగరవాసుల నాగరీకం లేదు. నాగరీకం అంటే పై పాటలోని జానపదుల మనోభావం ప్రకారం అసహజత మరియు కృత్రిమత. విశాలమైన ఈ భావన కులాలు, వృత్తులు ఏవైనా గ్రామానికి గ్రామమే ఒక గృహంలాగా జీవించే జానపదుల ఆదర్శవంతమైన స్ఫురణకు అద్దం పడుతుంది. ✿✿

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025

# నెల్లూరు శాసనాలు – సామాజిక భాషాంశాలు

**ఆచార్య జి. అరుణ కుమారి,** విశ్రాంత ఆచార్యులు, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 93965 03944

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు ప్రాంతం వరిసాగుకు ఆధారంగా నిలిచినందుకు నెల్లూరుకు ధాన్యాగారంగా గుర్తింపు వచ్చింది. రాపూరు (4) రాజుపాలెం గ్రామానికి ఉత్తరదిక్కు కొండ కింద శిలాశాసనంలో త్రిభువన చక్రవర్తి శ్రీ కులోత్తుంగ చోళదేవర 23వ విజయ రాజ్య సంవత్సరం నాడు స్థాపించిన శిలాశాసనంలో సింహపురి అనే పేరు నెల్లూరుకు ఉందనే విషయాన్ని గ్రహించవచ్చు. నెల్లూరుకు విక్రమసింహపురి అనే పేరు కూడా వ్యవహారంలో ఉంది.

నెల్లూరు క్రీస్తు పూర్వం 3వ శతాబ్ది నుండి మౌర్యుల పాలనలోనూ, 6వ శతాబ్దంలో పల్లవ పాలనలోనూ, 12వ శతాబ్దంలో కాకతీయుల పాలనలోనూ, 13వ శతాబ్దంలో చోళులు పాలనలోనూ గడిచింది. కాటమరాజు వంశ కలహాలు, తుగ్లక్ పాలన, కొండవీటిరెడ్ల పాలన, విజయనగర సంగమ వంశపాలన, దర్శి వంశపు రాజుల పాలన, ఆరవీటి రాజుల పాలన, ఈస్ట్ ఇండియా కంపెనీ వారు, బ్రిటిష్ వారు, నవాబులు... ఇలా ఎంతోమంది ఈ ప్రాంతాన్ని పాలించారు. ఈ ప్రాంతం ఎన్నో యుద్ధాలకు నెలవుగా నిలిచింది. ఈ సంఘటనలకు ఆయా రాజుల కాలంలో చెక్కిన తామ్ర శాసనాలు, శిలాశాసనాలు నెల్లూరు చరిత్రకు ఆధారాలుగా నిలుస్తున్నాయి. కానీ రాజులను వారి పాలనా కాలాన్ని పరిశీలించడం వలన కొంతమేరకు మాత్రమే చారిత్రక భాషా అంశాలను సేకరించగలుగుతున్నాం.

**నేను శాసనాలను గమనించినంత మేరకు అందిస్తున్న చారిత్రకాంశాలు.**

1. నెల్లూరుకు సింహపురి అనే పేరు గల శాసనాన్ని గుర్తించడం.

2. నెల్లూరు వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడం వలన భూములు నుండి వచ్చే ఆదాయ క్రమం, రాజు వద్ద పనిచేసే రాజోద్యోగుల ప్రస్తావన సంధాత, అమరగాడు, దొర, గుత్తదారు వంటి ఉద్యోగుల వివరాలను అందించే శాసనాలు.

3. సక్రమంగా విధి నిర్వహణ చేయని పక్షంలో వ్యక్తిని తొలగించి మరొకరిని నియమించిన శాసనం

4. క్రీ.శ. 1746 నాటి రామయ్యపట్నం, కందుకూరు తాలూకా, నెల్లూరు. తామ్ర శాసనం (4) ఆధారంగా లంబాడీవారు ఉప్పు వ్యాపారస్థులుగా బావమోహన్ దాసు, రాఘవదాసు దగ్గర కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. లంబాడీలు సముద్రతీర ప్రాంతాలను గుత్తకు తీసుకొని ఒక పుట్టి ఉప్పుకు ఒక రూపాయి చొప్పున ఫసలి (సంవత్సర కాలం) కాలం పాటు రాజీ కుదుర్చుకున్న శాసనమిది. పుట్టి అంటే 60 కిలోల పరిమాణం కలిగిన ఉప్పు ధర ఒక రూపాయి.







ఉప్పు వ్యాపారం చేసుకుంటూ అనేక లంబాడీ కుటుంబాలు జీవనం సాగించినట్లుగా ఈ శాసనం ఆధారంగా తెలుస్తుంది.

5. సూళ్లూరుపేట (4,5) శాసనాల ఆధారంగా సూళ్లూరుపేటకు సురలూరుగా వ్యవహరించబడిందని, సురలూరుకే సింగలంతా పురంగా పిలవబడిందని తెలుస్తుంది. తమిళ శాసనాలలో గ్రంథలిపిలో ఆరంభించి గ్రంథలిపిలోనే దీవెనలు అందించడం కనిపిస్తుంది.

6. రాపూరు (76) వడ్లపూడి శాసనాలలో గ్రామ పొలిమేరలలో సన్యాసులు, మునులు, మహామునులు కట్టిన కట్టు మంత్రం గురించి వివరించే శాసనం ఉంది. పశువుల పళ్ళకు, పాలకు తోకలకు అంటువ్యాధులు రాకుండా ఉండేందుకు నాశనకారిణి అయిన శక్తిని వెల్లిపొమ్మని రక్తాన్ని, వాలుకత్తిని, కొడవలిని, పాశాన్ని దేవతకు అర్పించిన సంఘటన, గ్రామప్రజల విశ్వాసం ఈ శాసనం మూలంగా తెలుస్తుంది.

7. దేవుని కైంకర్యానికి, చామర సేవకు భూదానాలు గురించి రాపూరు (72) వడ్లపూడి శాసనం వివరిస్తుంది.

8. ఉదయగిరి (19) తోట చెరువుపల్లి శాసనం క్రీ.శ. 1615 భూమి మూలంగా వచ్చే నిధి నిక్షేపాలు, నాశనం కాని వనరులు, భవిష్యత్తులో వచ్చే ఆదాయాలు, సిద్ధిసాధ్యాలు కలిగిన సకల ఫలాలున్న భూమిని – కంపినాడులోని కుమారకోటిని మాణికేదారికి దానంగా ఇచ్చి సకల భోగాలను అనుభవించమని చెప్పే శాసనమిది.

9. ఉదయగిరి గ్రామం దేవాలయ తేరు, తిరునాళ్లలో నట్టువ, ముట్టువకాండు, పరిచారకులు, పంచాణం వారు ధరించవలసిన వస్త్రధారణ, తలపాగ, మొలపచ్చడం, నొసట గంధం... వంటి అంశాలను వివరిస్తుంది. ఈ సందర్భంలో తంబూల సేవనం నిషిద్ధం.

10. ఉదయగిరి (16) పల్లవోలు గ్రామంలో ఆవులమ్మ దేవతకు సైదులు అబ్దుల్లా సాహెబ్ 10 గొర్లు మాన్యాన్ని దేవతకు సమర్పించి నట్లుగా ఈ శాసనం వల్ల తెలుస్తుంది.

ఆయా రాజుల కాలంలో గ్రామాలను పాలించే అధికారులు వేసిన శాసనాల మూలంగా మత విశ్వాసాలకు సంబంధించిన విషయాలు, పాలనా వ్యవస్థలో కొనసాగే క్రమ ఉద్యోగులు, వ్యవసాయ ఆదాయాల వివరాలు, కొలమానాలు, ఆజ్ఞా శాసనాలు, ఒప్పంద శాసనాలు, దాన శాసనాలు, దేవాలయ అంగరంగ భోగ కైంకర్యాదులు, నందా దీపం, తిరునాళ్ళు, తేరులు, దానాలు, శిలా ప్రతిమ ప్రతిష్టలు... మొదలైన అంశాలతో పాటు లిపి, భాషాపరమైన అంశాలను కూడా ఈ పత్రంలో చర్చించాను. **అన్నవరం అగ్రహారం, దర్శి తాలుకా, నెల్లూరు జిల్లా.** ఆలన్ బటర్‌వర్త్, వి. వేణుగోపాల చెట్టి పరిష్కరించిన ఈ శాసనం 1905 పార్ట్-1లో ఒక విధంగాను, బూదరాజు రాధాకృష్ణ రచించిన EARLY TELUGU INSCRIPTIONSలో కొంత సరళీకరణ చేసిన విధంగాను కనిపిస్తుంది. బూదరాజు రాధాకృష్ణ గ్రంథంలో ఈ శాసన కాలం క్రీ.శ. 650 అని గుర్తింపబడింది. స్వస్తితో ఆరంభమయిన ఈ శాసనంలో చాళుక్య వంశోద్భవ శ్రీ విక్రమాదిత్య మహారాజుల రాజ్యంలో తన పూర్వవృత్తికి అడ్డు వచ్చిన దత్తియా... చేసి విద్ధమయ్యను విప్రకవచంగా నిలిపారు.

ఈ శాసనాన్ని నిగ్రహ అనుగ్రహాలకు సంబంధించిన ఆజ్ఞాలేఖగా పరిగణించవచ్చు. తనకు అడ్డు వచ్చిన వారిని కాదని విద్ధమయ్యపై అనుగ్రహాన్ని చూపించి అతడిని బ్రాహ్మణ రక్షకుడిగా నిలిపిన శాసనమిది.

**భాషాంశాలు**

ఈ శాసనంలో వచ్చిన, చేసి, నిల్పె వంటి అసమాపక క్రియా రూపాలున్నాయి. ల, నన్, కి వంటి ప్రత్యయాలున్నాయి. మహారాజు-ల, రన్యేమ్బు - నన్ / రాజ్యమ్మునన్దు - నన్ - అందు, పూర్వవృత్తి- కి.

**పూర్ణానుస్వారానికి బదులుగా వర్గ పంచమాక్షరాలు కనిపిస్తున్నాయి.**

రన్యేమ్బునన్ - రన్యెంపునన్ - (రాజ్యమ్ము)

వక్రమ్బు - వక్రంబు

వయఙ్ - వయం

విప్రకవచమ్బు - విప్రకవచంబు

**క్రీ.శ. 650 నాటి భాషా స్వరూపం**

వకబు - వక్రమ్బు

వెత్విన - వెళ్ళిన

కొడవట్టి - కాడువెట్టి

పూవ్వడ - పూర్వ

**రాపూరు, చాగనం, రాజుపాలెత, తమిళ లిపి, గ్రామానికి ఉత్తర దిక్కు కొండకింది శిలాశాసనం**

బుడమ నారాయల పాడు, పొదిలి తాలుకా, నెల్లూరు, ఆలన్ బటర్‌వర్త్, వి. వేణుగోపాల చెట్టి పరిష్కరించిన శాసనం కాలం క్రీ.శ. 650 గా బూదరాజు రాధాకృష్ణ రచించిన EARLY TELUGU INSCRIPTIONS లో గుర్తింపబడింది. ఈ దాన శాసనం చివరి ఏదు పాదాలు శిథిలమయ్యాయి. స్వస్తితో ప్రారంభమైన ఈ శాసనంలో నాలుగు పుట్టు (పుట్లు) కొలమానం గల పంట చేనుని వెళ్ళకి వాడి ఏలిక అయిన బాలమ్ భంటాదళ ఉత్తరాన ఉన్న దేశంలోని చేనును సోమునికి దానంగా ఇచ్చారు. ఈ శాసనాన్ని కాచిన వారికి ఆశీర్వాదాలు, ధిక్కరించిన వారికి శాపనార్థాలు ఉన్న భాగం శిథిలమయింది.

**భాషాంశాలు**

ఇచ్చిన, వచ్చు, కాచిన, నడచిన, ప్రవర్ధమాన ఏళువు వంటి క్రియాపదాలున్నాయి.

మహారాజులకు, సంవత్సర-ంబు, సంవత్సరంబులు, వర్ష-ంబు, ఉత్తర-ంబు, సోము-కు దీని-కి, చేను-కు, వార-గళు పదాలలోని ప్రత్యయాలను గుర్తించవచ్చును.

త్రిభువన చక్రవర్తి శ్రీ కులోత్తుంగచోళ దేవరకు ఇరవై మూడవ సంవత్సరం (విజయ రాజ్య సంవత్సరం) గాను పిచ్చాండి నాయకర్ విక్రమసింహపురమైన నెల్లూరులో కళై ఇట్ట కాడుచ్చ (రు) దేవరకు శిలా ప్రతిమలను, ఊట్టుక్కూకన్ కొండ కింద చెరువును తవ్వించారు. ఉదుక్కూరులోని సిద్ధగురువులు, వ్యవసాయదారులు, సీమప్పిలి సింహ అమాత్యుడు కలిసి ఈ చెరువును ఇష్ట కామేశ్వర నాయనార్‌కును, బ్రాహ్మణులకును ఇచ్చా(ము) రు. ఈ శాసనాన్ని చంద్రుదున్నంత వరకు పాటించాలి. ఈ శాసనాన్ని ధిక్కరించిన వారు గంగాతీరంలో గోధుమరంగు ఆవును చంపిన పాపానపోతారు.

ఈ శాసనంలో సింహపురి అనే పేరు నెల్లూరుకు ఉందనే అంశాన్ని పేర్కొన్నారు. దేవాలయానికి శిలాప్రతిమలను సమర్పించి నట్టుగాను, చెరువును తవ్వించారని ఆ ప్రాంత వాసులకు దేవాలయ సంరక్షణకు గాను ఇచ్చినట్టు తెలుస్తుంది.

**భాషాంశాలు**

త్రిభువన పదంలోని 'త్రి' అనే అక్షరం గ్రంథలిపిలో ఉంది. త్రి అనే లిపి తమిళ లిపిలో సంయుక్తాక్షరంగా కనిపించదు. సంస్కృత భాషకు అనుగుణంగా గ్రంథలిపి వాడుకున్నారు. క్రమేపి తమిళ భాషకు సరిపోయే అక్షరాలను సమకూర్చుకున్నారు.

**రాపూరు, గురవాయపాలెం**

1638-39. బహుధాన్యనామ సంవత్సరం చైత్రమాసంలో శ్రీమత్ వెలుగోటి వేంకటపతి నాయనింగారు ఆకుపల్లె చెరువు శాలివాహన శకం 1560 శుక్ల పక్షం నాడు వేయించిన ధర్మ శాసనం

చెరువు మేరలు పూర్వం యే దారిగాను నడిచిందో ఆ మేర ధాన్యం చెరువు పని చేయడానికి కట్టడి చేయించినారు గనక ఈ గ్రామ సంధాతాన వున్నా, అమరగాని వశాన యే దొర ఏలినాను గుత్తగాని వశానవున్నాను. చెరువుకు నిర్ణయమైన మేరధాన్యం చెరువు పని ముఖం చేయించగలవారు చెరువు పని ముఖం గాను ఏలినవారు చేయించక ఎవ్వరు అనుభవించినాను ఎవ్వరు ఆశించినాను ఏ కాపు ...... ఆక్షేపించినాను ఈ శాసనాన్ని ఎవరు తీసివేసినా వాడు ఈ ఊరి వెట్టివానికి బుట్టినవాడు వాని ఆలిని ఈ ఊరి వెట్టివానికి యిచ్చుకున్నటుని ఇచ్చిన ధర్మశాసనం.

**భాషాంశాలు**

శకవష్ంబ్బులు

శేయించ్చే – చేయించె

చేయించ్చక – చేయించక

అనుభవించ్చినాను – అనుభవించినా

ఆపించ్చినాను – ఆపుజేసినా

ఆక్షేపించ్చినా – ఆక్షేపించినా

ధమ్ శాసనం – ధర్మశాసనం (ర)

నిన్న్యమైన – నిర్ణయమైన (ర)

వెంక్కటపతి – వెంకటపతి

అనుస్వారం తరువాత వచ్చిన వర్ణానికి ద్విత్వ రూపాన్ని పాటించారు.

నిన్న్యమైన – పొల్లు రకారం

పూవాన్న – పూర్వం

యవ్వరు – ఎవ్వరు

యివ్వరు – ఎవ్వరు

వాండ – వాడ

ఆనాటి సంధాత, అమరదారు, దొర, గుత్త దారు వంటి రాజోద్యోగుల వివరాలు ఈ శాసనంలో కనిపిస్తుంది.

**తామ్రశాసనం**

పట్నం కందుకూరు తాలూక, నెల్లూరు. అలన్ బటర్ వర్త్, వి. వేణుగోపాల శెట్టి

**ఒప్పంద శాసనం, దాన శాసనం**

లంబాడీ ఉప్పు వ్యాపారస్థులు ఒక పుట్టికి ఒక రూపాయి చొప్పున బావ మోహన్‌దాసు రాఘువదాసు వారి వంశంలోని వారు బైరాగి మఠం నిర్వహణకు శాలివాహన శకం 1668 (క్రీ.శ. 1746) మాఘ శుక్ల పక్షం సప్తమి అక్షయనామ సంవత్సరం నాడు లంబాడీ ఉప్పు వ్యాపారస్థులు 1 పుట్టి ఉప్పుకు 1 రూపాయి చొప్పున బావ



మోహనదాసు, రాఘవదాసు దగ్గర వ్రాయించి ఇచ్చిన ఒప్పంద పత్రం. దొమావతు, ఖిలావతు కాదలాతు, ఖమా ఝాజనరపతు, రామదాసు, మిరుజాఝ నోతుతిమ్మ శ్వెజెషపతు, ఖిమదాళాపతు చంద్దాలక్క పాపాతర ఠాకురు, బూక్యాదిపా గంగ్గు, ఖేతావతుహటి చాకావతు... లంబాడీ వ్యాపారస్థులు వ్రాయించి ఇచ్చిన దాన పత్రం. పుట్టికి 1 రూపాయి 60 కిలోలు 20 కుంచాలున్న 1668 ఫసలి – పంట జూలై 1 నుండి జూన్ 30 వరకు ఉండే ఆర్థిక సంవత్సరం బందరు రామయపట్నంలోని మీ మఠం ధర్మంగా నడిచేటందుకు మా తాలూకు బయజాదిలు Brinjaris (Salt Tradars) పట్టె ఉప్పుకు ఖ ఒకటికి రూపాయి నిష్కర్ష చేసాము. పాకాల, బింగనపల్లె, తుమ్మల పెంట, ఉదయగిరి సరకారు, జువ్వలదిన్నె, కృష్ణాపట్నం, గంగపట్నం, సర్వేపల్లి సరకారు, యిశికిపల్లి (ఇసకపల్లి) గోగులపల్లి, అల్లూరు కంభం సరకారు వగైరా కరవాక (సముద్ర తీరం) బందరు తీర ప్రాంతాలలో పట్టె లంబాడీలు ఏ కులం వారు పట్టినా వ్రాశిన (వ్రాసిన) ప్రకారం మీ మఠానికి మీ పుత్ర పౌత్ర పారం పర్యంతం ఆ చంద్రార్క స్థాయిగా నడిపించగల వారము అని మా రాజిని వ్రాయించి ఇచ్చిన దాన పత్రం.

17వ శతాబ్దం నాటి ఈ తామ్ర శాసనాన్ని ఆధారంగా చేసుకొని బంజారాలు ఉప్పు వ్యాపారాలు చేసేవారుగా చారిత్రకంగా నిర్మితమవుతుంది. సముద్ర ప్రాంతాలను గుత్తకు తీసుకొని తీర రాజీ కుదుర్చుకొని కొన్ని లంబాడి కుటుంబాలు జీవనాన్ని సాగించారనే ఆధారాలను శాసనం అందిస్తుంది.

**సంస్కృతంలో హెచ్చరికలు**

దానాన్ని పాలించిన వారు స్వర్గప్రాప్తిని పొందుతారు. పాటించని వారు నిష్ఫలులవుతారని సున్నితంగా తెలియజేసారు.

**భాషాంశాలు**

వరషంలు – వర్షములు – సంవత్సరములు

మాఖ – మాఘ

లంబ్బాడీలు – లంబాడీ

యెకులం – యేకులం

పటినా – పట్టినా

రాజి – రాజీ

ధమ్ఁం – ధర్మం

బందలర్‌లో – బందరులో

మతాలాకు – మాతాలూకు

బయజారిలు – బంజారీలు – Brinjaris

నిష్కరష – నిష్కర్ష

యిశికిపల్లి – ఇసకపల్లి

అక్బరు నుండి మొదలైన కాలండర్ ఫసలి – సంవత్సరం పంట ఆర్థిక సంవత్సరం జూలై 31 నుండి జూన్ 30 వరకు.

ఆంచ ద్రాక్ – ఆ చంద్రార్కం.

వ్రాయించ్చి – వ్రాయించి

సరకారు – సర్కారు

క్రిష్ణా పట్నం – కృష్ణాపట్నం

వుప్పుకు – ఉప్పుకు

వ్రాశిన – వ్రాసిన

రూపాయ – రూపాయి

**సూళ్ళూరుపేట నాగేశ్వరాలయం, తమిళ శాసనం :** ఈ శాసనం మధ్య భాగం శిథిలమయ్యింది. ఈ శాసనారంభంలో 'స్వస్తి' అనే పదం గ్రంథం లిపిలోను, త్రిభువన చక్రవర్తి పదంలోని త్రి – తిరి అనే తమిళ అక్షరాలలో కనిపిస్తుంది. సంస్కృత పదాల లిఖిత ప్రయోగానికి గ్రంథలిపి సులభతరంగా కనిపించింది. క్రమేపి శాసనాలలో కనుమరుగైన గ్రంథలిపిని గమనించవచ్చు. వాడుక భాషను వ్యవహార విధేయంగా వాడుకున్న సందర్భం కనిపిస్తుంది.

**భాషాంశాలు**

'శ్రీ విజయ గండ గోపాల దేవర' పదాలలో 'దే' మాత్రమే గ్రంథలిపిలో కనిపిస్తుంది. ఀఴ – దే అక్షరం.

విజయగండ గోపాల దేవరకు 24వ (సంఖ్య గ్రంథలిపిలో ఉంది. పరిష్కరణ కాలానికి ఈ సంఖ్యను గుర్తించక పోవటాన్ని గమనించవచ్చు.) విజయరాజ్య సంవత్సరంలో సింగళాపురం అనే పేరుగల సురలూరులో తిరునాగేశ్వర నాయనార్‌కు అమావాస్యనాడు దేవుని ఊరేగింపును గురించి తెలియజేసే శాసనం.

ఈ ఊరేగింపును ధిక్కరించిన వారు గంగలో ఆవును చంపినంత పాపం కలుగుతుందని ఈ శాసనాన్ని పాటించిన వారికి శ్రీ మాహేశ్వర రక్ష కలుగుతుందని శాపాశిర్వాధాల హెచ్చరిక కనిపిస్తుంది. 'శ్రీ మాహేశ్వర రక్షై' అనే పదాలు గ్రంథలిపిలో కనిపిస్తున్నాయి.

ఈ శాసనంలో అమావాస్య అనే పదంలో అ – స్య అక్షరాలు గ్రంథలిపిలో కనిపిస్తాయి.

స్య అనే అక్షరం సంయుక్తాక్షరంగా కనిపిస్తుంది. తమిళ భాషలో సంయుక్తాక్షరంగా కనిపించవు. శ్రీ, క్ష వంటి అక్షరాలు తప్ప. లేఖకుడు గ్రంథలిపిని, తమిళ లిపిని ప్రయోగించడం గమనించినట్లయితే గ్రంథలిపి క్రమేపి కనుమరుగై తమిళ లిపి వ్యవహార విధేయంగా నిలదొక్కుకున్న పరిణామం కనిపిస్తుంది. తవిత్తరుళుమ్ – పదం గ్రంథం లిపిలో ఉంది. సంస్కృతంలో ప్రయోగించే ద్విత్వాక్షరంలా త కింద త అక్షరమే కనిపిస్తుంది. ఈ శాసనం సుంకం గురించి తెలియజేస్తుంది.

**సూళూరు పేట నాగేశ్వర గుడి దక్షిణ గోడపై ఉన్న తమిళ శాసనం**

స్వస్తి శ్రీ త్రిభువన చక్రవర్తి శ్రీ విజయ… చోళమండలానికి చెందిన వేంగనాడులో సింగలాంతపురంగా పిలువబడే సురలూరులో తిరునాగేశ్వర దేవునికి తైమ్మాడి దేవన్ అర్థాంగి తనిక్కూత్తుకండాళ్ సమర్పించిన పవిత్ర నందా దీపం గురించి తెలియజేసే శాసనం. మార్గశిర మాసంలో జరిపే ఉత్సవానికి ఇచ్చిన దానంపై సుంకం లేదు. మరీయూరులో 600 కుంటలు (కుళి) తూర్పు దిక్కున ఉన్న పొలం దానంగా ఇచ్చినట్టుగా తెలుస్తుంది. కొలత ప్రమాణాల వివరాలు ఈ శాసనం తెలియజేస్తుంది. 100 కుంటలు 22 కొలబద్ధలు కలిగిన భూమి కొలతను సూచిస్తుంది. కొంత భాగం శిథిలం కావడం వలన కొలత ప్రమాణం అస్పష్టం. శాసనాన్ని పాటించిన వారికి 'స్వస్తి శ్రీ మహేశ్వర రక్షై' అని గ్రంథలిపిలో ఆశీర్వచనం ఉంది. పాటించని వారు పాపగ్రస్తులవుతారు.

**రాపూరు (76) వద్లపూడి,** బైనేటి కొండ దగ్గర శాసనంలో ఊరిలో పశువుల మందలకు సంబంధించిన అంటు వ్యాధులను నివారించటానికి చేసిన కట్టు మంత్రం గురించి తెలియచేసే శాసనం. మద్రాసు క్రిష్టయన్ కళాశాలలో సంస్కృత పండితుడుగా పనిచేసిన వేదం వేంకటరాయశాస్త్రి గారు పరిష్కరించిన శాసనం. కాలం తెలియదు.

ఓం ప్రీం సన్నాశిపాత / మాన కట్టకట్ట మ/హా కట్ట పొలిమేర / మునులు మహాము / నులు సంన్నాసులు / కట్టిన కట్టులు పట్టు / సాహా ఏటలు ఆహా / రము తీసుకొని / (ౘ్రిధము) శ్రీయింద మహా/ ముని పాదమాని పా / వి రక్తము కొట్ట వా / లు కత్తి పాశము / తీసుకొని పోవే / మహాశక్తినీ క / ట్టిన మం/త్రము ము రా మురియ/

గ్రామ పొలిమేరలో సన్యాసులు, మునులు, మహామునులు కట్టిన కట్టులు (పొలిమేరలు – రక్షక మేరలు కావచ్చును). శ్రీ యింద మహాముని మీద ఆన జంతుబలిన ఆహారంగా తీసుకొని ఊరి నుండి మురా మురియ మహాశక్తినీ వెళ్ళిపొమ్మని కట్టిన కట్టు మంత్రాన్ని గురించి తెలియజేస్తుంది ఈ శాసనం. ఈ రక్షక కట్టు మంత్రం వలన పశువులకు పోలు, తోకలు, పళ్ళు, (కోరలు) … వ్యాధులు కలుగకుండా ఉండాలనే భావంతో ఉన్న గ్రామ ప్రజల విశ్వాసాలను

తెలియజేసుందీ శాసనం.

**ఈ శాసనంలో భాష**

సన్నాశి – సన్నాసి

సంన్నాసులు – సన్నాసులు

ఏటలు – జంతుబలి

కట్టుమంత్రము – దుష్టశక్తిని మురామురియు మంత్రించిన కట్టుబంధం.

ఆ శక్తి నుండి పశువులను కామిడదానికి మునులు, మహా మునులు, సన్యాసులు, శ్రీ యిందకు పశువుల రక్షణకు మహాముని గ్రామ పొలిమేరలో / చేసిన కట్టు మంత్రం. మహా శ్రీ ఓం గురు ప్రసాదగురు మంత్రాన్ని పదిలక్షల సార్లు స్మరించుమని అర్థం స్ఫురిస్తుంది.

**రాపూరు (72) వడ్లపూడి** గ్రామానికి దక్షిణం పార్థివ నామ సంవత్సరం మాఘమాసం శుద్ధ 11న పాదుముడి నాయని కొడుకు దామినాయనిం గారు తమ నాయంకరంలో శ్రీ కాళహస్తీశ్వరునకు పినవడ్ల మూండిలోని వరిమడిని, నెల్లూరి దారబందంపాడు గ్రామంలో నూరు గుంటల భూమిని ఆ చంద్ర స్థాయిగా దేవుని భోగ ప్రాప్తి కొరకు సమర్పించాడు. దీనిని అనుభవించే వారు దేవుని చామర సేవకు నియమితులవుతారు అని వివరించే శాసనం.

**ఈ శాసనంలోని భాషాంశాలు**

ఆచంద్రస్థాఇగాను – ఆచంద్రస్థాయిగాను

ఇస్తిమి – ఇచ్చాము

చేనికి – చేనుకు

దక్షణం – దక్షిణం

ఆలవట్టం – వింజామరము

**రాపూరు (79) ఎఱ్ఱగుంట పాలెం చిక్కవోలు గ్రామం** శాసనం క్రీ.శ. 1560 సంవత్సరం నాటి శాసనం.

శ్రీమత్ వెలుగోటి వెంకటపతి నాయనించగారు ఎఱ్ఱగుంటపాలెం చెరువుకు ఇచ్చిన ధర్మవాసనం. పుట్టి ఒక్కటికి కుంచం లెక్కన మాన్యాల మూలంగా చెరువు మేర వచ్చిన ధాన్యం గురించి వివరించే శాసనం.

నెల్లూరు శాసనాలలో చెరువుకు ఇచ్చిన ధర్మశాసనాలలో ధాన్యం కట్టడిని వివరిస్తుంది. పాలనావ్యవస్థలో సంధాతగాని అమరగాడు గాని, నోరగాని... ఒక్క పుట్టికి కుంచం లెక్కన ఇవ్వవలసిన ధాన్యపు కొలతలను అందిస్తుంది.

వెంక్కటపతి – వెంకటపతి

ఒకక్కట్కి – ఒక్కటికి



కుంచ్చలఖైను – కుంచంల లెక్కను

దాన్యం – ధాన్యం

గట్టడ శేయించ్చివారం – కట్టడి చేయించిన వారం

**ఉదయగిరి (19) తోట చెరువుపల్లి,** శాలివాహన శకం. 1537. క్రీ.శ. 1615 శ్రీమద్రాజాధిరాజ రాజపర (మేశ్వర వేంక)టపతి రాయ దేవమహారా(య) కంప్పినాడలో కుమారకోటిని కామర్తి మాణికేదారికి ఇచ్చిరి. శ్రీమద్రాజాధిరాజ పరమేశ్వర తిమ్మయ దేవ మహారాయలు అయ్య(వారు) వజ్రసింహాసనా రూఢులై యేలుచునుండిన మాంకు అమరానకుంజెల్లె అరివేలముస్తితిలోని (రావ) అనే గ్రామానికి ప్రతి నాకు (వు) గ్రామము రాంఘ నాయంకులు సేవ సేసుకొని వుండేది. అంగరంగ భోగాలకు నిధి నిక్షేప అక్షిణ్యా ఆగామిసిద్ధి సాధ్యాలు గలిగిన సకల ఫలాలున్ను భూమి ఆచంద్రార్కముగా అనుభవించి సుఖాన వుందునది.

క్రీ.శ. 1615 వేంకటపతి రాయదేవ మహారాయలు కంపినాడు లోని కుమారక కోటి గ్రామాన్ని కామార్తి మణికేదారికి ఇచ్చారు. ఆ కాలంలో గ్రామాలకుండే పేర్లకు బదులుగా ప్రతినామాలు కుదర్చడం శాసనాల ఆధారంగా కనిపిస్తుంది. అరివేలం అమరానకు తిమ్మయ దేవ మహారాజుయలు పాలనలో ఈ భూమి మూలంగా కలిగే నిధులు, నిక్షేపాలు, నశించనివి, రాబోయే ఆదాయ వనరులు, అసలు, వసూలు కావలసినవి, ఇతర వనరులు... సకల ఫలాలున్న భూమిని అనుభవించి సుఖంగా ఉండాలని తెలియజేస్తుంది ఈ శాసనం. భూముల మూలంగా కలిగే ఆదాయ వనరుల వివరాలను ఈ శాసనం అందిస్తుంది.

**భాషాంశాలు**

కంప్పినాడు – కంపినాడు

కామర్తి – కామర్తి

తింమయ – తిమ్మయ

**ఉదయగిరి గ్రామం, రంగనాయక స్వామి దేవాలయం** : దంబాదుకమ్మ – ఈ భాగం శిథిలమయ్యింది.

శ్రీ మన్మహామండలేశ్వర రామరాజ కొనేటయ్య దేవ మహారాజు

కుమారుడు తిమ్మరాజుగారు రఘు నాయకులకు గోపుర మండప ప్రాకారాలు కోనేరు మొదలయిన సకల కైంకర్యాలను చేయించి తేరు తిరునాళ్ళు సాగించి, ఉలిని, గూటాన్ని కొడవలిని చేత బట్టుకొని తీసుకొనివచ్చినవారు ఈ మర్యాదను పాటించాలి.

పంచాణనం వారు – నేత, వడ్రంగి, కుమ్మర, కుమ్మరి, చర్మకారులు తిరునాళ్ళలో పాటించవలసిన, ధరించవలసిన వస్త్రధారణ విధానాలను ఈ శాసనం మూలంగా ఆనాటి ఆచారాల పాటింపుల వివరాలు తెలుస్తాయి.

పంచాహణం వారు, పంచాననం వారు – ఐదు కులాల వారు.

నట్టువ ముట్టువకారు – నాట్య కళాకారులు (తలపాగ, పచ్చడం, పిరిచుట్టు)

విడెం శాయక – తాంబూలం సేవించక

వులిం‌న్ని – ఉలిని

గూంటము – గూటము

కొడవలం – కొడవలి

కెంకర్యాలు – కైంకర్యాలు

**ఉదయగిరి (16) పల్లవోలు, ఆవులమ్మ గుడి**

శ్రీ శంభోనమోస్తు. శ్రీ రామా దుందుభి నామ సంవత్సరం భాద్రపద శుద్ధ 10న సైదు అబ్దుల్లా సాహెబులవారు దౌదుల చేని కరణం వారి మాన్యానకు 10 గొర్లు, ఆవుల మాలెకు (ఆవులమ్మ దేవతకు) మాన్యం చేను ఇచ్చారు. దీనిని కావలిరాజు వెంకటపతి, శాకమూరి అనంతప్ప రాసిన (శితారాశిదన – తెలియరాలేదు) శాసనము. దీనిని తురకలు ఆక్షేపణ చేస్తే మక్కాలో పందిని, ఆ పేట కాపువారు ఆక్షేపణ చేస్తే కాశిలో గోవును చంపినట్లు.

**భాషాంశాలు**

గొర్లు – గొర్లు

కరణవారి – కరణం వారు

తుఋకలు – తురకలు

ఆపెదాని – ఆపేదానికి, ఆపడానికి

చేని – చేను

**ఉపయుక్త గ్రంథాలు**

1. బూదరాజు రాధాకృష్ణ, EARLY TELUGU INSCRIPTIONS ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1971.

2. Collection of the inscription on copper Plates and Stones, Nellore District, Madras, 1905.

3. ALAN BUTTUR WORTH, V. VENUGOPAL CHETTY, PART - 1&3

❖ ❖ ❖ ❖ ❖

## నువ్వు ... నేను ... ‘అవధాని’ అవుసుల భానుప్రకాశ్ ఫోన్ : 96032 04507

శంకరా!
నువ్వు నడిపే వాడవు
నేను నడిచేవాడను
ఇద్దరిలో ఆత్మశక్తి అమ్మే!
నువ్వు చైతన్యానివి!
నేను కదలికను !!

★★

శంకరా!
నువ్వు అక్షరాలను రాల్చావు
నేను అక్షరాలను పేల్చాను
సౌందర్య భరిత పద్యమైంది!
నువ్వు ఆత్మవు!
నేను రూపాన్ని !!

★★

శంకరా!
నువ్వు కన్ను తెరిస్తే నిప్పుల వర్షం
నేను కలం రగిలిస్తే చేతనాగ్ని వర్షం
సామాజిక హితమే నిరంతరం!
నువ్వు కరుణిస్తే
నేను చిగురిస్తున్నా!!

★★

శంకరా!
నీ చేత త్రిశూలం పాప ప్రక్షాళనకై
నా చేత కలం హృదయ ప్రక్షాళనకై
ఏదయితేనేం? కడిగేయడమే,
నువ్వు ప్రేరణ!
నేను ఆచరణ!!

★★

శంకరా!
నీ కంటిచుక్క రుద్రాక్షయ్యింది
నా కంటిచాటు చుక్క కవితయ్యింది
ఆకృతి దాల్చితేనే సుకృతి గదా!
నువ్వు శక్తివి!
నేను స్వరూపాన్ని!!

★★

శంకరా!
నువ్వు భక్తులకు పరీక్ష పెడుతావు
నేను పిల్లలకు పరీక్ష పెడుతాను
అంతిమ ఫలితం తేల్చడానికే
నువ్వు చుక్కానివి!
నేను పడవను!!

★★

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1 21 హైదరాబాద్ నవంబర్ : 2025

# సినారె వచన నాటికలు

**ఆచార్య పాకనాటి జ్యోతి,** విశ్రాంతాచార్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్. ఫోన్ : 98492 77389

ఆధునిక తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రతిభాశాలియైన నారాయణరెడ్డి గారు స్పృశించని ప్రక్రియ లేదు. పరామర్శించని సాహిత్యాంశం లేదంటే అతిశయోక్తి కాదు.

**ఇతదహంకృతి దూర జీవితము వలచి**
**నాచికొనె నాంధ్రజాతి మానసమునెల్ల**
**నితని మెచ్చుట తెలుగు భారతిని మెచ్చు**
**టని తలంతురు సత్యధర్మాభిరతులు (తెనుగులెంక)**

అని తుమ్మల సీతారామమూర్తి గారు వీరి గురించి చేసిన ఈ ప్రశంస అక్షరసత్యం. వీరు ఎన్నో గేయ నాటికలు, వచన నాటికలను రచించారు. వచన నాటికలను పరిశీలించటమే ఈ వ్యాస ఉద్దేశం.

విశ్వంభరా విజన్ పబ్లికేషన్స్ వారు 2001 మార్చిలో **"డా॥సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం"** సంపుటులను ప్రచురించారు. పదమూడవ సంపుటిలో ఊర్మిళ, వరూధిని, మేఘమాధురి, దీపలీల, నాగార్జున సాగరం, కర్పూర వసంత రాయలు, విజయ సంక్రాంతి, రఘుపతి రాఘవ రాజారాం, కాళిదాసు పునరాగమనం, హరి చరణదాసి మీరా అనే పది నాటికలను, పదిహేడవ సంపుటిలో సినీ కవి మనస్సినీవాలి అనే నాటికను చేర్చారు. దాదాపు ఈ నాటికలన్నీ వివిధ పత్రికలలో ప్రచురింపబడి ఆకాశవాణి ద్వారా ప్రసారమైనాయి. వచన నాటికలన్న పేరే గాని కొన్ని నాటికల్లో గేయాలెన్నో చోటు చేసుకున్నాయి. నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు నాటికలు వారి గేయ కావ్యాలకు నాటకీకృతులు. ఈ నాటికలన్నిటిని ధ్వన్యనుకరణ కళాకారులు డా.నేరెళ్ల వేణుమాధవ్ గారికి అంకితమిచ్చారు.

**ఊర్మిళ**

**రఘుకుల స్వామి శౌర్యమహోగ్రరేఖతో**
**తునియలై విరిగి నేల రాలె హరువిల్లు**
**ఆ స్వామి వీర శృంగార రూపము గాంచి**
**సీతమ్మ కనుల వికసించినది హరివిల్లు**

– అని సీతాకల్యాణంతో ప్రారంభమైన ఈ నాటికలో ఊర్మిళ త్యాగనిరతిని ఉదాత్తంగా చిత్రించటంలో వీరు కృతకృత్యులైనారు. వాల్మీకి మొదలు తదనంతర కవులెందరో తమ రచనల్లో ఊర్మిళ వృత్తాంతాన్ని మరచిపోయినా, జానపదులు మాత్రం **"ఊర్మిళాదేవి నిద్ర", "లక్ష్మణ దేవర నవ్వు"** అనే పాటలుగా పాడి ఆమె త్యాగాన్ని గుర్తించారు. ఆధునిక కాలంలో బందాకనక లింగేశ్వరరావు,



ఆడిదము రామారావు, ఇల్లిందల సరస్వతీదేవి, దేవేంద్ర సత్యార్థి, మైథిలి శరణ్ గుప్త మొదలైన వారు ఊర్మిళను ప్రస్తుతించారు. సినారె రచించిన 'దివ్వెల మువ్వలు' సంపుటిలో ఊర్మిళ అనే ఖండిక ఉంది. ఇదే ఈ నాటికకు ఆధారంగా నిలిచింది. జానపద కథాంశాలెన్నో (Motifs) ఈ నాటికలో కనిపిస్తాయి.

వివాహానంతరం ఊర్మిళ లక్ష్మణుల ప్రథమ సమాగమం మొదటి సన్నివేశంగా చిత్రింపబడింది. ఊర్మిళను శోభన మందిరంలో చేర్చి చెలికత్తెలు వెళ్ళిపోతారు. ఊర్మిళా లక్ష్మణుల ప్రేమను రసరమ్యంగా వర్ణించటమే కాదు, లక్ష్మణుని అవతార తత్త్వాన్ని నాటికలో వీరు అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంలో ఊర్మిళ లక్ష్మణునితో తాము తొలిసారిగా కలుసుకున్న సంఘటనను గుర్తు చేసింది. **"రాఘవేంద్రులు విల్లెక్కుపెడుతూ వుంటే ఇటు మీ ఇరుభుజాల్లో ఎంతటి శౌర్యరసం పొంగిపోయిందో, మీ వదన మండలంలో ఎంతటి గర్వరేఖ ఎదిగి నిలిచిందో, అప్పుడు మిమ్మల్ని చూస్తుంటే ఆదిశేషులేమో అనిపించింది"** అని ఆమె పలికిన పలుకులు లక్ష్మణుని వ్యక్తిత్వాన్ని సాక్షాత్కరింప చేశాయి. సంప్రదాయజ్ఞులు లక్ష్మణుని ఆది శేషువు అవతారమని భావిస్తారు. భగవంతునికి ఆసనంగా, పడకగా, వాహనంగా అన్ని రకాల సేవలను చేసే ఆదిశేషులే లక్ష్మణుడని **"అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చతే"** అని రామాయణంలో లక్ష్మణుడు చెప్పిన ఈ మాటలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి. బుద్ధి వైభవంలో జనక రాజర్షి ముద్దుబిడ్డ వనిపించు కున్నావని లక్ష్మణుడు ఊర్మిళను ప్రశంసించాడు. ఆ ప్రశంసలో ఆమెను తండ్రితో పోల్చటంలో ఆమె వైరాగ్య భావాలు, సమచిత్తవృత్తి వ్యక్తమైనాయి.

జానపద గాథల్లో నాయకుడు కార్యసాధనకు బయలుదేరు తున్నప్పుడు ఆయనకు ప్రతీకగా మొక్క నాటడం, అది వాడిపోతే వెళ్లిన చోట అతనికి ఏదైనా ఆపద సంభవించిందని అనుకోవటం

అనే కథాంశాలు విరివిగా కనిపిస్తాయి. ఇటువంటి అంశమే ఈ నాటికలో చోటు చేసుకుంది. ఊర్మిళ తమ అంతఃపురోద్యానవనంలో మల్లెమొక్కను తాను స్వయంగా నాటానని, అది తమ మధుర దాంపత్య జీవితానికి మాసిపోని చిహ్నమని, ఈ మల్లెతీగ అల్లుకున్నట్టే మన కాంక్షలల్లుకోవాలని, అది పువ్వులు పూసినట్టె మనం చిరునవ్వులు పండించుకోవాలని, ఇది కొనలు సాగినట్టే తమ అనురాగం తీగ సాగాలని లక్ష్మణునితో చెపుతుంది. ఇంతటి అమృతమూర్తిని అర్ధాంగిగా పొందిన ఈ సౌమిత్రి జన్మ సార్థకం సుమా అని లక్ష్మణుడు ఆమెతో అన్నాడు.

మరొక సన్నివేశంలో ఊర్మిళ లక్ష్మణుని మల్లెపూలతో అభిషేకించింది. అతడు ఆమెతో ఈ సాయంసంధ్యలో మల్లెపూల అభిషేకాన్ని అనుభవిస్తున్న నేను రేపటి ఉదయం మరో మహాభిషేకాన్ని సందర్శించనున్నానని, రామునికి యౌవరాజ్యాభిషేకం నిశ్చయమైందని చెపుతాడు. ఊర్మిళ సంతోషంతో పొంగిపోయింది. ఆ మరుసటి రోజు ప్రభాత సమయంలో తమ సౌధాన్ని ఇంద్రభవనంలా అలంకరించమని చెలికత్తెలకు చెప్పి తాను తన మల్లెతీగ దగ్గరకు వెళ్ళింది. అది పూర్తిగా వాడిపోయిన తీరు చూసి హతాశురాలైంది. ఇలాంటి అమృత సమయంలో ఏమిటీ అశుభ సూచన అంటుండగానే నార చీరలు ధరించిన లక్ష్మణుడు ఆమెను సమీపించి **"నా వేషం వింతగానే వుంది కదూ! నీ అంతరంగాన్ని ఆకళించుకున్న వివేకవల్లి-నీవు పెంచిన మల్లి తగిన సూచనే చేసిందంటాడు. భరతుని పట్టాభిషేకం, రామచంద్రుని పద్నాలుగేళ్ల అరణ్యవాసం గురించి చెప్పి, తాను కూడ వారితో అడవులకు వెళ్ళిపోవాలని నిశ్చయించు కున్నానన్నాడు. ఆ అదృష్టాన్ని పంచుకునే అర్హత మీ అర్ధాంగినైన నాకు లేదా స్వామి అని"** ఆమె అడిగింది. తాను ఆ దివ్య దంపతులను సేవించటానికి వెళుతున్నానని అనగానే మీరు సీతారాములను సేవిస్తే నేను మీ పాద సంవాహనం చేస్తూ ఉండిపోతానని అభ్యర్థించింది. తన జీవితంలో బరువు మోయడంలో ఉన్న తృప్తి బరువు దించుకోవడంలో లేదన్నాడు. ఆ విషయం తనకు తెలుసునని, తొలిసారి అతనిలో ఆదిశేషువును చూశానని, సీతారాములు నడిచే దారిలో మీరు పచ్చికలా పరచుకుంటే తనకదే పదివేలని, తాను గరళం మింగక తప్పదని దుఃఖాన్ని అణచుకోవటానికి ప్రయత్నించింది. రాముడు కూడ ఈ సందర్భంలో ఊర్మిళ త్యాగాన్ని తలచుకుంటే తాము లజ్జాభారంతో కుంచించుకుపోతున్నామని, ఆమె నిగ్రహాన్ని కొనియాడాడు. ఈ ఘట్టం నారాయణరెడ్డి గారి నాటికా నిర్మాణ సౌష్ఠవాన్ని, కథన శిల్పాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. జానపదుల పాటలో **'బావ నడిచిన మార్గమున నడువ రాదందురూ, యేలాగు వేగింతునూ-బావ మాటల ధ్వని భూమిపై వినరాదు యేలాగు వేగింతునూ'** అన్న కారణంతో లక్ష్మణుడు ఆమెను ఇంట్లోనే ఉండి పొమ్మన్నాడు.

చిత్రకూటంలో సీతారాములు ఊర్మిళా లక్ష్మణుల గురించే సంభాషిస్తూ, తాము అరణ్యంలో ఉన్నా ఊర్మిళ అయోధ్యలో తమకంటే కఠోరవ్రతం అవలంబించిందని, జనకుని సంయమనాన్ని అలవరచుకున్న త్యాగశీలి అనుకుంటారు. అర్ధరాత్రి కావస్తున్నది, సౌమిత్రి ఇప్పుడైనా కునుకు తీశాడో లేదో చూసొస్తాను అని రాముడు పర్ణశాల బయటికి వచ్చాడు. లక్ష్మణుడు ఎందుకో తనలో తాను నవ్వుకుంటున్న దృశ్యాన్ని చూశాడు. ఆ నవ్వుకు కారణమేమిటని అడిగిన అన్నతో లక్ష్మణుడు తనకు అవ్యక్తాకృతితో ఒక స్త్రీ కనిపించి తాను నిద్రాదేవినని తనను ఇద్దరు బహిష్కరించారని, ఒకరు ఊర్మిళ, మరొకరు లక్ష్మణుడని చెప్పి తటాలున నిష్క్రమించేసరికి నవ్వు వచ్చిందని చెపుతాడు. రాముని హృదయం ద్రవించింది. తట్టుకోలేక పోయినాడు. **"లక్ష్మణ దేవర నవ్వు"** పాటలోని ఈ అంశం వేరొక రూపంలో ఈ నాటికలో చోటు చేసుకున్నది. ఊర్మిళా లక్ష్మణుల మనో ప్రవృత్తిని నాటికలో వీరు మనోహరంగా, చక్కటి సంవిధానంతో రచించిన తీరు హృద్యంగా ఉంది.

వనవాసానంతరం తిరిగి వచ్చిన రాముడు తల్లితో **"ఇన్నాళ్లు ధర్మపాలనకు పట్టుగొమ్మగా నిలిచిన ఊర్మిళ ఎక్కడమ్మా"** అని అడిగాడు. అపుడు కౌసల్య ఏళ్ల తరబడిగా మల్లెతీగ దగ్గరే ఆ వెర్రితల్లి శిలలా పడి ఉంది. మనం పిలిస్తే పలికే స్థితిలో లేదు. అపూర్వ యోగినిగా మారిందని చెప్పగానే వెంటనే వెళ్లి మరదలిని ఆశ్వాసించు మని లక్ష్మణుని ఆజ్ఞాపించాడు. వారిద్దరి సమాగమ సన్నివేశంతో నాటిక ముగుస్తుంది. లక్ష్మణుని సేవా తత్పరతకు ఊర్మిళ దోహదం చేసిన విధానం నాటికలో భావనాత్మకంగా వర్ణింపబడింది. కాల్పనికోద్యమ ప్రభావంతో రసరమ్యంగా ఊర్మిళ పాత్రను లోకోత్తరంగా తీర్చిదిద్ది సూర్యుడు **"ఏడు వన్నెలు జీర్ణించుకొని ఏకవర్ణం చిమ్ముతాడని"** తన కవిత్వంలో చెప్పినట్లు సినారె ఏడు సన్నివేశాలతో ఈ నాటికను హృదయం గమంగా ఆవిష్కరించారు.

**వరూధిని**

అల్లసాని పెద్దన మనుచరిత్రలోని మూడు ఆశ్వాసాల కథను కవి ఇతివృత్తంగా తీసుకొని స్వల్ప మార్పులతో వరూధిని నాటికగా మలిచారు. గంధర్వుడు, వరూధిని, ప్రవరుడు, సిద్ధుడు, అశరీరవాణి, హేమ ఈ నాటికలోని పాత్రలు.

గంధర్వుని పాత్ర ప్రవేశంతో నాటిక ప్రారంభమైంది. తాను పగలనక రేయనక వరూధిని అందాన్నే జపిస్తున్నానని, మనసారా తనను కడగంట చూడరాదా అని ఆమె వెంటపడ్డాడు. అనురాగం లేనప్పుడు ప్రేమ, సంయోగ ప్రసక్తే లేదని నిరాకరించింది. సమాధానంగా గంధర్వుడు **"నామీద నీకు మనసెందుకుండ కూడదు? రూపంలో, ప్రాయంలో, అన్నిటా నీకు తగినవాన్నే కదా?"** అని అడిగాడు. ఈ మాటే జయంతు దన్నాడు. వసంతుడూ అన్నాడు,

తనకు ఎవ్వరి మీదా రక్తి లేదు, ఆసక్తి లేదనగానే **"నీకు సురవరులు సరిపడక పోతే మానవ లోకానికి వెళ్లి ఏ మంచుకొండల్లోనో ముక్కు మూసుకొని జపం చెయ్యి అక్కడ దొరుకుతాడు ఒక చక్కని వరుడు"** అని గంధర్వుడు ఉక్రోషంగా అన్నాడు. భవిష్యత్తులో జరుగబోయే ఆగామి కథకు సంకేతంగా కూర్చిన ఈ సన్నివేశం కవి కల్పనా చాతుర్యాన్ని, ప్రయోగ కుశలతను తెలియ జేస్తున్నది. నరుడే దొరుకుతాడో, సురల దొరల సోయగాన్ని తిరస్కరించే అవనీ సురుడే దొరుకుతాడో అని వరూధిని అక్కడి నుండి నిష్క్రమించి హిమాలయాలకు చేరుకుంటుంది.

ప్రవరుని చిత్తవృత్తిని పెద్దన **"వివిధాధ్వర ధర్మకర్మ దీక్షా పరతంత్రుడని, శీలంబున్ గులమున్ శమంబు దమమున్ జెల్వంపు లేఁబ్రాయమున్"** అని వర్ణించాడు. అతనికి తగ్గ ఇల్లాలు అతిథి మర్యాదలకు లోటు చేయదని, ఆ కుటుంబ నిరతరాన్నదాన విధానాన్ని ప్రస్తుతించి, అభ్యాగతాదరణ ధర్మాన్ని స్థాపించి సిద్ధాగమనానికి ఉపపత్తిని కల్పించాడు.

ఈ నాటికలో కూడ అభ్యాగత సేవా పరతంత్రుడైన ప్రవరుని ఇంటికి ఒకనాడు ఔషధ సిద్ధుడొకడు వచ్చాడు. అతనిని సంతుష్టుని చేసిన తరువాత ప్రవరుని కోరికననుసరించి సర్వతీర్థ ప్రభావాలు సిద్ధుడు వివరించాడు. రెక్కలు కట్టుకొని తిరిగినా చుట్టి రాలేని విశాల లోకాన్ని ఇంత చిరుత ప్రాయంలో ఎలా చూడగలిగారని ప్రవరుడు ప్రశ్నించగానే, అదొక పరమ రహస్యమని, అతని లాంటి జిజ్ఞాసువుకు చెప్పడం తప్పుకాదని, తనకు పాదలేపన రూపంలో దివ్యౌషధ రసం ఈశ్వరకృప వల్ల లభించిందని దాని ప్రభావంతో చిటికెలో హుటాహుటిని దిగంతాలకు తిరిగి వచ్చే అమోఘశక్తి ఏర్పడిందని చెప్పి అతని తీర్థయాత్రా దర్శన కుతూహలం తనకు అర్థమైందని ప్రవరునికి పాదలేపనం ప్రసాదించాడు.

పాదలేపన ప్రభావంతో ప్రవరుడు హిమాలయాలకు వెళ్లి, మధ్యాహ్నం వరకు ఆయా దృశ్యాలను చూశాడు. ఇప్పటికే జాగయింది, ఇల్లు చేరుకోవాలనుకున్నాడు. కాళ్లు సాగటం లేదు. పాదలేపనం కరగి పోయిందని తెలుసుకొని హతవిధీ! ఎక్కడి అరుణాస్పదం? ఎక్కడి హిమాచలం? కాశీ ప్రయాగాది పుణ్యక్షేత్రాలకు వెళ్లక కన్ను గానని అజ్ఞానంతో ఈ మిన్నులు పడ్డ చోటికి నేనెందుకు రావాలి? ఔను **"బుద్ధి జాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్"** ఇక తనకు దారి చూపేదెవరని పరిపరి విధాల ప్రవరుడు విచారించాడు. మనుచరిత్రలోని ఆయా పదబంధాలనే సినారె ప్రయోగించి నాటికకు కావ్యశిల్ప సౌందర్యాన్ని సమకూర్చారు.

కొంతసేపటికి దూరం నుండి రాగాలాపన, వీణాధ్వని వినిపించగానే ప్రవరుడు అక్కడికి చేరుకున్నాడు. అక్కడ వరూధిని కనిపించింది. ఆమెను చూసి "భీత హరిణేక్షణా! ఎవరు నీవు" అని







అడిగాడు. ఆ ప్రశ్నే నేనడుగ వచ్చునా అన్నది. ప్రవరుడు తానొక భూసురుడనని, పేరు ప్రవరుడని, తీర్థయాత్రలు సేవిద్దామని వచ్చి తెరువుగానక పరితపిస్తున్నానని, పురం చేరే మార్గం చూపి పుణ్యం కట్టుకొమ్మని అభ్యర్థించాడు. అతనిని చూసిన వెంటనే మోహించి, శృంగార రసోద్రేక అయిన వరూధినికి ఆ మాటలు కంటగింపుగా తోచాయి. తాను గంధర్వాంగనని, కనుల కరువు తీరగా, మనసు తమితీరగా తన సపర్యలు అందుకునే తరుణం ఈనాటికి ఆసన్నమైందని, ప్రథమ వీక్షణంలోనే తన అంతరంగాన్ని ఆక్రమించుకున్న కాంతిమూర్తివి నీవని, ఇన్నాళ్లు తాను ముడుపు కట్టుకున్న మొలక వలపు నిన్ను చూడగానే రేకు లెత్తిందని అతడిని సమీపిస్తుంది. ప్రవరుడు తాను వివాహితుడనని, గృహస్థాశ్రమ ధర్మాలతో కాలం గడుపుతున్న కర్మిష్ఠినని తనపై మరులు గొనటం ఆమెకు ధర్మం కాదని తిరస్కరించాడు. తనను ఈ విపత్తునుండి రక్షించి ఇల్లు చేర్చే భారం నీదేనని అగ్నిదేవుని ప్రార్థించి, ఆయన దయతో ఇల్లు చేరినాడు.

మనుచరిత్రలో వరూధిని తన వాదనలన్నీ తిరస్కరించిన ప్రవరుని **"నిక్కము దాపనేల ధరణీ సురనందన నీ పయిన్ జిక్కెమనంబు"** అని కౌగిలించుకున్నది. ప్రవరుడు జితేంద్రియుడై, ఆమెను త్రోసి, తన మేనికంటిన, ఆమె మేని జవ్వాది మై పూతలను కడుక్కున్నాడు. కాని ఈ నాటికలో కవి ప్రవరుని ఏక పత్నీత్వ పవిత్ర ధర్మాన్ని, స్వధర్మ నిర్వహణ వ్రతాన్ని పరిపోషించటానికి ప్రవరునిపై ఆమె పడిపోయినట్లుగా కాక సమీపించినట్లుగా స్వల్పమార్పులు చేసి నాటికకు కొత్త అందాన్ని సమకూర్చాడు.

వరూధిని చెలికత్తె హేమ, ప్రవరుని తిరస్కారానికి దుఃఖిస్తున్న వరూధినిని చూసి గంధర్వాంగనలకు ఇది తగిన వైఖరి కాదని సముదాయిస్తున్నప్పుడు వరూధిని తాను గంధర్వ కులంలో పుట్టడమే తాను చేసిన నేరమని, చెలుని కోసం విలపించటం అంతకుమించిన దోషమని **"ఒక మానవాంగనగా జన్మిస్తే, ఈ ముప్పు తప్పేది కదా! ఏ కొండ లోయలోనో దూకితే ఇట్టే ప్రాణాలు పోగలిగితే ఎంత**

**బాగుండేది"** అని భావిస్తుంది. ఈ సన్నివేశం ద్వారా కేవలం వరూధినిలో ఉన్న కాముకత్వమే కాక, ప్రవరుని పట్ల ఆమె స్వచ్ఛమైన ప్రేమ కూడ నిరూపణమైంది.

దూరదృష్టితో ఇదంతా గ్రహించిన గంధర్వుడు మాయా ప్రవరుని వేషంలో వచ్చి పూర్తిగా మారిపోయిన నీ ప్రవరుణ్ణి అని ఆమెను నమ్మించాడు. అది పూర్తిగా విశ్వసించిన వరూధిని **"తన ప్రణయ జీవితంలో ఓంకారం పలికిన తొలి ఋక్కు అతని మధురమైన వాక్కు"** ఆ అనుభూతి కోసమే కదా తాను ఇన్నాళ్లు పరితపించానని అనుకున్నది.

చివరి సన్నివేశంలో కవి ప్రవరుడు కలగన్నట్టుగా ఒక కల్పనా చమత్కృతి చేసి ప్రవరుని పాత్ర స్వభావానికి వన్నె తెచ్చాడు. ప్రవరుడు నిద్రలోనే కెవ్వున కేక వేసి **"వరూధిని, వదలు, కౌగిలి వదలు"** అని కలవరించాడు. వెంటనే లేచి పీడకలలో కూడ ఇలాంటి దుర్ఘటన జరగడం దారుణం కదా అనుకున్నాడు. కాని అశరీరవాణి అది దారుణం కాదని ఆగామి సత్యానికి మూల కారణమని, ఈ క్షణాన వరూధిని కౌగిట్లో ఉన్నది నీవేనని చెప్పింది. నేనా! అని ఆశ్చర్యపోయినాడు ప్రవరుడు. అందుకు **"నీవంటే నీవు కాదు. నీ తేజం. వరూధినిని వలచి ఆమెచే తిరస్కృతుడైన ఒక గంధర్వుడు నీ రూపంలో ఆవిడ కౌగిట్లో ఉన్నాడు. సురవీర్యం, భూసుర తేజం ఏకీకృతమవుతాయి. ఫలితం స్వరోచి జననం. ఆ స్వరోచి స్వారోచిష మను సంభవానికి హేతు భూతుడవుతాడు. అది నిగూఢ సత్యమని అశరీరవాణి పలికింది. మూలంలో లేని సన్నివేశాలను కవి కల్పించి, చక్కటి కథా సంవిధానంతో ఔచిత్య పోషణ చేశారు."**

**మేఘమాధురి**

నారాయణరెడ్డి గారు ఈ నాటికను కల్పనాత్మకం, వర్ణనాత్మకమే కాదు, సందేశాత్మకంగా చిత్రించారు. పురుషుడు, స్త్రీ, పృథివి పాత్రలను తీర్చి కష్టసుఖాలు శాశ్వతం కాదని, ఋతుపరివర్తన సదృశంగా ఉంటాయని ప్రకృతి వర్ణన, స్త్రీ వర్ణన, ప్రణయం మొదలైన అంశాలను నాటకీకరించి ప్రకృతిలో జరిగే పరిణామాల విధంగా మానవుని జీవితం ఉంటుందని, దేనికి భయపడకూడదని అన్యాపదేశంగా సందేశాన్నందించారు. నాటిక ప్రారంభంలో పురుష పాత్ర ప్రవేశించి ప్రకృతిలోని అందచందాలను వర్ణిస్తూ ఎంత వింతైనదీ సృష్టి అని తాదాత్మ్యం చెందుతాడు. ఒళ్లు పులకరింపచేసే పిల్లగాలిలో ఏనాడు ఎరుగని స్పర్శ సౌఖ్యం ఈనాడు అనుభవిస్తున్నానని, తనలాగే సమస్త సృష్టిలోను ఎప్పుడు లేని చైతన్యం చిగుళ్లు పోసుకుంటున్నదని, ఈ వసంత లావణ్యమంతా ఒకే దివ్యమూర్తిగా రూపొందితే ఎంత బాగుండేది అనుకుంటుండగానే హఠాత్తుగా ఒక స్త్రీ మూర్తి అవతరించింది. ప్రకృతి వర్ణన మిషగా పాత్ర ప్రవేశ సూచన చేయటం ఈ నాటికలో ఒక ప్రత్యేకత.

పురుషుడు తానిందాక చేసుకున్న కల్పనకు ఆకారం వచ్చిందా అని ఆశ్చర్యపోయాడు. ఆ విలాస మూర్తి తనను సమీపించిన కొద్దీ తన నవనాడుల్లో, పంచ ప్రాణాల్లో చిత్రమైన రాసకేళిని అనుభవిస్తున్నానని అనుకున్నాడు. ఆ స్త్రీ కూడా పురుషున్ని సమీపించి **"ఎవరు మీరు? ఈ సృష్టిలో నాకు తొలుత కనిపించింది మీరు. తర్వాత చుట్టూ ఉన్న ప్రకృతి. అవనీ, ఆకాశమూ, చెట్లు, పిట్టలూ అన్నీ ఒక ఎత్తు మీరొక ఎత్తుగా అగుపిస్తున్నా"**రని ప్రశ్నించింది. తాను కూడ అదే అనుభూతిలో ఉన్నానని పురుషుడు చెప్పగానే ఇద్దరూ పరస్పరం స్పర్శించుకున్నారు. ఏమిటీ అనుభూతి ఇదేమిటో చిత్రంగా ఉందని వారు అనుకుంటుండగానే పృథివి కంఠం వినిపించింది. తాను ప్రకృతినని, తనను పృథివి అంటారని, ఈ సృష్టంతా తన స్వరూపమేనని, తన సౌందర్యానికి ప్రత్యక్ష ప్రతీక స్త్రీ అని, జడ రూపంలో ఉన్న సృష్టి వసంత చైతన్య రూపమై స్త్రీగా నీ ముందు నిలిచిందని చెప్పింది. అయితే నేనెవరిని అని అడిగాడు. నీవు పురుషుడివి. స్త్రీ పురుషుల కలయికతో లోకంలో కొత్త ప్రకరణాలు తెరుచుకుంటాయి. జగన్నాటకంలో మీరంతా పాత్రలు. మీ కలయికతో విశ్వం సరికొత్త సోయగాలు వెలార్చుకుంటుంది. మీ కదలికలో లోకం కదలిక ఉందని, చెట్టపట్టాలు పట్టుకొని కదలిపొండని సృష్టి రహస్యాన్ని చెప్పింది. బైబిల్‌లోని ఆడమ్, ఈవ్‌ల వృత్తాంతం ఈ నాటికలో వేరే రూపం సంతరించుకుంది.

వసంత ఋతువులో ఆనందాన్ని అనుభవించిన ఈ జంట ఎండాకాలపు వేడిని తట్టుకోలేక తల్లడిల్లి పోయారు. కొన్నాళ్లపాటు మధుమాసం చూపించి ఇప్పుడీ ప్రచండ గ్రీష్మంలో పడదోశా వెందుకని, తమకు నవ జీవనాన్ని ప్రసాదించుమని పృథివిని వేడుకున్నారు. పృథివి **"శాంతించు నాయనా! ఇది నేనాడుతున్న నాటకం కాదు. ప్రకృతి ధర్మం. మీరు వెలుగు చీకట్లను చూస్తున్నారు గదా! అలాంటిదే ఈ ఋతుచక్ర భ్రమణం. ఇన్నాళ్ళూ మీరు వసంతాన్నే చూశారు. ఇప్పుడనుభవిస్తున్నది గ్రీష్మం. ఆ తరువాత వర్ష ఋతువు వస్తుందని క్రమంగా శరత్తు, హేమంతం, శిశిరం, మళ్లీ వసంతం, మనం ఎంత దురపిల్లినా ఈ ఋతు పరివర్తనం ఆగ"**దని చెప్పింది.

గ్రీష్మతాపం రుచి చూడకుండా వుంటే మనం మేఘమాధురిని, వర్షా సౌఖ్యాన్ని అనుభవించగలిగే వాళ్లం కాదు కదా అని ఆ జంట, వర్షధారల్లో తడిసిపోయి ఆనందిస్తారు. ప్రకృతిలో జరిగే పరిణామాలను ధైర్యంగా ఎదుర్కోవాలని, మనిషికి, ప్రకృతికి ఉండే సంబంధాన్ని భావగర్భితంగా చెప్పిన తీరు విశిష్టమైంది. మానవుడు భయావరణాన్ని దాటి ముందడుగు వేయాలనే విశ్వంభరా తత్త్వాన్ని ఋతుచక్ర భ్రమణైక తత్త్వాన్ని ఈ నాటికలో మనం దర్శించవచ్చు.

**దీపలీల**

దివ్వెలమువ్వలు అనే ఖండిక ఆధారంగా వీరు 'దీపలీల' నాటికను రచించారు. ఒకే సన్నివేశంగా చిత్రించిన ఈ నాటికలో మానవుడు, మాయ, వృద్ధుడు, అమ్మాయి పాత్రలు. దేని కోసమో అన్వేషిస్తున్న మానవునికి మాయ ఎదురుపడి అతని గమ్యమేమిటో తనకు తెలుసునని **"నీ లక్ష్యం కాంతి"** అని చెపుతుంది. అయితే అది చూపించమన్నాడు. వెలుతురు నీ మనసులోనే ఉంది కదా అంటే, మనసులో ఉంటే ఇన్ని యాతనలెందుకు? తన హృదయం ఏనాడో బొగ్గయిపోయిందని దాన్ని మాణిక్యంగా మార్చే మహాశక్తి కోసం లోకమంతా గాలిస్తున్నానని, యుగయుగాల నుండి ఇలా వెర్రిగా తిరుగుతున్నానని, తన లక్ష్యమేమిటో చూపించుమని మాయను వేడుకుంటాడు. ఆమె తప్పకుండా చూపిస్తానని కళ్లు మూసుకోమన్నది.

నాటికలో గతాన్ని సూచించే చిత్రమైన సంగీతంతో, స్థలం మార్పుతో మరొక దృశ్యం ప్రారంభమైంది. వృద్ధుడు, అమ్మాయి సంభాషిస్తుంటారు. సృష్టి వెనక ఇంత కథ ఉంటుందని ఇప్పుడే తెలుసుకున్నానని, కాని అసలైన వెలుతురు ఎక్కడ ఉంటుందో నీద్వారా తెలుసుకోవాలను కుంటున్నానని అమ్మాయి వృద్ధుని అడిగింది. సృష్టితత్త్వం తెలుసుకోవడమంటే అసలైన వెలుగును కనుక్కోవడమేనని, పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం ఈ ఎనిమిది రూపాల్లో ఉన్న మాయాశక్తి సమస్త లోకాన్ని తన గుప్పిట్లో పెట్టుకొని ఉందని, దీపాల రూపంలో మనకు కనిపిస్తున్న కాంతి అనంతమైన మాయాశక్తిలో ఒక అంశమాత్రమేనని, దీని కతీతంగా శాశ్వతమైన పరిశుద్ధమైన ప్రకృతి ఉందని, అదే పరమాత్మ స్వరూపమని స్పష్టం చేశాడు.

మానవుడు ఆనందాతిశయంతో కేకవేసి తన చిరకాల యాత్రకు లక్ష్యం దొరికిందని సంతోషించాడు. తన గుండెకు చుట్టుకున్న మాయావలయం పటాపంచలైందని, తాను కాంతి లోకంలో ఉన్నానని, అక్షర వాహిని జగన్మోహిని దర్శనం లభించిందని, ఆమె పాదాల మువ్వలు, వేళ్ల తళతళలు తనలో విడిది చేసిన తమస్సులను కడిగి వేస్తున్నాయని భావించాడు. ఈ నాటికలో కథా నిర్మాణ వైచిత్రి, కవి తాత్త్విక దృక్పథం ధ్వని గర్భితంగా వ్యక్తమైంది. తన దివ్వెల మువ్వలు ఖండికలోని కవితలను యథాతథంగా ఈ నాటికలో స్వీకరించారు.

**నాగార్జున సాగరం**

చారిత్రక కథా కావ్యంగా సినారె మలిచిన "నాగార్జున సాగరం"లో కథ, పాత్రలు కల్పితాలు. అద్భుతమైన ఈ కావ్యమే ఈ నాటికగా రూపుదిద్దుకున్నది. కావ్యంలోని కొన్ని గేయాలు ఆయా సన్నివేశాలలో ప్రయోగింపబడినాయి. విషాదాంతంగా రచింపబడిన ఈ నాటికలో శాంతిశ్రీ, పద్మదేవుడు నాయికా నాయకులు. నాగార్జునుడు స్థాపించిన విశ్వవిద్యాలయంలో శాంతిశ్రీ విద్యార్థిని. పద్మదేవుడు శిల్పి. పరస్పరం



ఇష్టపడతారు. బౌద్ధ మతాచార్యులకు తమ విషయం తెలిసిపోయిందని ఆమె భయపడుతుంది. గురుదేవుడు తన మీద కొరకొరలాడుతున్నాడని, సంఘం తనను పతిత అంటున్నదని, తాను తలెత్తుకొని తిరుగలేనని పద్మదేవునితో చెప్పి దుఃఖించింది. మతం కన్న మానవత్వం గొప్పది. సన్యాసం కన్నా సహవాసం గొప్పది. అవసర మైతే ఈ సంఘారామాన్ని కాలద్రోసి వెళ్లిపోదామని ఆమెను అనునయించాడు. సినారె మానవతా వాదం నాటికలో ప్రతిఫలించింది. ఈలోగా గురుదేవుల పలుకులు ఆమెకు వినిపించాయి.

**"నీవు సుఖమ్మనెడు యెండమావి కొరకు అర్రుసాచి
తిరిగితివా తుదకు దుఃఖపరితప్తమ్మగుట నిజము
ఎల్ల జీవకోటులపై చల్లుము ప్రేమామృతమ్ము
ప్రత్యేక ప్రాణిపైన పనికి రాదు మమత్వమ్ము"**

అని బోధించిన గురువు దగ్గరకు వెళ్లి మతాన్ని, సంఘారామాన్ని వదులుకోలేనని, తాను ప్రేమించిన పద్మదేవుని ముఖం చూడనని, క్షమించుమని ప్రార్థించింది. పద్మదేవుడు సంఘారామానికి వెళ్లి శాంతిశ్రీతో ఒక్కసారి మాట్లాడాలని అనుమతించుమని వేడుకుంటాడు. దానికి వారు అనుమతించక బుద్ధదేవుని పాదాల సాక్షిగా ఆమె అతనిని చూడనని ప్రమాణం చేసిందని, సంఘారామాన్ని విడిచి వెళ్లిపొమ్మన్నారు. మతమనే మత్తు మందు చల్లి ఆమె కళా హృదయాన్ని నేలపాలు చేస్తారా, ఆమె పచ్చని బ్రతుకును సన్యాసం వైపు ఈడ్వడం కన్నా మీ మతం సాధించే ప్రయోజనమేమున్నదని తాను కూడ దీనమానవుల సేవ చేస్తూ ఉంటానని శాశ్వతంగా వెళ్లిపోయినాడు. మానవత్వం మరచిన ఏ మతమైనా గర్హనీయ మైనదని, మనిషిని కేంద్రంగా చేసుకొని పురోగమిస్తేనే లోకానికి శ్రేయస్కరమని, కవి ఈ నాటిక ద్వారా విలువైన సందేశా న్నందించారు.

**కర్పూర వసంత రాయలు**

నారాయణరెడ్డి గారి సాహితీ జీవితంలో అత్యద్భుతమైన మహాకావ్యాల్లో కర్పూర వసంత రాయలు ఆణిముత్యమనదగిందని చెప్పవచ్చు. ఎంతోమంది ఈ కావ్యం గురించి విస్తృత చర్చ చేశారు. ఎందరి హృదయాలనో సమ్మోహితులను చేసిన ఈ కళాఖండిక ఈ

నాటికకు ఆధారభూతమైంది. కావ్యంలోని గేయాలు, భూమికలో ఉదాహరించిన చాటు శ్లోకం మొదలైనవి ఈ నాటికలో కనిపిస్తాయి. నాటికకే ఇవి కొత్త సొగసులనందించాయి.

కుమారగిరి రెడ్డి కొండవీటికి రాజు. ప్రతి చైత్రంలో వసంతోత్సవాలు జరిపేవాడు. "లకుమ" అనే నర్తకి నాట్యానికి పరవశుడై ఆమెను ఆస్థాన నర్తకిగా చేశాడు. క్రమంగా ఆమెకు పూర్తిగా వశుడై రాజ్యాన్ని, రాణిని విస్మరించాడు. బావమరిది కాటయవేముని హితోక్తులను పెడచెవిన పెడతాడు. చివరకు పట్టపురాణి దేశ సంక్షేమం కోసం లకుమ దగ్గరకు వెళ్లి రాజును విడిచివేయమని కోరింది. కాళ్లపై పడింది. తన తోడిదే లోకంగా భావించే రాజును విడిచి వెళ్లటం తనకు మరణ సదృశమే అయినా రాణికి మాట ఇచ్చింది కనుక, వ్యక్తి కన్నా దేశదృష్టియే గరిష్ఠమని రాజు ఎదుటే కత్తితో పొడుచుకొని చనిపోయింది. దేశం కోసం అతడిని కర్తవ్యోన్ముఖుని చేసింది. సందేశ పత్రాన్ని లిఖించింది. ప్రసాద మాధుర్యాలు వీరి నాటికాశైలికి ప్రాణంగా నిలిచి వింత అందాలను ప్రసాదించాయి. స్థలాభావం చేత ఈ నాటికను సంక్షిప్తంగా పరిచయం చేశాను.

**విజయ సంక్రాంతి**

ఈ నాటికలో సరళ, సాతాని జియ్యర్, తల్లి, నౌకరు (సైనికుడు), పాలేరు, ఇద్దరు అల్లుండ్లు, ఇద్దరు కుమార్తెలు పాత్రలు. దేశం కోసం యుద్ధంలో పాల్గొన్న వీరసైనికుని కథను ఇతివృత్తంగా స్వీకరించారు.

సంక్రాంతి రోజుల్లో ఇల్లిల్లు తిరిగుతూ హరిదాసు (సాతాని జియ్యరు) సరళ ఇంటికి వచ్చాడు. సంక్రాంతి లక్ష్మిలా కళకళ లాడవలసిన దానివి, ఇలా చిన్నబోయి ఉన్నావేమమ్మా అని సరళను అడిగాడు. సమాధానంగా సరళ తల్లి, అల్లుడుగారు యుద్ధరంగానికి వెళ్లి శత్రుసేనలతో పోరాడుతున్నప్పుడు ఎంతో ఉత్సాహంగా ఒక ఉత్తరం వ్రాశాడు అదే మొదటిది, అదే చివరిదని, నాటి నుండి అనుక్షణం ఆయన ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నదని, నిద్రాహారాలు మాని కళ్లల్లో వత్తులు పెట్టుకొని నిరీక్షిస్తున్నదని చెపుతుంది. సాతాని జియ్యరు సరళను దిగులు పడవద్దని, ఆమె ఒక వీరపత్ని అని, మన సైనికులు సాధిస్తున్న విజయాలను పత్రికల్లో చదువుతున్న తనకే పౌరుషం పరవళ్లు తొక్కుతున్నదని, అసుర శక్తుల విజృంభణను అరికడుతున్న మన వీరయోధుల కంటి మంటలే ఆ భోగి మంటలని, ధర్మానిదే అంతిమ విజయం తల్లీ, నీ భర్త తప్పక తిరిగి వస్తాడని ఓదార్చాడు. పాత్ర చిత్తవృత్తిని పాత్ర ప్రయోజనాన్ని సంభాషణలో వర్ణించి కవి ఔచిత్యాన్ని పాటించారు.

చాంబ్ సెక్టర్ సరిహద్దులో జరిగిన యుద్ధంలో సరళ భర్త ఒక కన్ను, కాలు కోల్పోయి సంక్రాంతికి సరళ ఇంటికి చేరుకున్నాడు. గుర్తుపట్టని విధంగా మారిపోయిన అతడిని ఎవరూ తెలుసుకోలేక పోయారు. పైగా అతడు కూడ తానెవరో ప్రకటించుకోవటానికి వెనుకాడి ఆ ఇంట్లో రెన్నాళ్లుంటానని నౌకరుగా చేరతాడు. పండగకు ఇంటికి వచ్చిన అక్కలు, బావలు సరళను ఆమె భర్త గురించి అడిగితే ఆ ఉత్తరం గురించి చెప్పింది. పత్రికలో వచ్చిన చాంబ్ సెక్టర్‌లో చనిపోయిన వారి శవాల ఫొటోలు గుర్తుపట్టకుండా ఉన్నాయనే వార్త అక్క ద్వారా అప్పుడే తెలిసింది. ఒక్కసారిగా సరళ పెద్దకేకవేస్తూ కళ్లు తిరిగి పడిపోయింది. ఉండబట్టలేక నౌకరుగా చేరిన భర్త ఆమెను సమీపించి కళ్లు విప్పిచూడు అని దగ్గరగా వచ్చాడు. అతని గొంతు గుర్తు పట్టింది. అనాకారి తనంతో ఆమె దగ్గరకు రావటానికి తనకు మనసొప్పలేదని అన్నప్పుడు **"మీరు అవిటివారు కారు. దేశాన్ని చక్కదిద్దే వీరసైనికులు. మీ కన్ను పోయింది. అయినా దేశం ఈనాడు రెండు కళ్లతో చూడ గలుగుతున్నది. మీ కాలు పోయింది. అయినా దేశం రెండు కాళ్లతో అకుంఠితంగా నడవ గలుగుతున్నది. మీ రూపం మారిపోయింది. అయినా దేశ చరిత్రలో మీ శౌర్యస్వరూపం సరికొత్త వన్నెలు దిద్దుకున్నది. నాకదే చాలు"** అని ఆమె భర్త పట్ల ప్రేమను, దేశభక్తిని వ్యక్తం చేసింది **"ఇదే ఇదే సంక్రాంతి"** అనే వీరగీతంతో నాటిక ముగుస్తుంది. జాతీయ ప్రగతిశీల భావాలకు అద్దం పట్టింది ఈ **"విజయ సంక్రాంతి నాటిక"**.

**రఘుపతి రాఘవ రాజారాం**

ఈ నాటికలో కవి, వ్యాఖ్యాత, ఒక హిందువు, ఒక ముస్లిము అనే నాలుగు పాత్రలున్నాయి. గాంధీ జయంతి సందర్భంగా 1969లో **"బాపూ నీ పుట్టిన రోజు"** అన్న శీర్షికతో వీరు రచించిన గేయ పల్లవితో ఈ నాటిక ప్రారంభమైంది.

**బాపూ, నీ పుట్టిన రోజు**
**భగవానుడు పుట్టిన రోజు**
**ఒక రాముడు పుట్టిన రోజు**
**ఒక రహీము పుట్టిన రోజు ॥బాపూ॥**

హిందూ ముస్లీముల సమైక్యతను ప్రతిపాదించే ఈ నాటికలో కవి సర్వకాలానికి వర్తించే సందేశ మిచ్చారు. అన్ని తలపులకు మూలం ఒకే ఒక్క దైవమని, ఇది విస్మరించరాదని, మంచితనం కోల్పోయిన మతం మతం కాదని, సహనం లేని మానవత మానవత కాదని "రఘుపతి రాఘవ రాజారాం" అనే జాతిపిత సందేశాన్ని ఎవరూ మరచిపోకూడదన్నారు. స్వదేశీ వస్త్రధారణ ఆవశ్యకతను క్విట్ ఇండియా ఉద్యమాన్ని, అహింసా వ్రతాన్ని నాటికలో ప్రస్తావించి, వెలవెలబోయిన జాతి వైభవాన్ని వెలిగించడమే మన ధర్మమని ప్రబోధించారు.

**కాళిదాసు పునరాగమనం**

ఈ నాటికలో వ్యాఖ్యాత, కాళిదాసు, యక్షుడు, యక్షి అనే నాలుగు పాత్రలున్నాయి. వ్యాఖ్యాత ఆకాశంలో అలుముకున్న మేఘాలను

చూస్తూ కాళిదాసు మహాకవి హఠాత్తుగా నాకు కనిపించి, అలనాటి మేఘ సందేశాన్ని వినిపిస్తే బాగుండు ననుకున్నాడు. వెంటనే కాళిదాసు ప్రత్యక్షమవుతాడు, దూరంగా యక్ష దంపతులు కూడ కనిపిస్తున్నారని, మేఘంతో సందేశం పంపింది వీరి కోసమేనా అని వ్యాఖ్యాత అనుకున్నాడు. ఆ దంపతులు కూడ కాళిదాసును గుర్తించి, ఈనాడతడు ఎవరికి సందేశం పంపిస్తాడో, ఏ వియోగుల తపస్సు ఫలించనున్నదో, దివ్యభారతీ చరణాలకు ఏ సరికొత్త కావ్యం స్వర్ణనూపురం కానున్నదో, ఆయన పంపే నవ సందేశాన్ని తాము కూడ విందామనుకున్నారు.

**ఇన్నినాళ్లుగా పెరిగిన**
**ఈ విశాల భూగోళం**
**పరమాణువు పిడికిలిలో**
**బందీయై పడి యున్నది**

అని కాళిదాసు తాను ఆనాటి ఆషాఢ మేఘంతో సందేశం పంపిన నాటి లోకానికి, ఈనాటి లోకానికి ఎంతో వ్యత్యాసం ఉందని చింతించాడు. తన నీడను చూసి తానే తడబడే రోజులని, తన హృదయాన్ని తానే అనుమానించే యుగమిదని, ప్రతిఫలాన్ని ఆశించకనే సందేశం తీసుకొని పోయే సహృదయం నేటి సమాజానికి లేదని అయినా జగమంతా శాంతి సుధలు కురిసిపొమ్మని మేఘుని కోరినాడు. విజ్ఞానం వెర్రితలలు వేస్తున్న లోకం తీరును, కలుషితమైన సమాజ ధోరణిని వ్యంగ్యాత్మకంగా కవి ఈ నాటికలో చిత్రించారు.

**హరిచరణదాసి 'మీరా'**

మీరాబాయి కథ లోక ప్రసిద్ధం. కృష్ణ భక్తురాలైన ఆమెను భర్త రాణా ఎన్నో విషమ పరీక్షలను గురి చేశాడు. అనేక రకాలుగా అనుమానించాడు. తన సాధ్వీత్వం నిరూపించుకోవటానికి నిప్పులో దూకమన్నా దూకుతాను అన్న మీరాతో **"విషం తాగి జీర్ణించుకో. నీ పస బయట పడుతుంది"** అని విషాన్ని ఇచ్చాడు. తనలో కృష్ణ తత్త్వమున్నంత వరకు విషం విషం కాదని, అమృతమై తీరుతుందని గటగటా త్రాగుతుంది. రాణా ఆమెకు ఏమీ కాలేదని గ్రహించి పశ్చాత్తాపంతో పరమపవిత్రమైన ఆమె భక్తి భావాన్ని శంకించి, నానా హింసల పాలు చేశానని, ఆమె నిజంగా హరిచరణదాసి అని, మనస్సన్యాసని, ఆత్మ యోగిని అని కీర్తించాడు. చరిత్రలో జరిగిన సంఘటనలను కవి తన కల్పనా చాతుర్యంతో తనదైన విలక్షణ శైలితో నాటకీకరించారు.

**సినీ కవి మనస్సినీవాలి**

మూడు రంగాలుగా వీరు రచించిన ఈనాటిక సినిమా ప్రపంచంలోని లొసుగులను, వ్యాపార ధోరణిని వ్యంగ్యాత్మకంగా ఎత్తి చూపింది. సినిమా నిర్మాత, కథ, సంభాషణల రచయిత అయిన




తారపతి అనే వ్యక్తి మకరందమూర్తి అనే భావకవి దగ్గరకు వచ్చి, నిరాశాపిక్చర్సు తరపున "ఆవేదన" అనే వినోద ప్రధాన విషాదాంత చిత్రం తీస్తున్నామని పాటలు వ్రాయమని అడిగారు. ప్రళయం, ప్రణయం ఒకే చిత్రంలో కుదించాలంటారు. మకరందమూర్తి అంగీకరించక పోవడంతో అభ్యుదయకవి ప్రళయానందను అడుగుతారు. అతడు వారు చెప్పిన కథ విని డబ్బు కోసం కవిత్వాన్ని అమ్ముకోమంటారా అని ఒప్పుకోడు. సినిమా కవులు కావాలని పత్రికలో వీరు వేసిన ప్రకటన చూసి హిమాంగార శాస్త్రి వచ్చాడు. తాను కథ వినాల్సిన పనిలేదని, ఇది వరకే జనరల్‌గా పాటలు వ్రాశానని మచ్చుకు వినిపిస్తానని ఇలా పాడతాడు.

**"వయసే పొంగె కన్నెలా**
**వలపులు చిలికే వెన్నెలా**
**హృదయములో జిలాజిలా**
**ఇది నిజమా మరి కలా"**

పాట విని వండర్‌ఫుల్! వళ్లు నిజంగా "జిలా జిలా" అంటున్నదని మెచ్చుకొని వెయ్యి రూపాయల చెక్కు ఇస్తారు.

సినారె తాను చలన చిత్ర రంగంలో ప్రవేశించక ముందే. సినిమారంగపు నైజాన్ని, భేషజాలను అవగాహన చేసుకున్నారు. సినిమారంగాన్ని ఆలంబనంగా గ్రహించి, నిశిత పరిశీలనా దృక్పథంతో వ్యంగ్య హాస్య ధోరణిలో చమత్కారంగా ఈ నాటికను రచించి సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టినారు. ఆయా పాత్రల పేర్లలోనే వారి వారి వ్యక్తిత్వాలను తేటతెల్లం చేశారు.

ప్రాచీనాధునిక సంప్రదాయాల సమ్మేళనంతో, ఉదాత్తమైన పాత్ర పోషణంతో, ప్రయోగ వైచిత్రితో నారాయణరెడ్డి గారు రచించిన నాటికలన్నీ సాహిత్యపు విలువలతో పాటు ప్రదర్శనా యోగ్యమైనవిగా ప్రసిద్ధి చెందాయి.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796


# అది... ఆ .. గీతం

**టి. శ్రీవల్లీ రాధిక**

ఫోన్ : 9441 644 644

ఒక నేపథ్యగీతం అలా
వినబడుతూ ఉంటుంది
జీవితమంతా..
అది అలా వినబడుతూనే
ఉంటుంది

ఎవరో వచ్చి ఒక
పూలమాలవేస్తారు
చప్పట్ల హోరు
ఆ గీతాన్ని కాసేపు
మింగేస్తుంది
మరెవరో వచ్చి
ఓ చెంపదెబ్బ కొడతారు
బాధతో కళ్ళు మూసుకుంటే
సుదూరంగా లీలగా
దాని సవ్వడి తెలుస్తుంది

ఎన్నో అనుభవాలు
సుఖాలు..దుఃఖాలు..
విజయాలు..వైషమ్యాలు..
సంపదలు.. సాధింపులు..

హఠాత్తుగా
ఎప్పుడో ఆ గీతం
మనసు నంతటినీ కమ్మేస్తుంది
ఎక్కడ ఉన్నా ఏం చేస్తున్నా
అది మాత్రమే వినబడుతుంది
విస్పష్టంగా.. వివిక్తంగా..
అది మాత్రమే మనసులో
మోగుతూ ఉంటుంది

అప్పుడిక..
ఎంతటెంతటి
కరతాళధ్వనులూ
దానికి నేపథ్యమయిపోతాయి
చెంపదెబ్బల
అవసరం లేకుండానే
కళ్ళు అరమోడ్పులవుతాయి
మాలలు కోరే మనసూ
దెబ్బలకు ఝడిసే దేహమూ
దూరమయిపోతాయి
అదొక్కటే







ఆ నేపథ్యగీతమొక్కటే
ముందుకొస్తుంది
నిండిపోతుంది
మిగిలిపోతుంది

## మాస పత్రిక పాఠకులకు ప్రత్యేక విజ్ఞప్తి

మూసీ మాస పత్రిక వ్యవహారంలో కొత్త నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ విషయంలో పాఠకుల అభిప్రాయాలు కూడా స్వీకరించాలనే భావంతో ఈ విజ్ఞప్తిని చేస్తున్నాం. దాదాపు మూడు దశాబ్దాలుగా వేరు వేరు దశల్లో మార్పులు పొందుతున్న మూసీ సాహిత్య మాస పత్రికను ఆదరిస్తున్న పాఠకులకు ధన్యవాదాలు.

చాలా సంవత్సరాలుగా మేము చందాల కోసం అభ్యర్థించడం వదిలిపెట్టాం. అదేవిధంగా ప్రభుత్వం నుండి ఎప్పుడో ఒకసారి తప్ప ప్రత్యేకంగా ఏమీ ప్రకటనలు రావడం లేదు. ఇన్నీ చేసినా ప్రతినెలా ప్రింటింగ్ కు సరిపడా ధనం రావడం లేదని అందరికీ తెలుసు. ఆ ఇబ్బందులను ఎప్పుడో మేము అధిగమించి, పత్రికా ప్రచురణ ఒక యజ్ఞంగానే కొనసాగిస్తున్నామని కూడా మీకు తెలుసు.

రాను రాను భారత ప్రభుత్వం తక్కువ రేట్‌లో పోస్ట్ చేసే విధానానికి సంబంధించిన సమస్యలు బాగా పెరిగినాయి. ప్రతి మాసం ఏదో మార్పులు చేర్పులు చెపుతూ ఉంటూనే ఉన్నారు. రాబోయే జనవరి నుండి పూర్తిగా ఈ అవకాశం కూడా తీసివేయబోతున్నారు. కాపీ బరువును బట్టి పోస్ట్ చేసుకోవచ్చునని చెప్తున్నారు. దీనివల్ల పోస్టింగ్ రేట్లు బాగా పెరుగుతున్నాయి. అంతేగాక మనం పోస్ట్ చేసిన వారందరికీ ... అందడం లేదు, ఎందుకో తెలియదు. ఎవరినీ అడిగినా సమాధానం ఉండదు. పాఠకుల నుండి మాకు తీవ్రమైన ఒత్తిడులు వస్తూనే ఉన్నాయి.

పాఠకులకు బుక్ రీడింగ్ కల్చర్ నుండి లుక్ కల్చర్ అలవాటు అయిన సందర్భాల్లో ... మూసీ మాస పత్రిక కూడా ఆఫ్ లైన్ నుండి ఆన్‌లైన్ పత్రికగా కొనసాగించమని చాలామంది మిత్రుల సలహాలు ఇస్తున్నారు. జనవరి మాసం తర్వాత నుండి క్రమంగా మనం ఆన్‌లైన్ పత్రికగా మారిపోవాలని ఆలోచన కలుగుతుంది. ఈ విషయంలో మీ సలహా, సూచనలు అభ్యర్థిస్తున్నాం. అవి ఏ రూపంలోనైనా పంపవచ్చు.

ఫోన్స్ : 9347971177, 9494715445

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025

# సిద్ధాంత గ్రంథ రచనలో 'అధ్యాయాలు' : తాత్త్విక పునాదులు, నిర్మాణ వ్యూహాలు

**ఆచార్య వెంకటరామయ్య గంపా,** భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** – సంపాదకులు.

**పరిశోధన పద్ధతిలోని ప్రధాన అంశాలు**

**పరిశోధన తత్త్వం / ప్రమాణం** (Research Philosophy/ Paradigm) : ఇది కొంచెం గూఢంగా అనిపించినా, చాలా సులభమైన భావన. పరిశోధన తత్త్వం అంటే జ్ఞానాన్ని పరిశోధకుడు ఏ దృష్టితో చూస్తున్నారు అనేది. అంటే, **'నిజం'** లేదా **'జ్ఞానం'** అంటే ఏమిటి? దానిని ఎలా కనుక్కోగలం? అనే దానిపై పరిశోధకుడికి ఉన్న ప్రాథమిక నమ్మకం. పరిశోధకుడు ప్రపంచాన్ని చూసే కళ్ళజోడు లాంటిది. పరిశోధకుడు ఏ రంగు కళ్ళజోడు పెట్టుకుంటే ప్రపంచం ఆ రంగులో కనిపిస్తుంది.

**కొన్ని ఉదాహరణలు**

**వ్యాఖ్యాన వాదం :** సాహిత్య పరిశోధనలో ఇది చాలా సాధారణం. దీని ప్రకారం, ఒక రచనకు ఒక్కటే నిర్దిష్టమైన అర్థం ఉండదు. ప్రతి పాఠకుడు, పరిశోధకుడు తమ అనుభవం, దృష్టికోణం బట్టి విభిన్నంగా అర్థం చేసుకుంటారు. పరిశోధకుడి పని ఆ అర్థాలను వెలికితీయడం, వ్యాఖ్యానించడం. ఉదాహరణకు పరిశోధకుడు శ్రీశ్రీ 'మహాప్రస్థానం' లోని ఒక కవితను విశ్లేషిస్తున్నారు అనుకుంటే, ఆ కవితలోని పదాలకు నిఘంటువులోని అర్థం మాత్రమే కాకుండా, ఆ కాలపు సామాజిక, రాజకీయ పరిస్థితులను బట్టి, కవి మానసిక స్థితిని బట్టి వచ్చే గూఢార్థాలను పరిశోధకుడు వివరిస్తారు.

**నిశ్చయవాదం** (Positivism) : ఇది ఎక్కువగా సైన్స్ పరిశోధనలలో వాడతారు. దీని ప్రకారం, ప్రతిదీ కొలవదగినది, రుజువు చేయదగినది. సాహిత్యంలో దీన్ని చాలా అరుదుగా వాడతారు. ఉదాహరణకు **'నన్నయ, తిక్కనల పద్యాల్లో 'శ్రీ' అనే అక్షరం/ పదం వాడకంపై 'గణాంక విశ్లేషణ'** వంటి అంశం తీసుకుంటే, పరిశోధకుడు కచ్చితంగా లెక్కలు వేసి, ఒక నిర్దిష్టమైన సంఖ్యతో నిరూపిస్తారు. ఇది నిశ్చయవాదానికి దగ్గరగా ఉంటుంది.

**చారిత్రక పద్ధతి :** ఒక సాహిత్య ప్రక్రియ లేదా ఉద్యమం కాలక్రమేణా ఎలా అభివృద్ధి చెందిందో అధ్యయనం చేయడం. ఉదాహరణకు **'తెలుగులో కథానిక ప్రక్రియ పరిణామం (2000–2025 )'** అనే అంశంపై పరిశోధన. పరిశోధకుడు పాత పత్రికలను, పుస్తకాలను పరిశీలించి, కథానిక ఎలా మారిందో వివరిస్తారు.

**తులనాత్మక పద్ధతి :** ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది కవులు/రచయితలను లేదా రచనలను, లేదా విభిన్న సాహిత్య ప్రక్రియలను పోల్చి చూడటం.

ఉదాహరణ : **'కందుకూరి, గురజాడల రచనలలో సంఘ సంస్కరణ దృష్టి – ఒక తులనాత్మక అధ్యయనం'.**

**ప్రత్యేక అధ్యయనం** (Case Study) : ఒక నిర్దిష్టమైన అంశాన్ని చాలా లోతుగా, వివరంగా అధ్యయనం చేయడం. ఉదాహరణకు **'బుచ్చిబాబు నవల 'చివరకు మిగిలేది'లోని పాత్రల మనోవిశ్లేషణ'** అనే అంశంపై పరిశోధన. పరిశోధకుడు కేవలం ఆ ఒక్క నవలపైనే పూర్తిగా దృష్టి పెడతారు.

**సమాచార సేకరణ పద్ధతులు**

పరిశోధకుడు తన పరిశోధన కోసం సమాచారాన్ని (డేటా) ఎలా సేకరించారు? ఏ సాధనాలను ఉపయోగించారు? అని చెప్పడం అత్యంత ముఖ్యమైన అంశం.

**ప్రాథమిక ఆధారాలు** (Primary Sources): పరిశోధకుడి పరిశోధనకు మూలమైన అసలు రచనలు. ఉదాహరణకు పరిశోధకుడు విశ్వనాథ సత్యనారాయణ నవలలపై పరిశోధన చేస్తుంటే, ఆయన రాసిన 'వేయి పడగలు', 'ఏకవీర' వంటి నవలలు పరిశోధకుడి ప్రాథమిక ఆధారాలు.

**ద్వితీయ ఆధారాలు** (Secondary Sources) : ఇతరులు రాసిన విమర్శనా వ్యాసాలు, పుస్తకాలు, సిద్ధాంత గ్రంథాలు పరిశోధకుడు పరిశోధన గ్రంథంలో ఉపయోగించుకున్నప్పుడు, వాటిని ద్వితీయ ఆధారాలుగా తెలపాలి.

**ఇంటర్వ్యూలు :** ఇది రచయితలు, లేదా ఒక అంశం గురించి తెలిసిన నిపుణులతో మాట్లాడి సమాచారం సేకరించడం. ఉదాహరణకు **'సమకాలీన తెలుగు కవిత్వంపై స్త్రీవాద ప్రభావం'** అనే అంశంపై పరిశోధన చేస్తున్నప్పుడు, పరిశోధకుడు ప్రముఖ కవయిత్రులను/ విమర్శకులను ఇంటర్వ్యూ చేసి వారి అభిప్రాయాలు తెలుసుకోవచ్చు.

**గ్రంథాలయ పరిశోధన :** గ్రంథాలయాలు, ఆర్కైవ్‌లలో ఉన్న పాత పత్రికలు, అముద్రిత గ్రంథాలు, లేఖల నుండి సమాచారం సేకరించడం.

**సమాచార విశ్లేషణ విధానాలు :**

సేకరించిన సమాచారాన్ని పరిశోధకుడు ఎలా అర్థం చేసుకున్నారు? ఎలా విశ్లేషించి ఒక నిర్ధారణకు వచ్చారు? ఏఏ సిద్ధాంతాలను పరిశోధనలో ఉపయోగించారు? అనే అంశాలను వివరించడం.

**నైతిక పరిగణనలు** (Ethical Considerations) : పరిశోధన చేసేటప్పుడు పరిశోధకుడు పాటించాల్సిన నైతిక నియమాలు. ఇది పరిశోధకుడి పరిశోధన నిజాయితీని, బాధ్యతను తెలియజేస్తుంది. నిజాయితీగా, న్యాయంగా పరిశోధకుడి పరిశోధనను పూర్తి చేయడం.

**వాఙ్మయ చౌర్యం** (Plagiarism): ఇతరుల రచనలను, ఆలోచనలను పరిశోధకుడి విగా చెప్పుకోకూడదు. ఎక్కడినుంచి సమాచారం తీసుకున్నారో స్పష్టంగా పేర్కొనాలి (Citations/ References ఇవ్వాలి).

**సమ్మతి :** పరిశోధకుడు ఎవరినైనా ఇంటర్వ్యూ చేస్తే, వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. పరిశోధకుడి పరిశోధన వివరాలు వారికి తెలిపి, వారి అంగీకారం పొందాలి.

**గోప్యత :** ఇంటర్వ్యూలలో ఎవరైనా సున్నితమైన వ్యక్తిగత విషయాలు చెబితే, వారి గుర్తింపును బయటపెట్టకుండా గోప్యంగా ఉంచాలి.

**పరిశోధన పద్ధతి -పరిమితులు :**

ప్రతి పరిశోధనకు కొన్ని పరిమితులు ఉంటాయి. పరిశోధకుడి పరిశోధన పద్ధతిలో ఉన్న పరిమితులను లేదా బలహీనతలను నిజాయితీగా అంగీకరించడం. ఇది పరిశోధకుడి పరిశోధనపై పరిశోధకుడి కు ఉన్న స్పష్టతను చూపుతుంది.

**పరిధి :** 'ఈ పరిశోధన కేవలం 20వ శతాబ్దపు తొలిదశ నవలలకు మాత్రమే పరిమితం. కాబట్టి ఇక్కడి నిర్ధారణలు ఆధునిక నవలలన్నింటికీ వర్తించకపోవచ్చు.'

ఆధారాల లభ్యత : 'పాత పత్రికలు కొన్ని లభ్యం కాకపోవడం వల్ల, ఆ కాలపు కొన్ని కథానికలు నా పరిశీలనకు అందలేదు.'

ఆత్మాశ్రయత్వం : 'సాహిత్య విశ్లేషణలో నా వ్యక్తిగత వ్యాఖ్యానం కొంతవరకు ప్రభావం చూపి ఉండవచ్చు. వేరే పరిశోధకులు దీనిపై భిన్నమైన వ్యాఖ్యానం చేసే అవకాశం ఉంది'. ఇలా ప్రతి అంశాన్ని స్పష్టంగా పరిశోధకుడు తెలియజేయాలి

**4. అధ్యాయాలు-విశ్లేషణ :**

ఈ అధ్యాయాలు పరిశోధకుడి పరిశోధన ఫలితాలను అందించి, విశ్లేషిస్తాయి. ప్రతి విశ్లేషణ అధ్యాయం ఒక నిర్దిష్ట 'ఉప-ప్రతిపాదన'ను నిరూపించడం చుట్టూ నిర్మించబడాలి. పరిశోధకుడి ప్రధాన సిద్ధాంత వాదనకు నేరుగా మద్దతు ఇచ్చే స్తంభాలు ఇవే. మరొక ముఖ్య విషయం అధ్యాయాల సంఖ్యను ఇక్కడ నుండే పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు మొదటి అధ్యాయం, రెండవ అధ్యాయం.

**వివరణ VS. విశ్లేషణ:** ఇది అత్యంత కీలకమైన వ్యత్యాసం.

వివరణ (బలహీనం): '50% మంది పాల్గొనేవారు 'అవును' అని సమాధానం ఇచ్చారు.' (ఇది 'ఏమిటి' అని మాత్రమే చెబుతుంది).

విశ్లేషణ (బలం): '50% మంది 'అవును' అని సమాధానం ఇవ్వడం గమనార్హం, ఎందుకంటే ఇది ప్రబలమైన సిద్ధాంతానికి విరుద్ధంగా ఉంది, ఇది సూచిస్తుంది...' (ఇది 'అయితే ఏమిటి?' అని వివరిస్తుంది). పరిశోధన గ్రంథంలోని అధ్యాయాలు వివరణ కంటే విశ్లేషణతో నిండి ఉండాలి.

వస్తు విశ్లేషణ : పరిశోధకుడు చదివిన రచనలలో పదేపదే వచ్చే ముఖ్యమైన అంశాలను (%ు్ప్రవఎవం%) గుర్తించి, వాటిని విశ్లేషించడం.

ఉదాహరణ: చలం కథలను విశ్లేషిస్తూ, 'స్త్రీ స్వేచ్ఛ', 'సంప్రదాయ ధిక్కరణ', 'ప్రేమ' వంటి ప్రధాన వస్తువులను గుర్తించి, అవి కథలలో ఎలా వ్యక్తమయ్యాయో వివరిస్తారు.

**కథన విశ్లేషణ :** రచనలోని కథనం , పాత్రల నిర్మాణం, కథ నడిపిన విధానంపై దృష్టి పెట్టడం.

ఉదాహరణకు 'యజ్ఞం' కథలో కథను ఎవరి దృష్టికోణం నుండి చెప్పారు? కథనం ద్వారా రచయిత తన భావజాలాన్ని ఎలా పాఠకులకు చేరవేశారు? అని విశ్లేషించడం.

**శైలీ విశ్లేషణ :** రచయిత భాష, వాక్య నిర్మాణం, అలంకారాలు, పద ప్రయోగం వంటి శైలికి సంబంధించిన అంశాలను విశ్లేషించడం.

**సిద్ధాంత అన్వయం :** ఇది విశ్లేషణను ఒక ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే అత్యంత కీలకమైన పద్ధతి. ఈ విధానంలో, పరిశోధకుడు ఒక నిర్దిష్ట తాత్విక, సామాజిక, లేదా సాహిత్య సిద్ధాంతాన్ని (ఉ దాహరణకు: స్త్రీవాదం, మార్క్సిజం, మనోవిశ్లేషణ, బిసి వాదం

మొదలైనవి) ఒక 'కళ్లజోడు' లేదా 'చట్రం' లాగా ఉపయోగించి, దాని ద్వారా తన పరిశోధనా వస్తువును (రచనను) విశ్లేషిస్తారు. ఈ పద్ధతి కేవలం రచనలో **'ఏముంది?' అని చెప్పడమే కాకుండా, 'దాని లోతైన సామాజిక, రాజకీయ, లేదా మానసిక అర్థం ఏమిటి?'** అని వివరిస్తుంది. ఇది పరిశోధన విశ్లేషణకు ఒక నిర్దిష్టమైన దిశను, గాఢతను, పటిష్టతను అందిస్తుంది. పరిశోధకుడి పరిశోధనను విస్తృతమైన చర్చలతో అనుసంధానం చేయడానికి ఇది సహాయ పడుతుంది.

ఉదాహరణకు 'వృత్తి కథల'ను 'బి.సి.వాద' దృక్పథంతో విశ్లేషించడం. 'బి.సి.వాదం' సాహిత్యాన్ని కులం, శ్రమ దోపిడీ, వృత్తి గౌరవం, మరియు ఆత్మగౌరవం వంటి కోణాల నుండి విశ్లేషిస్తుంది. ఉదాహరణకు ఒక వృత్తి కథను బి.సి. వాద దృక్పథంతో విశ్లేషించేటప్పుడు, పరిశోధకుడు ఈ క్రింది కీలక అంశాలపై దృష్టి పెడతాడు:

**శ్రమకు గౌరవం :** కథలో బి.సి. కులాల వృత్తి నైపుణ్యాన్ని, కళను, జ్ఞానాన్ని ఎలా చిత్రించారు? ఆ వృత్తిని తక్కువగా చూసే భావజాలాన్ని కథ ప్రశ్నించిందా? శ్రమ యొక్క గొప్పతనాన్ని, సృజనాత్మకతను ఆవిష్కరించిందా? అనే అంశాలను పరిశీలించడం

**ఆర్థిక దోపిడీ :** వృత్తిదారులు తమ శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతున్నారా? వారి శ్రమను దళారీలు, పెత్తందారులు లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా దోపిడీ చేస్తుందో కథలో చూపారా? అనే అంశాలను విశ్లేషిస్తారు.

**సాంస్కృతిక అస్తిత్వం :** ఆయా వృత్తి కులాలకు సంబంధించిన ప్రత్యేకమైన భాష (మాండలికం), సంప్రదాయాలు, పండుగలు, పనిముట్ల పూజ వంటి సాంస్కృతిక అంశాలను కథలో ఎలా నమోదు చేశారు? వారి జీవన విధానాన్ని ప్రామాణికంగా, గౌరవప్రదంగా చిత్రించారా? లేదా అని చర్చిస్తారు.

**ఆత్మగౌరవ పోరాటం :** కథలోని పాత్రలు కుల వివక్షను, అవమానాలను ఎదుర్కొన్నాయా? వాటిని ఎదిరించి తమ ఆత్మగౌరవాన్ని, హక్కులను నిలబెట్టుకోవడానికి పోరాటం చేశాయా? ఆ పాత్రలలో చైతన్యం కనిపిస్తుందా? మొదలైన విషయాలను విశ్లేషించాలి.

**ఆధునికత ప్రభావం :** ప్రపంచీకరణ, యంత్రాలు రాకతో కుల వృత్తులు ఎలా దెబ్బతిన్నాయో కథ చిత్రించిందా? కేవలం కుల వృత్తిని నమ్ముకున్న వారి జీవితాలు ఎలా సంక్షోభంలో పడ్డాయో చూపించిందా? అని చర్చించవచ్చు. ఉదాహరణకు చేనేత కార్మికుల జీవితంపై వచ్చిన ఒక కథను విశ్లేషించడం.

సాధారణ విశ్లేషణలో ఇది ఒక పేద చేనేత కార్మికుని కుటుంబ కష్టాల కథ అని చెప్పవచ్చు. కానీ బి.సి. వాద దృక్పథంతో విశ్లేషణ చేస్తే, ఆ పరిశీలనలో, పరిశోధకుడు ఇంకా లోతుగా వెళ్లి, ఈ క్రింది అంశాలను పరిశీలిస్తాడు.




1. చేనేత పనిలోని కళానైపుణ్యం, తరతరాలుగా వస్తున్న ఆ వారసత్వ జ్ఞానం యొక్క గొప్పతనం.

2.నూలు వ్యాపారి చేతిలో కార్మికుడు ఎదుర్కొంటున్న ఆర్థిక దోపిడీ.

3. యంత్రమగ్గాలు రాకతో చేనేత వృత్తి నాశనమై, వారి జీవితాలు ఎలా చిన్నాభిన్నం అయ్యాయో చూపించడం.

4. 'చేనేత' అనేది కేవలం ఒక పని కాదు, అదొక సాంస్కృతిక అస్తిత్వం అని, ఆ వృత్తిని కాపాడుకోవడానికి వారు పడుతున్న ఆరాటాన్ని విశ్లేషించడం.

5. ఆ కార్మికుడు తన హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం గొంతు విప్పడాన్ని చైతన్యానికి ప్రతీకగా విశ్లేషించడం మొదలైన అంశాలు ఉండవచ్చు.

ఈ విధంగా, బి.సి. వాద సైద్ధాంతిక దృక్పథంతో ఒక రచనను సామాజిక, ఆర్థిక, రాజకీయ పొరలను విడదీసి, అణగారిన వర్గాల గొంతుకను, వారి పోరాటాన్ని విశ్లేషించడానికి ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ఇదే పద్ధతి మొత్తం పరిశోధన గ్రంథంలోని 'అధ్యాయాల'కు అన్వయం చేసే ప్రయత్నాన్ని పరిశోధకుడు చేయాలి. ఏదో ఒక సిద్ధాంతాన్ని అన్వయం చేయకుండా సిద్ధాంత గ్రంథంలోని అధ్యాయాలను పూర్తిచేస్తే అది అసమగ్ర పరిశోధనగానే పరిగణిస్తారు.

**5. ముగింపు అధ్యాయం:** ఇది పరిశోధనా గ్రంథంలో చివరి అధ్యాయంబీ ఇది శక్తివంతంగా గుర్తుండిపోయేలా ఉండాలి. ఇది కేవలం మునుపటి అధ్యాయాల సారాంశం కాదు. ముగింపు ఒక అధ్యాయమే అయినప్పటికీ ఇది అధ్యాయాల సంఖ్యలో పరిగణించరు.

**ముగింపులో ప్రధాన అంశాలు :**

**సిద్ధాంత ప్రతిపాదనను పునరుద్ఘాటించడం :** పరిశోధకుడి ప్రధాన వాదనను పాఠకుడికి గుర్తు చేయడం.

**సంశ్లేషణ, సారాంశం కాదు :** ప్రతి అధ్యాయం ఫలితాలను పునరావృతం చేయవద్దు. అన్ని అధ్యాయాల ఫలితాలు కలిసి పరిశోధన ప్రధాన వాదనకు ఎలా మద్దతు ఇస్తాయో తెలపాలి.

**జ్ఞానానికి సహకారం :** పరిశోధనకు అసలు సహకారాన్ని స్పష్టంగా పేర్కొనడం.

**పరిశోధన చిక్కులు :** పరిశోధన పని విస్తృత ప్రాముఖ్యతను చర్చించడం (విధాన రూపకల్పన, ఆచరణ, లేదా భవిష్యత్ పాండిత్యం కోసం).

**అధ్యయనం పరిమితులు :** (మరోసారి) నిజాయితీగా పరిశోధనలోని అధ్యయనం పరిమితులను అంగీకరించడం.

**భవిష్యత్ పరిశోధన కోసం మార్గాలు :** పరిశోధన నుండి ఉద్భవించిన కొత్త ప్రశ్నలను సూచించడం. ఒక శక్తివంతమైన, భవిష్యత్-దృష్టితో కూడిన తుది వాక్యంతో ముగించడం

**అధ్యాయ రచన – నైపుణ్యం : పునర్విమర్శ**

గొప్ప ఆలోచనలు ఉన్నప్పటికీ, వాటిని స్పష్టంగా వ్యక్తీకరించకపోతే ప్రయోజనం ఉండదు. అధ్యాయాలు స్తంభాలు అయితే, పేరాగ్రాఫ్‌లు ఇటుకలు.

**పేరా నిర్మాణం :** ప్రతి పేరా ఒక స్పష్టమైన ఆలోచనను అభివృద్ధి చేయాలి. ఒక బలమైన పేరాకు ఈ నిర్మాణం ఉంటుంది:

1. విషయ వాక్యం (Topic Sentence) : పేరా ప్రధాన అంశాన్ని పేర్కొంటుంది.

2. సాక్ష్యం(Evidence) : ఆ అంశానికి మద్దతుగా సమాచారం, ఉల్లేఖనం, లేదా వాస్తవాన్ని అందిస్తుంది.

3. విశ్లేషణ (Analysis) : సాక్ష్యం ప్రాముఖ్యతను వివరిస్తుంది.

4. ముగింపు/అనుసంధాన వాక్యం (Concluding/Linking Sentence) : అంశాన్ని ముగించి, తదుపరి పేరాకు మార్గం సుగమం చేస్తుంది.

**ముగింపు**

ఈ విశ్లేషణ ద్వారా, ఒక సిద్ధాంత గ్రంథం విజయం దాని అధ్యాయాల నిర్మాణ పటిష్టతపై వాటి మధ్య ఉన్న తార్కిక అనుసంధానంపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని చర్చించడం జరిగింది. పరిచయం, సాహిత్య సమీక్ష, పరిశోధన పద్ధతి, విశ్లేషణ, ముగింపు – ప్రతి అధ్యాయానికి ఒక నిర్దిష్ట ప్రయోజనం, ఒక ప్రత్యేకమైన నిర్మాణం ఉన్నాయి. పరిచయం ఒక రోడ్‌మ్యాప్‌ను అందిస్తే, సాహిత్య సమీక్ష పరిశోధన అంతరాన్ని గుర్తిస్తుంది. పరిశోధన పద్ధతి 'ఎలా' అనే ప్రశ్నకు జవాబిస్తే, విశ్లేషణ అధ్యాయాలు 'అయితే ఏమిటి?' అనే విశ్లేషణతో ప్రధాన వాదనను నిరూపిస్తాయి. చివరగా, ముగింపు అధ్యాయం కేవలం సారాంశం కాకుండా, మొత్తం పరిశోధనను సంశ్లేషణ చేసి, దాని సహకారాన్ని, ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది. ఈ ప్రక్రియలో, వివరణ నుండి విశ్లేషణకు మారడం అనేది ఒక పరిశోధకుడు చేయవలసిన అత్యంత కీలకమైన మేధోపరమైన ముందడుగు.

అయితే, ఈ వ్యాసానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఇది ఒక సాధారణ మార్గదర్శినిబీ అధ్యాయ నిర్మాణంలో విభిన్నమైన సంప్రదాయాలను కలిగి ఉండవచ్చు. భవిష్యత్ పరిశోధన ఈ నిర్మాణం నిర్దిష్ట అంశాలకు ఎలా అన్వయించవచ్చో అన్వేషించవచ్చు, లేదా బహుళ-విభాగ (Inter-disciplinary) సిద్ధాంత గ్రంథాలలో అధ్యాయాల నిర్మాణం ఎదుర్కొనే ప్రత్యేక సవాళ్లను పరిశీలించవచ్చు.

సిద్ధాంత గ్రంథ రచన అనేది ఒక సుదీర్ఘమైన, సవాలుతో కూడిన ప్రయాణం. కానీ, దానిని అధ్యాయాలు అనే నిర్వహించదగిన, తార్కికమైన భాగాలుగా విభజించినప్పుడు, ఆ ప్రయాణం సుగమం అవుతుంది. ప్రతి అధ్యాయాన్ని ఒక వాదనాత్మక స్తంభంగా నిర్మించడంపై దృష్టి సారించినప్పుడు, పరిశోధకులు కేవలం ఒక డిగ్రీని పూర్తి చేయడమే కాకుండా, తమ రంగానికి శాశ్వతమైన, విలువైన జ్ఞానాన్ని అందించే ఒక పటిష్టమైన మేధో నిర్మాణాన్ని సృష్టిస్తారు.

**ఉపయోగించుకున్న పుస్తకాలు**

**తెలుగు**

జయప్రకాష్, ఎస్. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1992.

సుబ్బాచారి, పులికొండ. పరిశోధన విధానం సిద్ధాంత గ్రంథ రచన. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం, 2014

సూర్యనారాయణమూర్తి, కాకునూరి. పరిశోధన. హైదరాబాద్: అక్కినపల్లి వెంకటరాంరెడ్డి, 2022.

**English**

Booth, Wayne C., Gregory G. Colomb, and Joseph M. Williams. *The Craft of Research*. 3rd ed. Chicago: University of Chicago Press, 2008.

Eco, Umberto. *How to Write a Thesis*. Translated by Caterina Mongiat Farina and Geoff Farina. Cambridge, MA: MIT Press, 2015.

Silvia, Paul J. *How to Write a Lot: A Practical Guide to Productive Academic Writing*. Washington, DC: American Psychological Association, 2007.

Turabian, Kate L. *A Student's Guide to Writing College Papers*. 4th ed. Chicago: University of Chicago Press, 2010.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025

# వరకవి సిద్ధప్ప సాహిత్యం – పూర్వ కవుల ప్రభావం

✍ **డా. రాపర్తి శ్రీనివాస్**, తెలుగు సహాయాచార్యులు, శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వ).
కరీంనగర్. ఫోన్ : 6300382718

**ఉపోద్ఘాతం**

**"జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరా:!**
**నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్!!"**

అనే సూక్తిలో చెప్పినట్లుగా గొప్ప గొప్ప కావ్యాలు రచించిన కవులు అలంకార, వస్తు ధ్వనులతో వర్ణనాత్మక కవితాశిల్పంతో సాహిత్య సృజన చేసి అజరామరమైన యశః కాయులుగా వెలుగొందుతున్నారు. ఇది ఒక పార్శ్వమైతే మరోవైపు ప్రజలతో మమేకమై వారిలోని మూఢత్వాన్ని, సాంఘిక దురాచారాలను రూపుమాపే రచనలు చేసిన ప్రజాకవులు కూడా యశఃకాయులుగా వెలుగొందుతున్నారు. అటువంటి వారిలో వరకవి సిద్ధప్ప ఒకరు.

**"సిరులకు నెలవైన సిద్ధిపేట్ జిల్లాను**
**గుండరెడ్డి పల్లె గొప్ప బిడ్డ**
**తత్త్వవేత్తయైన తాపసి సిద్ధప్ప**
**వరకవి బిరుదమున వాసి కెక్కె"**

ఈ పద్యంలో చెప్పబడిన సిద్ధప్ప వరకవి కుమ్మరి వారై కులవృత్తితో జీవనయానం సాగిస్తూ, ఆనాటి ప్రజల వాడుక భాషకు తన జ్ఞానం జోడించి జ్ఞానబోధ చేస్తూ మూఢ విశ్వాసాలను తులనాడుతూ రచనలు చేసిన జ్ఞాన గురువుగా ప్రజలలో నిలిచాడు. అలా జ్ఞాన వితరణ చేసే క్రమంలో సిద్ధప్ప పూర్వకవులచే ఏ విధంగా ప్రభావితుడయ్యాడో స్థూలంగా తెలపడం ఈ వ్యాస ఉద్దేశం.

వరకవి సిద్ధప్ప సంచార జీవనం సాగి స్తూ ప్రస్తుత జగిత్యాల జిల్లా ధర్మపురిని సందర్శించి కొన్ని రోజులు నివసించారు. ఆ క్రమంలో ధర్మపురి నరసింహుని స్తుతిస్తూ. శేషప్ప చెప్పిన నరసింహశతక పద్యాల ప్రభావం వరకవి పైన కనబడుతుంది. విగ్రహారాధనను నిరసిస్తూనే భగవంతుని అస్తిత్వాన్ని అంగీకరించే సిద్ధప్ప శేషప్ప పద్యాలను అనుసరించడం హర్షించదగినది.

**విషయ వివరణ :** వరకవి సిద్ధప్ప – శేషప్ప.

ప్రారంభ పద్యాలలోనే సిద్ధప్పపైన శేషప్ప పద్యాల ముద్ర ప్రస్ఫుటంగా కనబడుతుంది అని చెప్పడానికి ఈ పద్యమే తార్కాణం.

**పద్మలోచన సీస పద్యముల్ నీమీద**
**చెప్పబూనితి నయ్య చిత్తగింపు**
**గణయతి ప్రాస లక్షణము చూడగలేదు**
**పంచకావ్యశ్లోక పఠన లేదు**



**అమరకాండ త్రయం బరసి చూడగలేదు**
**శాస్త్రీయ గ్రంథముల్ చదువలేదు.**
**నీకటాక్షంబున నే రచించెదగాని**
**ప్రజ్ఞ నాయది కాదు ప్రస్తుతింప.**
**దపుగలిగిన సద్భక్తి తక్కువౌనె**
**చెఱకునకు వంకపోతేమి చెడునె తీపు**
**భూషణవికాస శ్రీ ధర్మపుర నివాస**
**దుష్ట సంహార నరసింహ దురితదూర**

ఈ పద్యమున శేషప్ప తనకు గణయతులు తెలియవని పంచకావ్యాలు తాను చదువలేదని, అమరకాండము పరిచయం లేదని, శాస్త్రాలు చూడలేదని కేవలం నరసింహస్వామి దయతోనే రచిస్తానని వినయపూర్వకంగా తెలిసాడు. దీనినే సిద్ధప్ప అనసరిస్తూ

**"నా బంధు ప్రియులార ఆత్మబంధువులార**
**వినరయ్య నే కవీశ్వరుడు గాను.**
**చదువలేదిక నాంధ్ర సంగ్రహంబుల లెస్స**
**కని చూడలేదప్పు కావ్యమైన**
**అనువుగా శ్రీకారమైన రాయగరాదు.**
**యే కారణము నాకు నెరుక లేదు.**
**నోట బల్కియు చేత నొనరంగ వ్రాసితి**
**చెలువొంద మీ పాద సేవకుడను.**
**గొప్పవాడను కాను కోవిదుడను గాను**
**తప్పులున్నను దిద్దుడీ తండ్రులార**
**వినుడి మాయప్ప శిద్దప్ప విహితుడప్ప**
**కనుడి కరమొప్పకవి కుప్ప కనకమప్ప"**

కవి ఈ పద్యమున తాను ఆంధ్రనామ సంగ్రహం చదువలేదని, అప్పకావ్యం చూడలేదని తన స్ఫురణకు వచ్చింది వ్రాస్తున్నానని

తాను గొప్పవాడిని, పండితుడిని కాదని తప్పులుంటే దిద్దమని వేడుకునట్లుగా పద్యరచన చేశాడు. శేషప్ప ఇంకోచోట మానవ జీవితం శాశ్వతం కాదని వివరించే క్రమంలో వ్రాసిన పద్యం –

**"పాంచ భౌతికము దుర్భలమైన కాయంబి**
**దెప్పుడో విడుచుట యెఱుక లేదు.**
**శత వర్షముల దాక మితము జెప్పిరి కాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో, మంచి ప్రాయ మందో లేక**
**ముదిమి యందో లేక ముసలియందో**
**యూరనో, యడవినో, యుదకమధ్యముననో**
**యెప్పుడో విడుచుట యేక్షణంబో**
**మరణమే నిశ్చయము బుద్ధిమంతుడైన**
**దేహమున్నంతలో మిమ్ముదెలియవలయు**
**భూషణ వికాస శ్రీ ధర్మపురనివాస**
**దుష్ట సంహార నరసింహ దురిత దూర"**

దీనిని అనుసరిస్తూ సిద్ధప్ప

**"కుమ్మరాతడు జేయు కుండలు నవి కొన్ని**
**చేయుచుండగ బోవు చేతిలోన**
**కొన్ని పానము మీద, కొన్ని చాటాన బోవు**
**కాల నావము కొన్ని కూలిపోవు**
**కొన్ని క్షేమము బొంది కొన్నాళ్ళకునుబోవు**
**కొన్ని యుర్విలో బోవు కొన్ని వనమున బోవు**
**కొన్ని మృతికిని బోవు కొరిపి నుండి**
**మానవులు మంటిపాత్ర మరియాద రీతి**
**ఐక్యమయ్యెదరు ఇట్లు అవని విడిచి**
**వినుడి మాయప్ప శిద్దప్ప విహితుడప్ప**
**కనుడి కరమొప్ప కవికుప్ప కనక మప్ప"**

శేషప్ప మానవ జీవితం అశాశ్వతమైనదని, మరణం ఏక్షణమైనా వస్తుందని తెలిపిన జీవిత సత్యాన్ని అనుసరిస్తూ సిద్ధప్ప కుండతో మానవ జీవితాన్ని పోలుస్తూ వివరించాడు. తన కులవృత్తి చేస్తున్న సమయాల్లో తాను తెలుసుకున్న విషయాలను మానవ జీవితానికి అన్వయిస్తూ కొన్ని కుండలు చేస్తుండగా ప్రారంభంలోనే చేతిలో పోతాయని, చక్రం మీద కొన్ని పోతాయని, పచ్చికుండలు సర్దే క్రమంలో విచ్ఛిన్నం అవుతాయని, కొన్ని కాల్చే సమయంలో ఆవముపై పోతాయని, కొన్ని పూర్తిగా తయారయి అంగట్లో పగులుతాయని, కొన్ని వినియోగదారులు కొన్న తర్వాత కొంత కాలానికి పగులుతాయని ఆ విధంగానే మట్టిపాత్ర లాగా మానవుడు కూడా నశిస్తున్నాడని వివరించారు.

**సిద్ధప్ప – వేమన**

ప్రజాకవి వేమన బాటలో నడుస్తూ, వేమన చెప్పినంత సూటిగా, నిర్మొహమాటంగా, జనుల నాడి తెలుసుకొని సిద్ధప్ప తన పద్యాల ద్వారా సమాజంలోని మూఢ విశ్వాసాలను ఖండించారు.

**"ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి**
**మూగ చింతపల్లె మొదటి ఇల్లు**
**అరసి బయలు చూడ ఆడనే శివుడుండు .**
**విశ్వదాభిరామ వినుర వేమ"**

అని వేమన తన నివాసం గూర్చి చెప్పుకున్నట్లుగానే సిద్ధప్పగారు కూడా తన గూర్చి పద్యాల్లో చెప్పుకున్నారు.

**"నైజాము రాష్ట్రము నధిపు నుస్మానలీ**
**పాదుషా గారి పట్టణము క్రింద**
**సూబే వరంగల్లు సొంపైన గ్రామంబు**
**జిల్ల కరీంనగరు చెలగి వినుడి**
**పరగణ శెనగర పరగ గుండ్రెడ్డిపల్లె**
**శాలి వాహన వంశ సమహితుడు**
**జనకుడు రాజయ్య జనని లక్ష్మమ్మకు**
**తనయుడు శిద్ధప్ప తగిన సుతుడు .**
**పాఠశాలయు సర్కారి పనులు గనుచు**
**పదియు నైదవ యీడున భావమలర**
**జ్ఞానులను గూడి సకలంబు గాంచి చూచి**
**వాణికృప చేత రచియించె వరకవిత్వ**
**వినుడి మా యప్ప శిద్దప్ప విహితుడప్ప**
**కనుడి కరమొప్ప కవి కుప్ప కనకమప్ప"**

ఈ పద్యంలో విశేషమేమనగా సిద్ధప్ప సీస పద్యాల్లో భావాన్ని చెప్పినప్పటికి కొన్నిసార్లు ఛందో నియమాలు విసర్జించాడు అని చెప్పడానికి ఈ పద్యంలోని గీతిలో ఆరుపాదాలు గమనింపవచ్చు. ఇక నిజాం రాష్ట్రంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాదుషాగా ఉన్న సమయంలో వరంగల్ సుబా, కరీంనగర్ జిల్లా, శనిగరం పరగణాలోని గుండారెడ్డిపల్లె తాను జన్మించానని శాలివాహన (కుమ్మరి) వంశమని, తండ్రి రాజయ్య, తల్లి లక్ష్మమ్మ అని వివరించారు.

ఇంకొక పద్యం

**"పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటె**
**దర్శనంబు లారు దైవంబు ఒకటే**
**విశ్వదాభిరామ వినుర వేమ"**

వేమన ఆరు దర్శనాలు, ఆరు మతాల శాఖలు ప్రస్తావిస్తూ మతం ఏదైనా భగవంతుడొక్కడేనని వివరించిన విధానం అనుసరిస్తూ

"బంగారమొక్కటి బహు నాణ్యములు వేరు
పరగ మట్టి పాత్రపనులు వేరు.
గగనంబు నొక్కటి గాలి తెప్పలు వేరు
జలము నొక్కటి చెట్ల సార మేరు
ఘట భావ మొక్కటి గన రూపములు వేరు
కలము నొక్కటి నరుల గుణమువేరు
పాలచవి యొక్కటి పశుల వన్నెలు వేరు
పరమాత్ముడొక్కడు భావములు వేరు.
మీ భూమి యొక్కటి ఆకాశ భువన మొకటి
నేను నీ వొకటి బ్రహ్మంబునిహము నొకటి
వినుడిమాయప్ప శిద్ధప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవి కుప్ప కనక మప్ప"

ఇలా చెప్తూ మూలధాతువు నుండి సమస్త వస్తువులు తయారవుతాయని మానవ కులం ఒక్కటేనని నరుల గుణములే వేరని ప్రపంచమంతా పరమాత్మ ఒక్కడేనని అతనిని చేరే భావములు వేరని తాత్త్విక దృష్టితో రచనలు కావించాడు సిద్ధప్ప.

ఉప సంహారం

ఇంకా విస్తర భీతి వలన స్పృశించట్లేదు కాని సిద్ధప్ప, సుమతీశతక కారుడు చెప్పిన కోపము, అనర్థాలను తన రచనలో వివరించాడు.

పోతులూరి వీరబ్రహ్మం గారిని అనుసరిస్తూ ఈ ప్రపంచంలో కుల మతాల అడ్డు గోడలు కూల్చివేయాలని **"యే కులంబని నను యెరుకతో నడిగేరు"** అనే సీస పద్యంలో కులవ్యవస్థను నిరసించాడు.

వీరబ్రహ్మం లాగా భవిష్యద్దర్శనం చేసి చార్మినార్ కూలుతుందని అంటే చార్మినార్ ప్రతీకగా నున్న ప్రభుత్వం అంతరిస్తుందని వివరించారు. అంతే గాకుండా తన మరణాన్ని ముందే తెలుసుకుని తన ఇంటి ఆవరణ యందే సమాధి స్థితిని పొందిన సిద్ధప్పకు ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు.

❖ ❖ ❖ ❖ ❖

# క్యాంపస్ కవిత్వం

**డా. ఎస్. రఘు**
ఫోన్ : 9848208533



పాఠం చెబుతుంటే
పుస్తకంలోంచి ఏదో రాలిపడింది!
ఏ కవి హృదయమో
వెతకాలి!

★★

ఆర్ట్స్ కాలేజ్ కారిడార్లో
ఆందోళనలో పిల్లి!
ఏదో ఇంక్రిమెంట్ ఎలుక
మిస్సయినట్టుగా తిరుగుతుంది!

★★

క్యాంపస్ విద్యార్థులు
సృజనోద్యమకారులు!
నాన్ బోర్డర్స్ కు
హాస్టల్ నిర్మించండంటూ నినాదాలు!

★★

అల్లరి విద్యార్థి
అటెన్షన్‌గా నిలబడ్డాడు!
అప్పుడర్థమైంది
అటెస్టేషన్ కోసం వచ్చాడని!

★★

ఏ విద్యార్థి సంఘమైనా కానీయ్
ప్రతీ నినాదం వెనుక
ఊరి దుఃఖం
వెంటాడుతుంది!

★★

ఆర్ట్స్ కాలేజీ
పావురాల తీర్మానం
పనిచేయని వారిని
రెట్టల శాలువాలతో సత్కరించాలని!

★★

అది ఇన్విజిలేషన్ గది!
విద్యార్థులంతా
తమ తలరాతల్ని
భయం భయంగా రాసుకుంటున్నారు.

★★

ల్యాండ్ స్కేప్ పార్క్ లోకి
ప్రేమికులు అడుగుపెట్టారు!
వీళ్లకు క్లాసుల్లేవాని
ఆకులు గుసగుసలాడుకుంటున్నాయి.

★★

ఆర్ట్స్ కాలేజ్ ఆవరణ
అప్పుడప్పుడు స్మశానమవుతుంది!
తగులబడేది దిష్టిబొమ్మైనా
బూడిదయ్యేవి
విద్యార్థుల కలలే!

★★

ISSN 2457-0796




## సత్సంగం



### అలజడి లేని జీవితం

అలజడి, అంటే ఒత్తిడి, నెరవేరని కోర్కెవల్ల గాని, కోర్కెల వల్ల గాని కలుగుతుంది. మనస్సు ఉండడం వల్ల మానవుడయ్యాడు. ఈ మనస్సన్నది ఎప్పుడూ ఏదో ఒకదాని వెంట పరిగెత్తుతూనే ఉంటుంది. దేనినైనా సాధించాలన్నప్పుడు మనమెంతో శ్రమ పడతాం. లక్ష్యాన్ని సిద్ధించుకోవడంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటాం. కోర్కె సిద్ధించదేమోనని భయపడతాం. ఆందోళన చెందుతాం. కోర్కెలు ఎక్కువైన కొద్దీ అలజడి కూడా ఎక్కువ అవుతుంది. కాబట్టి అలజడికి మూలకారణం కోర్కె. మనస్సున్నంత వరకూ కోర్కెలని గాని, అలజడిని గాని వారించలేం. ఏ రకమైన అలజడీ లేనివారు, అయితే పిచ్చివారు లేకపోతే ఋషులూ అయి ఉంటారు. వాళ్ళకి సామాన్యులకుండే మనస్సు ఉండదు కాబట్టి. సామాన్యులకి ఎంతో బలీయమైన అహంకారముంటుంది. వాళ్ళెప్పుడూ తమ సంపద గురించో, సంతతి గురించో, తాము సాధించిన వాటి గురించో మాట్లాడుతూనే ఉంటారు. ఇతరులతో తమ స్థితిని పోల్చుకొని ఈర్ష్య చెందుతారు. ఈర్ష్య అలజడిని కలిగిస్తుంది.

ఈ అలజడిని తగ్గించుకోవటానికి మనుష్యులు ఏమి చేస్తుంటారో గమనిద్దాం. సినిమాకి వెళ్ళి అక్కడ మైమరిచి పోతారు. లేదా బార్‌కి వెళ్ళి అక్కడ త్రాగుడులో మైమరిచి పోతారు. లేదా సంగీతం వింటూ మైమరచి పోతారు. ఈ సందర్భాలన్నింటిలోనూ మనిషి యొక్క అహంకారం తాత్కాలికంగా సమసిపోతుంది, మనిషి సంతుష్టుడవుతాడు. నిజానికి మనం నిద్ర పోయేటప్పుడు జరిగేదిదే. అందువల్లనే అందరికీ నిద్ర అంటే అంత ఇష్టం. గాఢనిద్రలో శరీరం గుర్తుండదు, సంపద గుర్తుండదు.. ఆఖరికి మన పేరు కూడా గుర్తుండదు. కలలేని గాడ నిద్రలో మనస్సే లేదు. కాని మేల్కొనగానే, "మంచినిద్ర పట్టింది, ఇప్పుడు హాయిగా ఉంది", అంటాడు మనిషి, అంటే అహంకారం ఏ మాత్రమూ లేనప్పుడు అంతటి ఆనందముంటుందన్న మాట.

ఎవరినైనా ప్రేమించినప్పుడు కూడ ఏ అరమరికలూ లేకుండా ఇంకొకరికి అర్పితమవుతాం. అట్లా అర్పితమవటంలో ఎంతో ఆనందముంది.

వాంఛలని తీర్చుకోవటంలో గాని, పెంచుకోవటంలో గాని ఆనందం లేదు. ప్రతివాంఛా అలజడికి కారణమే అవుతుంది. ఇతరుల సంతోషంలో పాలుపంచుకొని ఆనందించవచ్చు. ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయ పడినప్పుడు కలిగే సంతృప్తి మన కోర్కెలను తీర్చుకొన్నప్పుడు కలిగే దానికంటే ఎక్కువగా ఉంటుంది. క్రైస్తవ సూక్తి, 'నీ పొరుగు వాడిని ప్రేమించడం తేలికే, కాని పొరుగువానిలోని లోపాలను ఎప్పుడూ చూస్తూ వానినే ప్రేమించటం కష్టం. అతనిని ప్రేమించటమంటే నీ దురభిప్రాయాలను ప్రక్కకు పెట్టి అతనిని అతనుగానే ప్రేమించటమన్నమాట. వాస్తవాన్ని అంగీకరించలేకపోవటం ఎంతో అలజడికి దారితీస్తుంది. ఎట్లాగున్న వారిని అట్లాగే మనస్ఫూర్తిగా, ఏ ఆర్భాటమూ లేకుండా ప్రేమించగలగాలి.

నిజమైన ప్రేమ సదవగాహనని కలిగిస్తుంది. వాస్తవాన్ని అంగీకరించడం వల్ల అలజడి పోతుంది.

అన్ని మతాలూ అహంభావ రహితంగా ఉండటానికి పద్ధతులు చెప్తాయి. అహంకారయుతంగా ఉండటం గురించి కాదు! మనస్సులో ఆలోచనలు ఎక్కువైన కొద్దీ శక్తి తగ్గిపోతుంది. పూజ, జపం వంటివి ఏకాగ్రతను పెంచుకోవటానికి సాధనాలు. అవి సాధనాలే కాని సాధ్యాలు కావు. ఈ విషయం మరచి పోకూడదు. అసలు లక్ష్యం ప్రశాంతత, నిశ్చలత, ప్రతి మతంలోనూ కొన్ని కర్మలు నిర్దేశింపబడి ఉన్నాయి. ప్రారంభదశలో అవి అవసరమే. ఒక వృక్షం ఎదిగినట్టే యిదీను. ముందర విత్తుని నాటుతాం. అది మొలకలెత్తుతుంది. అది చిన్న మొక్కగా ఉన్నప్పుడు గొడ్లు తినివేయకుండా దాని చుట్టూ కంచె వేస్తాం. అది పెద్ద చెట్టయిన తర్వాత దానికి ఒక ఏనుగుని కూడా కట్టవచ్చు. మన మానసిక, ఆధ్యాత్మిక ప్రగతి విషయంలోనూ ఇంతే. ప్రారంభదశలో మతాచారాలు కంచె వంటివి. ఆధ్యాత్మిక పురోగతి కలిగిం తర్వాత ఆ కంచెని తీసివేయవచ్చు.

కర్మయోగం వల్ల ఆనందం కల్గుతుందని గీత చెప్తుంది. "నీ ధర్మాన్ని నీవు నైపుణ్యంతో నిర్వహించు, ఫలితం గురించి పట్టించుకోక. ఒక్కోసారి కృతార్థుడవవుతావు. ఒక్కోసారి కావు. నీ కర్మ ఫలితాలు నీ ఆధీనంలో లేవు". ఈ విధంగా పనిచేస్తే చాలావరకు అలజడి లేకంఉడా ఉంటావు. చేసిన పని సఫలం కాదన్న భయమే అలజడికి కారణం. విఫలమవుతుందన్న భయం లేకుండా పని చేసినప్పుడు ఎంతో ఏకాగ్రత కలుగుతుంది. ఈ తత్త్వమే నాయకులను ఉత్తేజ పరిచింది. నిలిపింది. "కార్యాచరణలో నైపుణ్యమే యోగమంటే"నన్నాడు శ్రీకృష్ణుడు. ఏ పనినైనా బాగా చేసినవానికదే గొప్ప సంతృప్తి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025

ఆధ్యాత్మిక తత్త్వ దర్శిని శ్రీ వేంకటాచార్యులు గారి

# "భక్తి జ్ఞాన సాధనం శ్రీ రాజయోగానంద భజన మాల"

సుప్పని సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు ఫోన్ : 9492626910

మనిషిని సన్మార్గంలో నడిపించడానికి భక్తి సాధనవే పరమోన్నతమైన సాధనం. అందులో నవవిధ భక్తి తత్త్వాలను ప్రహ్లాదుడు హిరణ్యాక్షునికి బోధ చేసిన విధానం సుపరిచితమైన విషయమే. వాటన్నింటిలో సంకీర్తన మే సిసలైన భక్తి సాధనమని, యోగమని విజ్ఞుల యొక్క అభిప్రాయం. అలాంటి సంకీర్తనల వెల్లువ ఈ తెలుగు నేలలో గంగా ప్రవాహంలో నాటి నుండి ఇంకా నేటికీ కొనసాగుతూనే ఉంది అంటే అది అతిశయోక్తి కానేరదు. ముఖ్యంగా తాత్త్విక సాహిత్య చరిత్రకు ప్రధాన భూమికగా ఈ తెలంగాణ నేల ఎప్పుడో పేరు గడించింది. ఒక **"ఈగ బుచ్చి దాసు, ఒక రాకమచర్ల వెంకటదాసు, ఒక పనస హనుమద్దాసు, పెద్దిరాం పోచన్న పంతులు, గడిగే భీమకవి, చెర్విరాల భాగయ్య,"** వంటి అగ్రేసర సంకీర్తనకారుల (రచయితలు) సరసన నిలువ తగిన మహనీయులు శ్రీ మయబ్రహ్మ వెంకటాచార్యులు. వీరిది పూర్వపు నిజామాబాద్ జిల్లా (ప్రస్తుతం కామారెడ్డి), కామారెడ్డి తాలూకా, ఫరీదు పేట వీరి స్వగ్రామం.

మయబ్రహ్మ నరసమ్మ, రాజయ్య దంపతులకు 1915లో జన్మించిన శ్రీ వెంకటాచార్యులు తనకున్న జిజ్ఞాసతో ఆధ్యాత్మిక, దైవ చింతనతో, సాహిత్యం పట్ల మక్కువతో భజన, భాగవతం, యక్షగానం వంటి కలలకు గురుసమానులైన యాదయ్య గారి ద్వారా ఎంతో నేర్చుకున్నారు. ఒకపక్క కులవృత్తి వడ్రంగి పనిని చేస్తూనే అటు కవిత్వం ఇటు సాహిత్యం రెండింటిని సమపాళ్ళుగా ముందుకు తీసుకువెళ్లారు.

రచయిత వెంకటాచార్యులు వారి నిజ జీవితంలో అనుభవమైన సంఘటనలకు అక్షర రూపాన్ని కల్పించి చేసిన రచనయే ఈ **"రాజయోగానంద భజన మాల"** గ్రంథం. పేరులోనే ఉంది రచయిత ఇందులో చెప్పదలుచుకున్న విషయం అంతా. శ్రీమాన్ వేల్పూరు లక్ష్మణాచార్యులు పరిష్కర్తగా ఈ గ్రంథం సంకీర్తనాపరులు అందరికీ సుపరిచితం. ఈ గ్రంథం 1978 లో తొలిముద్రణ జరిగింది. రచయిత జన్మస్థలమైన ఫరీద్‌పేట పురాంకితంగా సాగిన భజన సంకీర్తనలు నాటి నుండి వేనోళ్ల కీర్తించబడుతున్నాయంటే అది గొప్ప విషయం.

ఈ రచనకు 21-5-1978న సుప్రసిద్ధ సాహితివేత్త, అభినవ బోధన బిరుదాంకితులు "శ్రీమాన్ డాక్టర్ వానమామలై వరదాచార్యుల వారు" "అభినందన"శీర్షికన పీఠికను అందించారంటే, ఈ సంకీర్తనలలో గల మాధుర్యం ఎటువంటిదో మరో మారు చెప్పనక్కర్లేదు, ఈ గ్రంథం ఆరంభంలో ..




కం॥ శ్రీమన్నామ పయోధ - శ్యామ ధరాబృల్లలామ! జగదభిరామా! - రామా! జనకామ! మహెూ - ద్ధామా! గుణస్తోమ! రామ! దశరథ రామా!! అనే శ్రీరామ స్తుతిచే మొదలై, గురు స్తుతులు, జననీ జనకుల స్తుతి, ఇష్ట దేవతా స్తుతి, అలాగే...

దర్వు॥ శ్రీ శివ ప్రియనందన - శ్రీ గణేశ గజవదనా! - దాసకోటి పోషక! - నిను దలచితిని ముందునా! అనే శ్రీ గణేశ స్తుతి, మరియు శారదాంబ స్తుతి, అటు పిమ్మట ఇష్ట దేవతాస్తుతిని చేసి వారి భక్తి ప్రపత్తులతో పాటు రచనా పద్ధతిని మొదలుపెట్టారు.

"కామి కాని వాడు మోక్షగామి కాడు" అనే వేమన నాదం ఈ రచనలు ప్రస్ఫుటం అవుతుంది. ఎందుకంటే రాజయోగానందం అంటేనే సంసారిక, ప్రాపంచిక జీవనం అనే అర్థం ఉంది. సన్యాసంతో మోక్షాన్ని పొందడం అనే విషయం పక్కన పెడుతూ, రాజయోగాన్ని అనుభవిస్తూ మోక్ష ప్రాప్తి కొరకు నిరంతరం సాధన చేయడం అని సందేశం ఈ రచనలోని ప్రతి సంకీర్తనంలో గోచరిస్తుంది.

"శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ... అనే శ్లోకంతో నన్నయ భారత ఆంధ్రీకరణ చేసినట్టుగా, రచయిత ఈ రచన ఆరంభంలో ముగ్గురు అమ్మలను స్తుతిస్తూ "శారదాంబ స్తుతి, గిరిజా స్తుతి, లక్ష్మీ స్తుతి" కీర్తనలను కూడా చూడవచ్చు. అలాగే నంద నందనుని (శ్రీకృష్ణుని) స్తుతి చేస్తూ, ప్రారంభంలో వారు చేసిన పద్య స్తుతి, పద్య సాహిత్యం పైన వారికి ఉన్న పట్టుకు ప్రభల సాక్ష్యం.

**జలనిధి కన్యకా ఘనకుభస్థల పచ్చల తాళి గోపికా**
**విలసితహార నీలమణి విశ్వజగద్వలయప్రకాశికో**
**జ్వల మహనీయ రత్నమణి వారితకోశితు భోగిభోగ మం**
**డల గిరి వజ్రమై వెలయు నందతనూజు భజింతు నామదిన్!!**

దర్వు॥ నందతనయ! గోవిందా! హరి – నారాయణ ముకుందా! – బృందారక మునివందిత చరణాయర – విందములకు నే వందనమంటిని!! నందతనయ!! ఇలా శ్రీకృష్ణ పరమాత్మ స్తుతిని లలిత లలితమైన పదాలతో సుమనోహరంగా వర్ణించిన విధానం, రసహృదయులను ఆనంద డోలికలలో ఓలలాడింపజేస్తుంది.

రచయిత ఈ రచనలో పాటించిన ఒక చక్కని పద్ధతి ఏమిటంటే ప్రతి సంకీర్తనకు మొదట పద్యం, తరువాత కీర్తనం, అటుపిమట భజన అనగా వేగవంతమైన తాళ్ల ధ్వనితో చేసే స్తుతి. ఈ పద్ధతిని తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సంకీర్తనకారులలో కొందరు మాత్రమే పాటించారు. మిగతావారు కేవలం కీర్తనలను మాత్రమే రచించారు. ఒకరకంగా ఇది త్రికరణశుద్ధికి తార్కాణం.

మచ్చుకు: భజన: కృష్ణానంద ముకుంద మురారి – వామన మాధవ గోవిందా! శ్రీధర కేశవ రాఘవ విష్ణో – లక్ష్మీ నాయక నరసింహ!! శ్రీమద్ భాగవత కృతికర్త పోతన, ప్రహ్లాద ఘట్టంలో భక్తుడైన ప్రహ్లాదుని నోట "మధువైరి దవిలిన మనము మనము!!" అన్న పద్య పాదం స్ఫురించే విధంగా, రచయిత ఒకచోట ఇలా స్తుతిస్తారు, దరువు: నారాయణుని నమ్మిభజించని – నరజన్మంబే వ్యర్థమురా! – ఘోరమైన సంసారం లోపల – ధీరుడననుచును మురువకురా!! నారాయణుని!! అనే సంకీర్తనమును వెంటే శ్రీహరి చింతనమును ఎట్టి పరిస్థితులలోనూ మరువకూడదు. సంసార సాగర ప్రవాహంలో కొట్టుకుపోకుండా హరిచింతన చేయడమే మోక్ష మార్గానికి సరియైన పద్ధతి అని ప్రకటిస్తారు రచయిత.

ఈ సంకీర్తనలలో ప్రధానంగా భక్తి, జ్ఞాన, తత్వాలతో పాటు, హరిహరనాథ తత్వం కూడా బోధపడుతుంది. శివకేశవులు ఎప్పుడూ వేరు కాదు. ఇరువురి స్తుతి భక్తి ప్రపత్తికి సంకేతం అనే సత్యాన్ని ఎలుగెత్తి చాటుతూ మరోచోట శివ స్తుతిని కూడా చేస్తూ రచయిత ఇలా అంటారు…,

మత పద్ధతి గురించి వివరిస్తూ… దరువు: శివ శంభో ఓం హరాయటా – శైవ మతస్తుల ధ్యానమటా! శివ పదంబులో చిత్తము నిలిపిన – సిద్ధమూర్తులకు నమో నమో…!! శివ శంభో!! అని కీర్తనలో వైష్ణవ, శైవ సంప్రదాయమే కాక, అచల పరిపూర్ణ భోధ విధానం, బుద్ధ భగవానుని స్తుతి, భగవద్గీత స్తుతి, ఇస్లామిక్ సంప్రదాయం తో పాటు" సర్వ మతంలో ఒకటంటా – సారము గ్రోలికి నిజమంటా = ఫరీద్ పేట వెంకటదాసుని – గుర్తుల కొరకీ పేరుల బెట్టిరి.. ॥శివ శంభో॥ అంటూ సర్వ మతాల సారాంశం మానవ జీవన కళ్యాణం కొరకేనని తెలియజేస్తూ అన్ని మతాల పట్ల వారికి ఉన్న ఆధారాభిమానాలను చాటుకున్నారు రచయిత. మరోచోట ప్రభోదాత్మకమైన సంకీర్తనను అందజేస్తూ…. దరువు: లేవరా! బాబు లేవరా! యా – దేవదేవుని భజన జేతము॥ లేవరా ॥

ఈ తత్వగీతంలోని అంతరార్థాన్ని గమనిస్తే ద్విగుణీకృతం గా గోచరిస్తుంది. నిద్రపోతున్న జాతిని జాగ్రత్తగా పరిచే విధంగా చూపే భావంతో పాటు జాతిని అప్రమత్తంగా ఉండే విధంగా చెప్పే కర్తవ్యం మరోవైపు కనిపిస్తుంది. అంటే ఈసురోమని, సోమరితనం పనికిరాదని చెప్పడమే ప్రధాన ఉద్దేశం.

లోకంలో భక్తులను నిందించే వర్గాలు చాలా ఉన్నాయి. వారు చేయరు, మరొకరిని చేయనివ్వరు. అదేవిధంగా భక్త బృందాన్ని నిందించడం మహా పాపమనే సత్యాన్ని చెబుతూ రచించిన ఈ కీర్తనలు చూస్తే.

**"దరువు: భక్తుల నిందించకురో రన్నా ! పెద్దన్నా! – బహు పాపములో బడిపోకుమురో రన్నా! పెద్దన్నా! –**

**భక్తులంటే ఏమనుకున్నావు? – భగవంతునికి చిన్న కుమారులు – యుక్తాయుక్తము లెంచక గోరు – యువకుడు దాని లేగనుముట్టా…!!"** అంటూ భక్తులను నిందించడం పరమ పాపమని తెలియజేయడమే గాక, ఇతిహాస ఘట్టాలను కూడా స్పృశిస్తూ ఇందులో, భక్తాగ్రేసరులుగా పిలువబడిన మార్కండేయుడు, ప్రహ్లాదుడు వారి భక్తి వైభవాన్ని, జ్ఞాన తత్పరతను కూడా తెలియజేస్తూ, యుక్తాయుక్త విచక్షణ లేకుండా ప్రవర్తించడం తగదని చెప్పాడు. భారత రామాయణాలను కూడా ఉదహరించడం అనేది ఈ కీర్తనలలో.

రచయిత పాండితీ ప్రదర్శన ఏ విధంగా పొగిడిన తక్కువే. ఈ సంకీర్తన గ్రంథాన్ని ఆశాంతం చదవడం వల్ల కేవలం వెంకటాచార్యులే కాక పూర్వకవీంద్రులు ఎందరో దర్శనమిస్తారు. అందులో పోతన, ధూర్జటి, వేమన, మిగతా శతక కవులు ఎందరో అడుగడుగునా తారసపడతారు. అంటే నాటి కవీంద్రుల ప్రభావం రచయితపైన పెక్కురుగా ఉంది అనడానికి ప్రభల సాక్షాలు.

ఇలా.. రచయిత తన నిజజీవన అనుభవంలో యాదయ్య పంతులు గారి వద్ద చేసిన శిష్యరికం, అటు కులవృత్తి వడ్రంగి పని చేస్తూ, నేర్చుకున్న స్వానుభవ పూర్వకమైన పాండితి గరిమ వల్ల, తదనంతర కాలంలో 89 పద్య సంకీర్తనలతో కూడిన శ్రీ రాజయోగానంద భజన మాల వెలువరించడానికి కారణమైనయి అని చెప్పక తప్పదు. అటు ఆధ్యాత్మిక ప్రబోధానికి, ఇటు వైరాగ్య భావజాలానికి ప్రధాన భూమిక వహించిన ఈ సంకీర్తన గ్రంథం **"తెలుగు భజన సంకీర్తన సాహిత్యంలో ఒక కలికితురాయి"** అని చెప్పవచ్చు.



# స్థల దు:ఖం జన దు:ఖం ఈ కవి చిరునామా

**డా. బెల్లి యాదయ్య,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు. సాహితీ విమర్శకులు. ఫోన్ : 98483 92690

I only write when I'm angry or sad Fiona Apple McAfee All poetry is in origin of social act, in which poet and people commune" -- George Thomso

"The poem as a site of social interaction in which dialogue and contention is never ending"
-- E.Martin Nolan

నేను ఆగ్రహంలో విషాదంలో మాత్రమే రాస్తానంటోంది కవయిత్రి **ఫియోనా యాపిల్ మెకెఫీ.** ఇట్లా రాసేది ఈమె ఒక్కర్తేనా, అంటే? కాదు, వ్యవస్థ మార్పు కోరుతూ రాసే ప్రతి కవి, రచయిత ఆగ్రహావేశాల్లోంచి బాధా కన్నీళ్లలోంచే రాస్తాడు. ఇందుకు కారణం ఏమై ఉంటుంది? అంటే – విషాదం అలుముకున్న చోటుకు దాపున్నే సృజనాత్మకత ఉంటుంది. ఎందుకంటే, మనిషి సంతోషంగా ఉన్నప్పుడు, ఆహ్లాదంగా ఉన్నప్పుడు ఆత్మపరిశీలన చేసుకోలేడు, ఉల్లాస స్థితి నుండి లోతైన ఆలోచన ఉత్పన్నం కాదు. భావాల విశ్లేషణా కుదరదు, ఓరిమికీ పునరాలోచనకూ ఆస్కారం ఉండదు. అయితే, సంతోషంగా ఉన్న సమయం గొప్ప సమయం కాదా! అంటే, గొప్ప సమయమే. కాకపోతే, అది సృజనాత్మక సమయం (Creative Time) కాదు. సంతోషం సమయంలో కంటే, విచారం (melancholy) సమయంలో మనిషి 'భావోద్వేగాలు తీవ్రతరం (Higher degree of emotions) గా ఉంటాయి. ఈ తీవ్రతర భావోద్వేగాలు అప్పటి సంఘర్షణను కూలంకషంగా అర్థం చేసుకోవడానికి మంచి ఉపకరణాలు. ఇక్కడే సృజనకు అంకురార్పణ జరుగుతుంది. సృజన మూలాన ఎంతటి సంఘర్షణ నుండైనా మనుషులు తక్షణ ఉపశమనం పొందగలుగుతారు. ఈ ఉపశమనం వైయక్తికం మాత్రమే కాదు. సంఘర్షణ సామాజిక మైనప్పుడు సృజనా తదుపశమనమూ సామాజికం. వేదనకూ సంఘర్షణలకూ పరిష్కారం విముక్తి లభిస్తుంది. ఇదిగో ఈ విముక్తి కవితల సమాహారమే 'మొలాటు' సంపుటి. కూకట్ల తిరుపతి సామాజిక సృజనకారుడు, ఇవాల్టి Zeitgeistను తన 'మానేరు నుడికారం'లో ప్రపంచానికి చాటింపు వేస్తున్న భాషా నవోద్యమకారుడు.

మొలాటు అంటే విత్తనం వేసిన తర్వాత మొలకెత్తుతున్న క్షేత్రం. మా దిక్కు మేం 'మొలవాటు' అంటం. ఏ పంటకైనా మొలవాటును బట్టే ఉనికి ఉత్పత్తి ఉంటాయి. అయితే మొలవాటును కాపాడితేనే మొక్కలు ఏపుగా ఎదిగి చేనుగా ఫలితాన్నిస్తాయి. మొలవాటు దశ సున్నితమైంది, జల్లులు లేకపోయినా కలుపు తీయకపోయినా మొలవాటు పుటమారుతుంది. రైతు కృషిని ఫలించాల్సిన చేను ఉత్త ఏగిలై కష్టమూ కరవూ నోరుతెరచుకుంటాయి. అందుకే కూకట్ల తిరుపతి తన కవితాసేద్యాన్ని మొలాటుగా మనకు సమర్పిస్తున్నాడు. కవితలు అందించే సందేశాన్ని పెంపుచేసి రాశిపోయాల్సిన అవసరాన్ని సాటిమనుషులుగా మనమే గుర్తించాల్సివుంది. అంటే,మనందరం సామాజికంగా పరివర్తన చెందాల్సి ఉంది. బతుకు ప్రతి మలుపులో సంఘటితం కావాల్సి వుంది. మనం పరివర్తన చెందేందుకు, సంఘటితమయ్యేందుకు కావాల్సిన Transformational Forceని తిరుపతి ఈ కవితల నిండా దట్టించి ఉంచాడు. అభివ్యక్తి నైపుణి లోపంవల్ల కవిత్వంలో స్థానీయ భాష కొన్నిసార్లు పాఠకుణ్ని కదిలించగపోగా కలవరపరుస్తుంది. అయితే, నుడికారపు సొంపు తెలిసిన శిల్పం అమరితే స్థానీయ భాషలో కవిత్వం దాని Transformational Force వల్ల అమేయం (Immeasurable)గా సామాన్యులనూ కలుపుకుంటుంది. సామాన్యులను కలుపుకుంటేనే కదా! కళకు సార్థకత. జార్జ్ థామ్సన్ చెప్పినట్టు 'కవిత్వం సామాజిక చర్య'గా ముందుకొచ్చినప్పుడే సామాన్యుల భారీ చేరిక (Massive Inclusion)సాధ్యం. అప్పుడే మహాజన సంఘటన సంభవిస్తుంది. కళాసాహిత్య రంగాల్లో సబాల్టర్న్ ఉద్యమం మరింత పటిష్ఠంగా నిర్మాణమయ్యేది మహాజన సంఘటనతోనే. కూకట్ల తిరుపతి మొలాటు లక్ష్యం మహాజన సంఘటనే.

ఏ సమాజానికైనా తనదైన ఒక నాగరికతా ప్రక్రియ (Civilizing Process) ఉంటుంది. దీనికి నార్బర్ట్ ఎలియస్ చెప్పినట్టు మానసిక, రాజకీయ (Mental, Political) కోణాలుంటాయి. ఈ రెండు కోణాల్లో స్వచ్ఛత పరిపూర్ణత ఇమడాల్సిందిపోయి, నానాటికీ పేరుకుపోతున్న హీనత (Inferiority)' 'క్షుద్రత (Occult)' లను తునుమాడేందుకు సిద్ధపడినవాడే కవి. మార్టిన్ నోలన్ బహిర్గత పరచినట్టు కవిత్వం సమాజంతో సంవాదమే కాదు, ఎడతెగని వివాదం కూడా. కవిగా కూకట్ల తిరుపతి మునుపటి వలెనే ఈ మొలాటు కవితల్లోనూ సంవాద వివాదాలను విధిగా కొనసాగిస్తున్నాడు. తననూ తన వెన్నుచూపనితనాన్ని –

**"మేలుకొలిపే కలం కాలుచేతులు నరికినా**
**ఉరితాడై ప్రాణాలను పెరికినా**
**గురితప్పని ఆయుధమవుతూ**
**కదులుతున్న కాలానికి దర్పణంగా**
**సదృశ్యమాన సాక్ష్యంగా నిలుస్తుంది" (కాలానికి కళ్లుంటాయి)**

అంటూ కాలం కంటికి వెలుగులను జతచేస్తున్నాడు.

ప్రపంచానికి కళలు కవిత్వంతోగల బాంధవ్యాన్ని, సృజనోద్దేశాన్ని గురించి "One of the chief motives of artistic creation is certainly the need of feeling that we are essential in relationship to the world" అంటాడు సార్త్రే. మొలాటు కవితలన్నీ సార్త్రే వ్యాఖ్యను అణువణువూ ప్రతిబింబిస్తాయి.

**"రచించడమంటే**
**వస్తువులను స్వీకరించడం**
**అభివ్యక్తితో శిల్పాన్ని చెక్కడమే కాదు**
**సుప్తచేతనకు చురకలువెట్టి**
**చేతనావర్తంలోకి లోకాన్ని మలుపుకోవడం"**

(అక్షరాల పోత) అంటూ కవిత్వ గుణగణాలనూ కవి బాధ్యతనూ సాహితీలోకం ముందుంచుతున్నాడు. భాష,పనిముట్ల వినియోగం మనిషిని ఈ సృష్టిలో ఇతర జంతుజాలం నుండి ప్రత్యేకం చేస్తున్న విషయాలు. వృత్తిదారుడికైతే పనిముట్లే పనిముట్లు. కవికి భాషే పనిముట్టు. 'అల్లిక (Texture), రూపం (Structure), స్వయం (Tone), శబ్ద ప్రవాహం (Rhythm) దోషరహితంగా ఉన్నప్పుడే కవిత్వం నిలబడుతుంది అంటాడు డగ్లస్ బుష్. గ్లోబలైజేషన్ పెద్ద దేశాలకు అదనపు లాభాలను కుప్పబోస్తూ గ్రామీణ భారతదేశాన్ని కుదేలు (Collapse) చేసిన వైనాన్ని -

**"ప్రపంచీకరణ ప్రయోగశాలగ**
**పల్లెల బత్కుముల్లెలు గంపగుత్తగ**
**కుదువబడ్డ దోప్కపు జాడల**
**బొండిగెలకు చెయ్యిసొరగొట్టి**
**బోరిగనంత కలెవెట్టిన కనరు**
**బొంతపేగుల మనసు కత్తిరిచ్చి**
**గుట్టగుడ్డలు వూడగొట్టుకుంట**
**మెత్తగ మెలేసిన పెట్టుబడుల నెనరు**
**కాళ్లకింద జాగ సుతా**
**కండ్ల ముంగట కదిలిపోతున్న గావర"** ( బువ్వ చెట్టు కూలింది)

అంటూ దేశీయ కవితా శిల్పనైపుణితో అభిశంసించాడు.

బెర్ట్రాండ్ రస్సెల్ పండితుడు ఆత్మకథకు రాసుకున్న ముందుమాట 'What I Have Lived For' లో తనకున్న 'Three Passions (మూడు అభిరుచులు - ప్రేమ కోసం తపన, జ్ఞానం కోసం అన్వేషణ, మానవాళి బాధల పట్ల భరించలేని జాలి)ను ప్రస్తావిస్తూ '**ప్రేమ, జ్ఞానం నన్ను స్వర్గం వైపుకు నడిపించాయి. కానీ,వెంటనే జాలి నన్ను తిరిగి భూమికి తీసుకువచ్చింది- బాధితుల ఏడుపులు హాహాకారాలు నా హృదయంలో ప్రతిధ్వనించాయి. ఆకలితో అల్లాడే పిల్లలు, యుద్ధోన్మాదులచే హింసించబడుతున్న బాధితులు, అనాథ వృద్ధులు, కూలీలు, కరవు, పేదరికంలో మగ్గి సమస్త భూమండలం పై రోదించే ప్రతిఒక్కరి జీవితం అపహాస్యం చేయబడుతోంది. నేను ఈ చెడును, దుస్థితిని తగ్గించాలని కోరుకుంటున్నాను, కానీ నేను నిస్సహాయుడిని, బాధపడుతున్నాను'** అంటాడు. మొదటి అభిరుచిని మైనస్ చేస్తే ఆధునిక తెలుగు కవులంతా రస్సెల్ వారసులే. తిరుపతిదీ రస్సెల్ వేదనా మార్గమే అనడానికి ఇదిగో మచ్చుకు-

**"బూంబుట్టిన నాటికెల్లి**
**సకల జీవరాసికి కలిజల్లిన తావుల్ల**
**పచ్చనోట్లుగ పాయదీసుకుంట**
**ఇనుప ముక్కుకొంగలు తొక్కిన రేవులు**
**మొండాలైన మానులు**
**మొకం వాల్చిన మబ్బులు**
**రోగపు రొంపిల వొర్రెలు**
**జల్లెడ తూట్లువడ్డ న్యాల పెయ్యి**
**పీన్గుల పెంటయిన పసురాలు**
**మందెలుగ రాలిపడ్డ పిట్టలు**
**పట్టన పాతాళ్లం ముట్టిన యాల్ల**
**తపేల బోర్లేసిన బతుకుల తండ్లాట**
**నిత్తెం నిలువు దోప్కం**
**బొత్తిగ బావురుమన్నట్టు**
**బోసిపోయిన పుడమితల్లి రూపం"** ( నిలువు దోప్కం).

**"ఇక్కడి మట్టిదీ ఇక్కడి చెట్టుదీ ఇక్కడి గుట్టదీ పావురమసొంటి గుణమదీ"** అంటూ 'ఆత్మగల్ల మట్టి'ని సదా స్మరిస్తూ,ఈ మట్టికోసం మరణించిన కొమురయ్యనూ కొమురం భీం నూ తలుస్తూ తల్లి తెలంగాణను అగ్నిగీతాల రుద్రవీణగా వర్ణిస్తున్న కూకట్ల తిరుపతిది స్థల దుఃఖం, జల దుఃఖం, జన దుఃఖం. **'ఆరుద్ర పురుగు, ఎర్రగాలు, నల్లాలం పూలు'** వంటి స్థానీయ నామాలతో సంపుటులను ముద్రిస్తూ వస్తున్న తిరుపతి ఈ సంపుటినీ మొలాటు అంటూ ముందటి కవితా సంపుటుల సరసన్నే నిలిపి గౌరవిస్తున్నాడు.

సాహిత్య విమర్శలో గొప్ప కవిత్వం గురించిన చర్చ పెద్దగా జరగలేదనే చెప్పాలి. మహా అయితే కొత్త భాష, కొత్త ప్రతీకలు, పదబంధాలు, కొత్త ఇతివృత్తాల స్వీకరణ ఇత్యాది అంశాల ప్రాతిపదికగా కవిత్వ శ్రేష్టతను విమర్శకులు చర్చిస్తున్నారు.కొత్త వస్తుశిల్పాలనేవి కొత్త సత్యాలను శోధిస్తున్నప్పుడు కలిగే ఉప ఉత్పత్తి (By-product) మాత్రమే. నిజానికి కొత్త సత్యాలను, సృజనాత్మక స్వేచ్ఛను వెల్లడించేదే గొప్ప కవిత్వం.ఈ తరహాలో మొలాటు కవితలను చర్చిస్తే కూకట్ల తిరుపతి ఇదిగో- అలగాజనం అడుగుజనం **'తరాలుగా వొదువని తండ్లాట'**కు ఇక్కడి **'రాతి యుగపు రాజిర్కం పోకడలు'** కారణమంటున్నాడు. ఇక జాగృతం కావల్సింది పాఠకులూ ప్రజలే.

# తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో – అష్టవిధ శృంగార నాయికలు

**కొలుకుల రజిత**, తెలుగు అధ్యాపకులు (పరిశోధక విద్యార్థి), తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, నిజామాబాద్. ఫోన్ : 7569856191

**వ్యాస సంగ్రహం :** మన సనాతన సంప్రదాయాన్ని, ధర్మాన్ని తెలియజేస్తూ వాగ్గేయకారులు తమ మధురస్వరంతో కీర్తనలు ఆలపించారు. భగవంతుని విభూతులు, ఆధ్యాత్మిక మార్గము, తత్త్వగీతాలతో, భజనలతో కీర్తించడమనే భక్తిని పట్టుకుని వారు తరించారు. అదే కోవలో భగవంతున్ని కీర్తిస్తూ సంకీర్తనలను రచించిన సంకీర్తనకారులు ఎంతోమంది ఉన్నారు. నేటి కాలంలో అన్నమయ్య క్షేత్రయ్యలను గురువులుగా భావించి వారి సంప్రదాయాన్ని ఏకలవ్య శిష్యుడుగా కొనసాగుతూ సంకీర్తనలను రచిస్తున్నావారు తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్. వీరి కీర్తనల్లో భక్తి, మధురభక్తి, ఆధ్యాత్మికం, శృంగారం, రాసలీలలు, నాయికలు మొదలైన వస్తువులున్నాయి. తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో అష్టవిధ శృంగార నాయికల చిత్రణ. వారి భక్తి, ప్రేమ, విరహ భావాలు మధురభక్తికి మూలం. ఈ వ్యాసం లక్ష్యం ఆ నాయికల భావజాలం ద్వారా వ్యక్తమైన భక్తి, ప్రేమ సౌందర్యాన్ని విశ్లేషించడం.

**పరిశోధన పద్ధతి :** విశ్లేషణాత్మక , వివరణాత్మక పద్ధతి.

**ఉపోద్ఘాతం :** మన సనాతన సంప్రదాయాన్ని, ధర్మాన్ని తెలియజేస్తూ వాగ్గేయకారులు తమ మధురస్వరంతో కీర్తనలు ఆలపించారు. భగవంతుని విభూతులు, ఆధ్యాత్మిక మార్గము, తత్త్వగీతాలు, భజనలతో కీర్తించడమనే భక్తిని పట్టుకుని వారు తరించారు. అదే కోవలో భగవంతున్ని కీర్తిస్తూ సంకీర్తనలను రచించిన సంకీర్తనకారులు ఎంతోమంది ఉన్నారు. నేటి కాలంలో అన్నమయ్య క్షేత్రయ్యలను గురువులుగా భావించి వారి సంప్రదాయాన్ని ఏకలవ్య శిష్యుడుగా కొనసాగిస్తూ తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, సంకీర్తనలను రచిస్తున్నాడు. వాటిలో వస్తు పరంగా భక్తి, మధురభక్తి, ఆధ్యాత్మికం, శృంగారం, రాసలీలలు, నాయికలు మొదలైన కీర్తనలున్నాయి. వీరు రచించిన సంకీర్తనలు భక్తి భావంతో, వివిధ రకాల వస్తు వైవిధ్యంతో గణనీయంగా ఉన్నప్పటికీ, ముఖ్యంగా అష్టవిధ శృంగార నాయికల చిత్రణ విశేషంగా కనిపిస్తుంది ఈ నాయికా వర్ణనలు సంకీర్తనా ప్రక్రియకు కొత్త అందాన్ని చేకూర్చాయి.

మన ప్రాచీన కవులు అష్టవిధ శృంగార నాయికలను తమ కావ్యాల్లో ప్రస్తావించడం చిత్రించడం మనం గమనిస్తాం. తెలుగు సాహిత్యంలో శృంగార రసానికి ఆలంబనలైన నాయక-నాయికా భేదాలను వివరించడంలో కావ్యాలు తమదైన ప్రత్యేకతను చాటుకున్నాయి. ముఖ్యంగా అష్టవిధ శృంగార నాయికల లక్షణాల



గురించి లాక్షణికులు స్పష్టంగా పేర్కొన్నారు. రామరాజభూషణుడు తన 'కావ్యలంకార సంగ్రహం'లో నాయిక లక్షణాలను వివరించాడు.

పద కవితా ప్రక్రియలో మధుర భక్తి శృంగారాన్ని పరాకాష్టకు చేర్చిన క్షేత్రయ్య, తమ (సంకీర్తనల్లో) పదాల్లో ఈ అష్టవిధ నాయికల మానసిక స్థితులను, శృంగార లీలా వైవిధ్యాన్ని తెలిపారు.

సంకీర్తనలో ధృష్టుడైన నాయకుడు పరస్త్రీగమనం చేసిన తరువాత తన నాయిక వద్దకు వస్తాడు. నాయిక ఖండిత స్వభావం కలిగి ఉండి, అతని వన్నెలు, చిన్నెలు చూపుతూ మాయ చేయాలన్న ప్రయత్నాన్ని తిరస్కరిస్తుంది. (వేటూరి ఆనందమూర్తి, క్షేత్రజ్ఞులు పద సాహితి ,1991 పుట. 66)

ఈ సాహితీమార్గ సంప్రదాయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఆధునిక కాలంలో సంకీర్తనలు రాస్తున్న తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ తన సంకీర్తనల్లో శృంగార అష్టవిధ నాయికలను తనదైన శైలిలో, స్థానికతను చొప్పిస్తూ కొత్త కోణంలో చిత్రీకరించారు. కావ్య సంప్రదాయం (రామరాజభూషణుడి పద్యం) సంకీర్తన సంప్రదాయం (క్షేత్రయ్య పదాలు)ల నేపథ్యాన్ని అనుసంధానిస్తూ, తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లోని శృంగార నాయికల విలక్షణతను వివరించడమే ఈ వ్యాస లక్ష్యం.

**స్వాధీనపతిక :** భర్త ఆధీనంలో ఉండేది

**వాసకసజ్జిక :** ప్రియుడి కోసం అలంకరించుకునేది వాసకసజ్జిక

**విరహోత్కంఠిత :** అతడు ఆలస్యం చేస్తే తహతహలాడేది విరహోత్కంఠిత

**విప్రలబ్ధ :**ప్రియుడు సంకేతస్థలానికి రాకపోతే బాధపడేది విప్రలబ్ధ

**ఖండిత :** పరకాంతతో గడిపిన ప్రియుడిని చూసి కోపగించుకునేది ఖండిత

**కలహాంతరిత :** ప్రియుడిని కోపంతో బయటకు పంపి తర్వాత పశ్చాత్తాపపడేది కలహాంతరిత,

**ప్రోషితభర్తృక :** ప్రియుడు దూరప్రాంతంలో ఉంటే దుఃఖించేది ప్రోషితభర్తృక,

ఈ ఎనిమిదిమంది నాయికల భావచిత్రణ తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ శ్రీకృష్ణ క్రీడలు కీర్తనల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

**స్వాధీన పతిక**

ప: నే గీచిన గీటు దాటగలడా / నే పిలిచిన మాట మీరగలడా
నన్నడగనిదే సత్యాపతి, / యికనా కడప దాటగలడా?
చ: మురారికి మగువలెందరైన / యీసారి నన్ను విడువగలడా
యీ శౌరికి అష్టసతులైనా/ నే లేనిదే నిముషముండగలడా?
చ: నా కౌగిట కరిగి వొరుగుటచే / నా కొంగున కట్టి యుంచితిని
నా కన్నుల కాటుకలంటుటచే / యీ వెన్నదొంగ నల్లగా మారలేదా
(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.3).

పై కీర్తనలో నాయిక సత్యభామ కృష్ణుడు తను గీసిన గీత దాటకూడదని చెప్పే సందర్భంలో స్వాధీన పతిక లక్షణం స్పష్టమవుతుంది. శృంగారభావ పూర్వకంగా కృష్ణుడిని పూర్తిగా తన కైవసం చేసుకుంది. అతన్ని తన ప్రేమతో బంధించి తనవైపుకి తిప్పుకుంది. కవి ఈ కీర్తనలో సత్యభామ పాత్రను ప్రేమతో, గర్వంతో, ఆధిపత్యంతో ఉన్న భార్యగా చిత్రించాడు. అంతేకాకుండా, శ్రీకృష్ణుడు సత్యభామ కన్నుల కాటుక వలన నల్లగా మారాడని చెప్పడం ద్వారా కవి భావప్రకటనలో ఉన్న వైవిధ్యం స్పష్టమవుతుంది. ఇది ప్రేమలోని మాధుర్యాన్ని, సౌందర్యాన్ని ప్రతిబింబించే అతిశయోక్తి ఉంది.

**వాసకసజ్జిక**

ప: కోపమా ?గోపాలా!/ రావేలా యీవేలా
చ: మూగబోయిన ఈ మధురవీణ /రాగమొలుకగ,నా నవ నాడుల
తంత్రులుగా మార్చి కూర్చి నీ /మృదు కొనగోట మీటగా.
(కోపమా)
చ: మీటిన కంగను నా హృదయ వీణ /కోటి కోర్కెలు ధ్వని తరంగాలై
రాగ బంధాలై అనురాగ గగనాన/ తేలియాడగా తరుణమిదేరా
(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.4).

ఈ కీర్తనలో నాయిక తన ప్రియుడైన గోపాలుడి రాక కోసం ఉబలాటపలాడుతూ, తనను తాను అందంగా అలంకరించుకుంటుంది. కాని, ఆ అలంకరణ బాహ్యాసౌందర్యం కాకుండా, అంతర్సౌందర్యంగా ప్రస్ఫుటమవుతుంది. తన హృదయాన్ని వీణలా భావించి, ప్రియుడి మృదుస్పర్శతో ఆ వీణ తంత్రులు మ్రోగాలని కోరుకుంటుంది. తన ప్రేమ భావాలను రాగాలుగా, కోరికలను స్వరాలుగా ఊహిస్తూ ఎదురుచూసే ఈ నాయిక వాసకసజ్జిక. కృష్ణుడు తన గోటితో ఆమె హృదయాన్ని మృదువుగా తాకగానే తన ఆంతర్యంలో ఏర్పడే ధ్వనికి ఏర్పడే ప్రేమ తరంగాలే ఆమె మనసులో కోటి కోరికలు. నాయిక హృదయ స్పందనలోని సున్నితమైన అనుభూతిని కవి అత్యంత సున్నితంగా, సౌందర్యభరితంగా అభివ్యక్తం చేశాడు.

**విరహోత్కంఠిత**

ప: ఏమే మాలతి యేమే పొన్న/ యేల మరుగాయెనే నా సామి
ఏమే జాజి ఏమే రోజా /మీరైనా చెప్పరెందుకే ?
చ: కలనైన నా మీది కలవరమే గాని /యిలలోన యితరుల నొల్లని వాడు
అలిగి యెపుడైన తెలియక దూరితే /కరుణావతారుడు మదినెంచడే
(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.5)

ఈ కీర్తనలో నాయిక చంచలమైన తన భావాలను, ప్రేమాభిమానాలను పువ్వులతో చెబుతుంది. విరహబాధను తట్టుకోలేని తన హృదయ దైన్యాన్ని వ్యక్తం చేస్తున్న నాయిక విరహోత్కంఠిత. ప్రియుడు రాలేదని పువ్వులతో ప్రశ్నిస్తుంది. ఒకవైపు సృజనాత్మక, సున్నితమైన భావప్రకటన. మరొకవైపు తన బాధను ప్రత్యక్షంగా ఎదుర్కోవడంలో వైఫల్యం. ఆ క్షణంలో నాయిక మనోభావాన్ని చెప్పడంలో కవి అభివ్యక్తి వినూత్నంగా ఉంది. ప్రేమను వ్యక్తం చేయడానికి పువ్వులను ప్రతీకగా చూపిస్తారు. కానీ, ఇక్కడ విరహాన్ని వ్యక్తం చేయడానికి పువ్వులు మాధ్యమంగా తీసుకోవడం కొత్తదనం.

**విప్రలబ్ధ**

ప : మగవాన్ని గట్టి పెట్ట మన తరము గాదే
వగలమారి కృష్ణున్ని మగువరో బట్టతో సూదిని ముడేసినట్లాయెనే
చ : సరసిజ గంధివని నను సరగున బట్టి. నా
ఉరపు శ్రీ ఫలముల జుర్రుకుంట ఇక తరతీపివలపుతో
నాలో తమకమెచ్చి పొంగ/ విరివిలుకాని కేళిలో వింతవింత బంధములు జూపినోడే (తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.6).

పై కీర్తనలో 'విప్రలబ్ధ'లోని భావాన్ని కేవలం ప్రియుడి ని దూరం చేసుకున్న దృష్టితో కాకుండా, తార్కిక దృష్టితో చూపించారు. 'మగవాన్ని గట్టి పెట్ట మన తరము గాదే' అనే పాదంలో విప్రలబ్ధ స్త్రీ అనుభవాన్నీ, సత్యాన్ని, భౌతిక ప్రేమలోని అస్థిరతను వ్యంగ్యంగా వ్యక్తం చేస్తుంది. కృష్ణుని ప్రేమలో కూడా **'సూదిని బట్టతో ముడేసినట్లాయెనే'** అనే రూపకంలో ప్రేమ నియంత్రణాతీత

స్వరూపాన్ని కవి చమత్కారంగా ప్రతిపాదించాడు .

ఈ భావవ్యక్తీకరణలో నాయిక దుఃఖం కన్నా జ్ఞానం ఎక్కువగా కనిపిస్తుంది. ప్రేమ అనేది బంధం కాదు, అనుభూతి అని, దానిని బలవంతంగా నిలబెట్టలేమని ఆమె గ్రహిస్తుంది. విప్రలబ్ధ నాయికను మానసికంగా పరిపక్వత చెందిన స్త్రీగా చిత్రించాడు. మగవాన్ని బలంగా, తన నియంత్రణలో ఉంచడం ఏ స్త్రీకి సాధ్యంకాదని, కృష్ణుని ప్రేమలో కూడా ఆ నియంత్రణ సాధ్యం కాదని, సూచిస్తుంది.

అంటే, భౌతికంగా బలవంతమైన ఆధిపత్యంతో ప్రేమను, హృదయాన్ని కట్టిపెట్టలేమని, నిజమైన అనుబంధం స్వేచ్ఛగా, సహజంగా హృదయ సంబంధాలతో మాత్రమే కొనసాగుతుందనే నిత్య సత్యాన్ని చూపిస్తున్న కీర్తనలో ఉన్న నాయిక విప్రలబ్ధ.

**ఖండిత**

ప : ఇంతి వాన్ని ఇంటికి రానిచ్చేనా ? /పంతంబు బూని పిలిచినా తలుపు తీసేనా

మధువు మగువల, మరిగిన వానికి/ పదుగురిలో దండించక, విడిచేనా ?

చ: ప్రేమ మీరయతని మోమైన చుచేనా ? /యేమి చెప్పినను నిజమును నేను యెంచేనా?

రచ్చకు వెరవక రభసను జేసి యిక/ ఈ మాట బైటక్ లో అనక విడిచేనా ?

చ : బతిమాలినా నే కౌగిలి చేరెనా ? /పతియని మునుపటి దయలుంచేనా ?

ఇతనికి వెరచి నికముందు /ఇన్నాళ్ళవలె యనుసరించేనా?

(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.7).

ఈ కీర్తనలో ఉన్న నాయిక ఖండిత. ఇందులో వ్యక్తమవుతున్న భావనలు కోపం, అసహనం, అవమానం మానవ హృదయ మానసిక స్థితుల లోతైన వ్యక్తీకరణలు. ఎందుకంటే, 'ఇంతి వాన్ని ఇంటికి రానిచ్చేనా?. మధువు మగువల, మరిగిన వానికి వంటి ప్రశ్నార్థక వాక్యాలు నాయిక అంతరంగంలో ఉప్పొంగుతున్న దుఃఖాన్ని, గర్వాన్ని, విరహ తాపాన్ని తెలిపేవి . ఈ ప్రశ్నలు కేవలం వ్యంగ్యాత్మకమైనవిగా కాకుండా, ఆవేదనతో కూడినవి.

ఖండిత అంతర్గత కలతను ప్రశ్నార్థక వాక్యాలతో వ్యక్తం చేస్తాడు. వాక్యంలో ఉన్న చమత్కారం భావ సన్నివేశం నాయిక స్థితి తీవ్రతను పెంచి చూపుతుంది. భక్తి సాహిత్యంలో సాధారణంగా కనిపించేది శాంతం . కాని, ఇక్కడ కవి ప్రేమలోని విరోధాన్ని కూడా భక్తి అనుభూతిగా చూపించడం గమనార్హం. అందువల్ల ఈ కీర్తనలో ఖండిత కేవలం కోపభరిత స్త్రీగా కాకుండా, తన ప్రేమలో నిజాయితీ ఉన్న భక్తురాలిగా కనిపిస్తుంది.( బైటక్(వెలుపల – తెలంగాణ మాండలికం). గ్రామాల్లో ఒక ఇంటి సమస్యని పంచాయయతీలో పెట్టి దానినీ తీర్చుకునే పరిస్థితిని బైటక్ ఇవ్వడం అంటారు).

**కలహాంతరిత**

ప : తెలియనైతినే నేను తెలియనైతినే

మలయజగంధిరోయింత మాయగాడని యిక..

చ : తోయజముఖినని పాయజాలక నాతో

తియతియని వగల దేలించి సోలించిన

వాడిని మాయగాడని యిక తెలియనైతిని

(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.65).

ఈ కీర్తనలో కలహాంతరిత మానసిక స్థితిని అత్యంత సున్నితంగా, సహజమైన భావంతో కనుల ముందుంచాడు 'తెలియనైతినే నేను తెలియనైతినే' అనే పునరుక్తి ఆమె ఆత్మపరిశీలన, పశ్చాత్తాపం, విచారమనే మూడు భావస్థితుల కలయికను తెలియజేస్తుంది. ప్రియుడి మాయలో పడిపోయినందుకు తనమీద తానె కోపంతో, తన నిర్లక్ష్యంపై బాధతో ఆమె అంతరంగం తల్లడిల్లుతుంది. ఇది కేవలం ప్రేమ విరోధం కాదు, తాత్త్విక మానసిక సంఘర్షణగా కవి చూపించాడు.

శబ్దాల ఎంపిక, పునరుక్తి తో కలహాంతరిత కలహాన్ని వ్యక్తపరుస్తాడు. ఆమెలోని స్నేహం, గర్వం, పశ్చాత్తాపంతో నాయికను కేవలం కోపంతో కాకుండా,ఆత్మవిమర్శతో కూడిన ప్రేమికురాలిగా చిత్రించాడు.

**ప్రోషిత భర్తృక**

**ప : ఎంతని చెప్పుదునే చెలీ / నే నేమని చెప్పుదునే**

**చ: మన్ననతో నను బృందావనికి పిలిచి / ఉన్నతమైన నా ఉరపు పరువాల కన్నులకత్తుకొని, కన్నులు,వీనులు, చెక్కులు, చేతులు కలియ ముద్దాడి/తిన్నగా ఊరికి పోవుచు, తిరిగి తిరిగి చూచిన వగలు ..(ఏంతని)**

(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.9)

ఈ కీర్తనలో నాయిక తన ప్రియుడు పని నిమిత్తంగా ఊరిని విడిచి వెళ్తున్నప్పుడు కలిగిన బాధను తన చెలికత్తెతో పంచు కుంటుంది. "ఎంతని చెప్పుదునే చెలీ" అంటూ తన మనసులోని వేదనను వ్యక్తం చేస్తుంది. ప్రియుడు తనను విడిచి వెళ్లే సమయంలో ఆమె కళ్ళను, చెక్కిలిని, చేతులను మళ్లీమళ్లీ ముద్దాడుతూ, తిరిగి తిరిగి చూసుకుంటూ వెళ్తున్న దృశ్యం ఆమె మనసును మధురమైన బాధతో నిండిన జ్ఞాపకాలలోకి తీసుకువెళ్తుంది. అతని స్మృతులతో మదనపడిన ఆమె తన చెలికత్తెతో ఆ వేదనను పంచుకుంటున్న ప్రోషిత భర్తృక సందర్భాన్ని ఈ కీర్తన స్పష్టంగా చూపిస్తుంది.

అభిసారిక

ప : తలిచెద నీ నామమే గోపాలా
నిలిపెద నీ రూపమే యీ వేళా
చ : వలపు నందనము నీకై విరిసే
మనసు మందిరము నీకై దెరిచే
ఆశా పానుపు పరిచితి నోయి/ వేచితి నీకై అభిసారికనై
(తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీకృష్ణ క్రీడలు, 2001,పుట.10).

పై కీర్తనలో అభిసారిక భావన ఆధ్యాత్మికంగా, భక్తి రసంతో కూడినది. 'తలిచెద నీ నామమే గోపాలా' అనే పాదంలో భౌతిక ప్రేమ కావాలనే కోరిక కాదు, పరమాత్మను చేరాలనే తపన కనిపిస్తుంది. సాధారణంగా అభిసారికను కవులు శృంగార రసంలో, రహస్య సన్నివేశాల్లో చూపుతారు. కానీ, తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ ఆ స్థూల రూపాన్ని దాటి, ఆమెను భక్తిలో మునిగిన స్త్రీగా చిత్రించాడు. **'వలపు నందనము నీకై విరిసే / మనసు మందిరము నీకై దెరిచే'** అనే పాదాలు కవి దృష్టిలో ప్రేమను పుష్పంలా, మనసును ఆలయంలా చూపాయి. ఇది శృంగారాన్నీ, భక్తినీ ఏకమయ్యే క్షేత్రంగా చిత్రించిన చక్కటి రూపక నిర్మాణం. 'ఆశా పానుపు పరిచితి నోయి' అనే వాక్యంలో భక్తి యొక్క చివరి మెట్టు శరణాగతి భావమనీ. ప్రస్ఫుటమవుతుంది. ఈ కీర్తనలో అభిసారిక భౌతిక ప్రేమికురాలు కాదు. ఆమె దైవానుభూతిలో లీనమైన నాయిక.

తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ అష్టవిధ నాయికల భావచిత్రణలో బాహ్య ప్రేమను మాత్రమే కాకుండా, ఆ ప్రేమలో అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మిక అభివ్యక్తి కనిపిస్తుంది . ప్రతీ నాయికలో భిన్నమైన మానసిక స్థితిని, స్త్రీ మనసు లోతులను సున్నిత భావాలతో వ్యక్తీకరించాడు. స్వాధీనపతికలో గర్వం, వాసకసజ్జికలో తపన, విరహోత్కంఠితలో వేదన, విప్రలబ్ధలో జ్ఞానం, ఖండితలో ఆవేదన, కలహాంతరితలో పశ్చాత్తాపం, ప్రోషితభర్తృకలో అనురాగం, అభిసారికలో భక్తి ఈ భావాలన్నీ ఆయన సాహిత్యంలో విరివిగా కనిపిస్తాయి. కవి నాయికల మనోభావాలను మానవీయంగా చూపుతూ, వాటికి భక్తి రస ఆధారాన్ని ఇచ్చి, శృంగారాన్నీ భక్తినీ కలిపి ప్రత్యేక దృష్టి కోణాన్ని చూపారు. ఈ విధంగా ఆయన సంకీర్తనలు కేవలం రసానుభూతి కాదు, ఆత్మానుభూతికి దారితీసే మధుర భక్తి సంకీర్తనలు.

**ఉపయుక్త గ్రంథ సూచి**

రామరాజభూషణుడు, 2013, కావ్యాలంకార సంగ్రహం, (నరసభూపాలీయం) ఏమెస్కో
లక్ష్మీనారాయణ గౌడ్, తాళ్ళ,2001, శ్రీకృష్ణ క్రీడలు
ఆనందమూర్తి , వేటూరి క్షేత్రజ్ఞులు పద సాహితి ,1991 పుట.66

❖ ❖ ❖ ❖ ❖

# నానీలు

**పిప్పి శ్రీలత**
**ఫోన్ : 9121512082**

ఎన్నికల వేళ
జనంతో ఏకం
ఎంపికవగానే
ధనంతో మమేకం

★★

అభివృద్ధి
ఆకాశాన్నంటినా
పొల్యూషన్‌కి
సొల్యూషనే లేదు

★★

అందరికీ కార్పొరేట్
విద్యపై మోజు
అందుకే కట్టిస్తారు
లక్షల్లో ఫీజు

★★

ఆరోగ్యమే మహాభాగ్యం
కానీ ఏం చేస్తాం
కల్తీ ఆహారం
మన దౌర్భాగ్యం

★★

సామాన్యుడికి, సంపన్నుడికి
సమయం సమమే
సద్వినియోగంలో
సమస్య!

★★

తాను తినక
దాచిన ధనం
తరాలు కూర్చుని తిన్నా
తరగకూడదట

★★

రీల్స్ కొరకు
రిస్కులు
లైక్‌ల కంటే
లైఫ్‌లు ముఖ్యం సుమా!

★★

చేతకాని వేళ
చేయూతకై వెతికితే
చేతికర్ర
ఊతమైంది.

★★

నాన్నంటే
గాంభీర్యమే జ్ఞాపకం
నీ గమ్యం వెనుక
తను దాచిన గాయాలెన్నో

★★

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1 (45) హైదరాబాద్ నవంబర్ : 2025

# పూత పట్టిన అడవి – పుల్లలెగదోసే పిలుపు

## (పల్లెపట్టు నాగరాజు – తగుళ్ళ గోపాల్ వచన కవిత్వం తులనాత్మక పరిశీలన)

**డా. సుంకర గోపాలయ్య,** తెలుగు అధ్యాపకులు, డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫోన్ : 9492638547

**ఉద్దేశం :** బతుకు మూలాల్లోంచి కవిత్వం రాసేవాళ్ళ కవిత్వం మట్టి వాసన వేస్తుంది. అలాంటివాళ్లు సాహిత్యంలోకి అడుగుపెట్టిన ప్రతీసారి సాహిత్యానికి ఒక కొత్త పదజాలాన్ని పరిచయం చేస్తారు. అభివ్యక్తిలో సైతం వైవిధ్యం ఉంటుంది. కొన్ని కొత్త వస్తువులు కూడా పాఠకులకు పరిచయం అవుతాయి. దాదాపు ఒకే కాలంలో తెలుగు కవిత్వంలో అడుగుపెట్టిన పల్లెపట్టు నాగరాజు, తగుళ్ల గోపాల్ నేపథ్యాలు కాస్త వేరు. ప్రాంతాలు వేరు. ఒకటి దళిత జీవితం. మరొకటి బిసి బతుకు గీతం. వచ్చిన కవిత్వంలో ఈ ఇద్దరి కవిత్వాన్ని త్రినాత్మకంగా పరిశీలించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**పల్లెపట్టు కవిత్వతత్వం :** కవిత్వం అంటే ఏమిటో నాగరాజు ఇలా అంటాడు

**"కవిత్వం ఇదే అని నిర్వచించడం సాహసమే. కానీ, కవి జీవిస్తున్న కాలపు సామాజిక అనుభవాల కళాత్మక వ్యక్తీకరణే కవిత్వం అని భావిస్తాను. కవిత్వం సమాజపు రాజకీయ కన్ను కూడా. బాధ్యత గల కవి తనదైన దృక్పథంతో సమాజంతో సాగించే చైతన్యపు సంభాషణే కవిత్వమని అనుకుంటాను. వివక్ష, దోపిడీ, అణచివేతల నుండి ప్రజలకు విముక్తిని కాంక్షిస్తూ అందుకు పూనికను, ఊనికను ఇచ్చేదిగా కవిత్వముండాలి. మొద్దునిద్రలో ఉన్న వ్యవస్థను మెలుకువలో ఉంచడం, ద్వేషం నిండిన సమాజానికి ప్రేమను పంచడం కవిత్వపు ప్రయోజనం కావాలి"**

ఈ మాటలకు అక్షరాల పల్లెపట్టు కవిత్వం లక్ష్య లక్షణ సమన్వయంగా కనిపిస్తుంది. ఇప్పటికే నాగరాజు యాలైపూడ్సింది కవిత సంపుటితో ఎన్నో బహుమతులు, ప్రశంసలు పొందాడు. ఆ తర్వాత కూడా అతనేమి ఆగలేదు. పుల్లలు ఎగదోస్తూనే ఉన్నాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నాడు. ప్రశ్నిస్తూనే ఉన్నాడు. తాను రగిలిపోతూ పాఠకుల మెదళ్ళను రగిలిస్తూ ఉన్నాడు.

ఒక కవి ఎందుకు కవిత్వం రాస్తున్నాడు, తను ఏ మార్పును సమాజం నుండి ఆశిస్తున్నాడు అటువంటి ఎరుకతో కైకట్టిన కవి నాగరాజు. తన కవిత్వానికి మూలాలు ఇంట్లో, తన వీధిలో, తన పొలంలో మొత్తంగా తాను చూసిన చూస్తున్న సమూహంలోనే ఉన్నాయి. అతని కవిత్వం మట్టిని విడిచి మాయ చేయలేదు. ఏ ఊహ చేసినా అది అక్కడ నిలబడి చేసిన ఊహ. వాస్తవాలను కాస్త పదునుగా, వ్యంగ్యంగా కూడా చెప్పగలిగిన కవి. ఏం చెప్తున్నాడనే



స్పష్టత ఉంది. పాఠకుడికి కూడా ఆ స్పష్టత తెలుస్తుంది. సమాజం పట్ల, మనుషుల పట్ల, నిండుకున్న మానవత్వం పట్ల, దారితప్పిన భావ స్వాతంత్రం పట్ల అతను తీవ్రమైన, తీక్షణమైన బాధతో రగిలిపోతాడు ఆ రగిలేతనాన్ని అక్షరాలకు ఇస్తాడు.

**"తెలుపును గురించి మాట్లాడే ముందు**
**నలుపును గురించి మాట్లాడాలి**
**..................................**
**జంతువుల గురించి మాట్లాడే ముందు**
**మనిషిని గురించి మాట్లాడాలి"**

ఈ నాలుగు వాక్యాలు అతని మార్గం ఏంటో చూపిస్తాయి. చిత్తూరు యాసని శ్వాసగా చేసుకొని మాండలికాన్ని మనసు నిండా నింపుకొని అతని వాక్యాలు మట్టి వాసన వేస్తాయి.

**అప్ప వానదేవుడా !**
**నువ్వు కూడా రాజకీయం చేయబాకు సామీ**

ఇలాంటి వ్యంగ్యం పల్లెపట్టు వాక్యానికి అదనపు ఆకర్షణ.

సమాజాన్ని చాలా సునితమైన చూపుతో చూస్తూ అనుక్షణం పొగిలి పొగిలి దుఃఖపడి ఆ దుఃఖాన్ని కవిత్వంగా మలుస్తాడు. ఆ అక్షరాలు పాఠకుడిని తట్టి లేపుతాయి. ప్రశ్నిస్తాయి పలుగు, పారల గాయాల శబ్దాన్ని విని, వినిపించ గల కవి నాగరాజు చెమట చేతుల శ్రామిక గీతాన్ని పాడే హృదయం నాగరాజు

**"దేశమంతా ఒకటైన ఇంటిని**
**నా వాళ్ళందరూ ఉన్న ఒక ఇంటిని**
**నేను కలగంటున్నాను**
**నా నెత్తురు తడవని నాలుగడుగుల నేలపై**
**నా అడుగులు జంకని నా నేల పొరలపై**

**నా ఇంటి చుట్టూ కంచెలు లేని అంత మట్టిని కలగంటున్నాను**
**నేను నా ఇంటిని కలగంటున్నాను"**

ఏ పునాదుల నుండి మాట్లాడుతున్నాడో ఈ వాక్యాలు చూస్తే అర్థమయిపోతోంది అతని వస్తువు స్పష్టం. చూపు స్పష్టం నిర్మాణం స్పష్టం అల్లిక స్పష్టం పిట్టగూడు కట్టుకున్నంత సహజంగా కై కడతాడు. తెలుగు కవిత్వానికి దూడమూతి వాసనను చూపిన కవి. గడ్డిపరకల గీతాన్ని ఆలపించిన కవి. జనాల మీద గర్వంగా లేచి నిలబడి నిలదీస్తున్న మాండలిక పాట. ఇది కచ్రుపలికన వాక్యం. చీకటికి ముదిగారం అద్దినపదం.

**తగ్గుళ్ళ గోపాల్ కవిత్వ తత్వం :** ఇక ఈ వ్యాసంలో మాట్లాడబోతున్న మరో కవి తగుళ్ల గోపాల్. గోపాల్ కవిత్వం అంటే ఇలా అంటున్నాడు.

**"మా నలుగురు మేనత్తలు వాళ్ళ కండ్లముందే కాలం చేసిన తమ్ముళ్ళను తలుచుకునే ప్రేమలే నాకు కవిత్వం. జీవితమంతా పచ్చి కట్టెలు కొట్టి బతికిన, గొర్లబాటెంట నడిచిన నాయిన, పెదనాయిన, కక్కయ్యల జీవితాలకు మించిన కవిత్వం ఏముంటుంది? వాళ్ళను ఆత్మల తలుచుకున్నప్పుడల్లా చుట్టూ ఇంత జీవితమున్నాక ఊహల్లో తేలిపోవడం ఎందుకు అనుకుంటాను."**

గోపాల్ దుఃఖపు గంపని పాఠకుల దగ్గర దించి, తన గుండె భాషను వినిపిస్తాడు. తన దుఃఖాన్ని పాఠకుల గుండెల్లోకి ఒంపుతాడు. కల్వకుర్తి ప్రాంత మట్టి తల్లుల చనుబాల వాసనతో కవిత్వం సాగుతుంది. నేను అనుభవిస్తున్న, చూస్తున్న జీవితాన్ని తప్ప మరేం రాయగలను అని నిజాయితీగా ప్రకటించాడు. తాను ఏడుస్తూ పాఠకులను కూడా ఏడిపిస్తాడని, అది కవిత్వమా అని కొందరు అన్నారు. కానీ ఆ దుఃఖ గీతిక వెనక ఉన్న నేపథ్యాన్ని, తాత్వికతను అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఉన్నోడికైనా లేనోడికైనా చివరి నిద్ర మాత్రం ఒక్కటే, ఒకే ఆకాశాన్ని ఒకే మట్టిని కప్పుకునే వాళ్లంతా బంధువులే కదా, రక్తంలో కన్నీళ్లను కలుపుకున్నోళ్ళం కదా దుఃఖాన్ని మోస్తూ తిరగాల్సిందే. ఇట్లాంటి వాక్యాలు సాధారణంగా ఉన్నట్టే ఉంటాయి, అట్లాంటి వాక్యాలు రావడానికి కవి ఎంత వేదనని అనుభవించి ఉండాలి. తన నాన్నను తలుచుకుంటూ కడుపునిండా మేపుకొచ్చిన మేక ఇంటి ముందు జ్ఞాపకాలు నెమరేస్తున్నట్లు అని అన్నట్టు గోపాల్ కూడా ఇంటిని, ఇంట్లోని మనుషులను, చుట్టూ ఉన్న బంధాలను, ఊరి జ్ఞాపకాలను కవిత్వంలో నెమరు వేస్తున్నాడు. ఇతను రాసిన వాక్యం నిండుగా పూసిన తంగేడు మొక్క. అప్పుడే కురిసిన వర్షానికి స్వచ్ఛంగా పారుతున్న వాగు. అతని గొంతులో ఉన్న మేక పిల్ల అమాయకపు తనమే వాక్యంలో ఉంటుంది. కుల మతాల బురద గుంటలోంచి ఈ లోకం ఎప్పుడు బయటపడుతుందో అని ఎరుక చెప్పమని ఎరుకల లింగక్కని బతిమాలుతూ, మనుషులను నరుకుతున్న అడ్డు గోడను కూల్చడానికి మానవత్వం మొక్కను కలగంటున్నాడు.

**"ప్రయాణం గురించి**
**ఏమేమో అనుకుంటాం గానీ**
**ఏ విమానమైన నేల మీద**
**కొంత దూరం నడిచినంకనే ఎగురుతుంది"**

ఈ నాలుగు వాక్యాలకు ఏ వైపు నుండైనా వ్యాఖ్యానం చేయవచ్చు. తనకు బాగా దగ్గరగా ఉన్న వస్తువుని గోపాల్ ఇష్టంగా, సునాయాసంగా కవిత్వం చేస్తాడు. ఈత చాప అల్లిక లాటి నిర్మాణం. వసరా గోడలకు ఎర్రమన్ను పూసినట్టు పదాల ఎంపిక, తన ప్రాంత భాష అక్షరాలతో కూడిన నడక మనల్ని ఆత్మీయంగా లోపలికి తీసుకెళతాయి.

అయితే నేను ఈ వ్యాసంలో ఒక పరిశీలనని మీ ముందుకు తెస్తున్నాను. ఈ ఇద్దరు కవులు ఒకే వస్తువు మీద రాసిన చాలా కవితలు ఉన్నాయి. అందులో వీళ్ళ చూపు స్వరం వ్యక్తీకరణ శిల్పం ఎలా ఉన్నాయో చూద్దాం.

రెండు మామిడి పండ్ల కోసం బలి అయిన బిక్కి శ్రీను కథ మనకు తెలుసు. ఈ సంఘటనకు స్పందనగా తగుళ్ల గోపాల్ వెలిమామిడి అనే పేరుతో కవిత రాస్తే, నాగరాజు "ఉర్సిగంపల్లి" శీర్షికతో కవిత రాశాడు. తగుళ్ల గోపాల్ దొంగతనం అంటే ఏమిటి అని అమాయకపు ప్రశ్నతో కవితని ప్రారంభిస్తాడు. అసలు దొంగలు ఎవరు పేదల్ని, దళితుల్ని దోచుకున్నది ఎవరో, పేదల బియ్యాన్ని బొక్కింది ఎవరో, కులం తక్కువైన సరే, తమ కోరికలు తీర్చడానికి గడ్డివాముల్లో బలైన దళిత స్త్రీలను తలచుకుంటూ అన్ని పోరాటాలు చేసినా సరే ఈ శిక్ష రాయబడలేదా అని ప్రశ్నించి, పెద్ద మనుషుల్ని ఏ కొండ దేవరకు బలి ఇయ్యాలి అని అడిగి–

**"అయ్యా ధర్మ ప్రభువుల్లారా**
**నన్ను ఉరి తీసిన మీ చేతులతోనే**
**ఇంకా మా వాడల్లో రాజ్యమేలుతున్న**
**ఈ ఆకలిని కూడా ఉరి తీయండి"** అని తానే బాధితుడై ఆ స్వరం వినిపిస్తాడు.

అయితే నాగరాజు రాసిన కవితలో బాధితుల తరపున బయట వ్యక్తిగా కవి మాట్లాడాడు. ఎత్తుగడలోనే ఒక దిగ్భ్రాంతిని కలిగిస్తాడు.

**"ఉరితీసి యాలగట్టిన దేశంబొమ్మలా**
**గౌరమెంటు బిల్డింగులో దళిత దేహం**
**అంటరాని కొక్కీకి యాలాడతావుంది"** అని ప్రారంభించి తరతరాలుగా దళితులకు జరిగిన ద్రోహాలను వలపోస్తూ నరసింగంపల్లి ఇప్పుడు ఉరిసింగంపల్లి ఎలా అయింది అంటూ

ఇన్నాళ్లు కత్తులు కటారులే మమ్మల్ని చంపే అనుకుంటే ఇప్పుడు పండ్లు కూడా చంపుతున్నాయని,

**"ఒసే**
**మా వాడ పంచెకింద ఆఫీసా..!**
**పంచాయితీ ఆఫీసా..**
**కడుపు కాలి అడుగుతున్నా..**
**కులం కిటికీలతో ఊగే నువ్వైనా**
**చూసింది చూసినట్టూ నిజం చెబుతావా.?**
**బిక్కుబిక్కు మంటూ**
**బక్కి శీను ఊపిరిడిసినపుడు**
**నువ్వు కూడా గుడ్లప్పగించి చూసి నేరం చేశావ్.!"**

ఆ పంచాయతీ ఆఫీస్ కిటికీలు గుండా చూసిన కళ్ళను కూడా నాగరాజు ప్రశ్నించాడు. ఈ కవితను పరిశీలించినప్పుడు గోపాల్‌ది పసిపిల్లాడి స్వరంలా అనిపిస్తుంది. నాగరాజుది నెత్తురు ఉడుకుతున్న యువకుడి స్వరములా వినిపిస్తుంది. ఇద్దరి ముగింపుల్లోనే వాక్యాలను పరిశీలిస్తే వారి వారి దృష్టి కోణం కూడా అర్థం అవుతుంది.

అట్లాగే నాగరాజు మంగలి న్యాయం పేరుతో కవిత రాస్తే గోపాల్ అమంగళకరుడు అంటూ ఇదే నేపథ్యంతో కవిత రాశాడు. గోపాల్ కవితనిండా ఒక ఊరిలో మంగలి ఏం చేస్తాడు? ఎలా బతుకుతాడు? అనే కోణం లో చెప్తూ-

**"మంగలి తాత**
**అమ్ముల పొద్దునుంచి తీసిన**
**చిన్న బ్లేడు ముక్కతోనే**
**ఇప్పటికీ కార్పొరేట్ సెలూన్ల మీద**
**అలుపెరగని పోరాటం చేస్తున్నావ్"** అని జాలిపడతాడు. నాగరాజు కవితలో ఎప్పటినుంచో మనిషి తనానికి కట్టుబడి మంగలి న్యాయాన్ని తప్పకుండా మీసాల్ని గడ్డాలని గొరుగుతున్నామే గాని మీ బుర్ర లోపల బురదను కడగలేకపోతున్నామే అంటూ ఆ వృత్తిని. ఆ మనుషులను తక్కువగా చూసే వాళ్ళని అసహ్యించుకుంటాడు. సమైక్యతకు ద్వారం తెరిచిందే మంగళ్ళు అంటూ కొత్త సిద్ధాంతం ఒకటి ప్రతిపాదిస్తాడు.

**"ఉండండి ఉండండి కత్తెర కత్తిగాక**
**కొత్త పనుముట్టుని కొలిమిలో కాలుస్తున్నాం"** అంటూ తిరుగుబాటుని, చైతన్యాన్ని ఆశిస్తాడు. ఇద్దరు కవులు రైతు పాదయాత్రల మీద స్పందించారు. గోపాల్ నెత్తుటి పాదాలకు అని రాస్తే, నాగరాజు వాళ్ళు ప్రవహిస్తున్నారు అని రాశాడు. ఇద్దరు రైతుల పక్షాన మాట్లాడారు. గోపాల్ ఈ కవితలో రైతులు ఏం చేయగలరో, ఎలా ధిక్కారం అవుతారో ఎడ్లకు ముక్కు తాడేసినట్టు, రోడ్లమీద కూడా ఎలా అరక కట్టాలో తెలుసు అంటూ-

**"ఇంకెప్పుడైనా**
**రైతు ఊపిరి చెట్లు కొమ్మలకు వేగలాడితే**
**తోలు చెప్పుల సప్పుడే**
**దేశమంత**
**జాతీయగీతమై మారుమోగుతుంది"** ఈ కవిత మెల్లగా సాగుతుంది. అదుపుగా ముందుకెళ్తుంది.

అయితే నాగరాజు కవిత వాళ్ళు ప్రవహిస్తున్నారు అంటూ వాక్యాలు ప్రవహిస్తున్నట్టుగానే సాగుతుంది. నగరానికి వచ్చిన నాగళ్ళ శబ్దాలను వినిపిస్తుంది. నగరాలు బతుకుతున్నాయి అంటే అది మేడి పట్టిన చేతుల భిక్ష అని తీర్మానించి -

**"దున్నేవాడికే తెలుస్తుంది**
**నాగళ్ల కొసన**
**కొలిమిలో కాల్చి పదును కరులు ఉన్నాయని**
**నాగళ్ళు నేలను చీల్చినట్టే**
**దేన్నైనా పాయలు పాయలుగా చీల్చుతాయని"** ఈ కవిత ముగింపులో కూడా నాగరాజు ఒక చైతన్యాన్ని ఆవాహన చేస్తున్నాడు. రైతుల పోరాటాన్ని కోరుకుంటున్నాడు.

ఇద్దరు కవులు సముద్రం గురించి మాట్లాడారు. వర్షం గురించి కవిత రాశారు. నాగరాజు దళిత జీవితంలోని వస్తువుల్ని, పోలికల్ని, చిత్తూరు జిల్లా పల్లెటూరి మాండలిక పదాలను సమర్థవంతంగా కవిత్వంలోకి తీసుకొచ్చాడు. గోపాల్ కల్వకుర్తి, కలకొండ ప్రాంత భాషతో పాటు దండ కడియం, ఎర్రమన్ను తట్ట, గుంత గిన్ని, చియ్యకూర, పైది గుంట, గల్లగురిగి, మర్కపిల్లలు ఇట్లాంటి పదాలను, గొర్రెల మేకల కాపర్ల, కూలి తల్లుల జీవితాన్ని ఆవిష్కరించాడు.

మొదటి కవితా సంపుటి తర్వాత నాగరాజు విస్తృతంగా రాస్తూనే ఉన్నాడు. ఈ మధ్యకాలంలో నాగరాజు ముఖ్యంగా అనేక సంఘటనలకు ప్రతిస్పందించాడు. సంఘటనాత్మక కవిత్వం రాసిన సరే అందులో తనదైన ముద్ర ఉంటుంది. నాగరాజు కవిత్వంలో శీర్షికల దగ్గర నుంచి ముగింపు వరకు జాగ్రత్త పడతాడు. నీలికళ్ళ కోడి కూత, కంకులు తలల వాల్చిన దృశ్యం, కుటీల మేధ యాగం, బత్తాయి? రంగుద్వేషం, ప్రేమ రుతువును కలగంటూ ఇట్లాంటి శీర్షికల ద్వారానే సగం చెప్పేస్తాడు. వొక అమ్మ మనసు జాగా, వొకనాన్న గుండె జాగా మనం ఉండే భూమ్మీద ఉండే ఉంటుంది అని ఆశ పడుతున్నాడు. కవిత్వం అంటే కాలాన్ని కాచే కాపులాధారని మాట్లాడుతున్నాడు. దళిత చైతన్యాన్ని, మనుషుల్లో రావాల్సిన సామాజిక పరివర్తనని ఎంత బలంగా ఆవిష్కరించగలడో, అనుభూతి కవిత్వాన్ని కూడా నాగరాజు రాయగలడు.

గోపాల్ కూడాసంఘటనలకు స్పందించాడు. కరుణ రసం నుండి సామాజికత వైపు మళ్లాడు. కంప చెట్లు ఇరుక్కున్న కంచి మేకల్ని

మలుపుకొచ్చే హంసక్కలు మరియు పెసరకాయ పెదాల, వడ్ల గింజల ముఖాల మనుషులు, బడి పిల్లలు, జాజి పూతల తలుపు రెక్కలు కవిత్వం నిండా ఉంటాయి. తెలంగాణ సజీవ పల్లె బతుకు చిత్రంతో పాటూ, మనుషులు ఎట్లా ఉండాలో గొప్ప ప్రేమతో ఆవిష్కరిస్తు న్నాడు. ఈమధ్య కొన్ని కవితల్ని సుదీర్ఘంగా రాశాడు. కథ చెప్పినట్టే కవిత్వం చెబుతున్నాడు. తక్కెడ బాట్లు, నిప్పుల గుండం మధ్యన, మరియమ్ములు మీరే చూపుడువేలు పాఠం కావాలి, గత్తువాసన, కుస్తీ ఇట్లాంటి కవితలు ద్వారా గోపాల్ మరింత విశాలమయ్యాడు. తన అమ్మను కోల్పోయాక రాసిన ఎల్లమ్మ పదాలు, బుద్ధ గీతం మనల్ని పట్టి కుదుపుతాయి.

నాగరాజు మొదటి కవిత సంపుట్లోనే అనేక కవితల్లో ముగింపులు పోరాటం వైపు సాగమంటాయి. ఏ అడివైనా చేతులు ముడుచు కుంటాదా, ఇంటినిండా కొరముట్లున్నాయి పారలు, పలుగులు, మడకలు, కొడవళ్ళు, శానా శానా, అతికించడం తెంపడము చేతనైన చేతులు దేనినైనా తెంపకుండా ఎలా ఉంటాయి, ఇట్లా కొన్ని ఉదాహరణలు చూపించవచ్చు.

**"ఇంతకు నేనెప్పుడూ పుట్టాను రిజిస్టర్లో పేరు ఎక్కించిన**
**మా పెద్దబడి పరమేశ్వర సార్ని అడిగిన**
**అక్షరాన్ని ఆవు దూడలాగా**
**వాకిట్లో కట్టేసుకున్నప్పుడు**
**నేను నిజంగా పుట్టానట**
**అమ్మ పాలు తాగి పెరిగినోడైతే**
**నాలుగు అన్నం మెతుకులు రాల్చిపోవు గాని**
**ఆవు మూత్రం తాగి పెరిగినోడు**
**మనిషి ముఖం మీద ఉచ్చగాక ఇంకేం బోస్తడు?"** ఇట్లాంటి ముగింపులు గోపాల్ రాస్తాడు.

**ఉప సంహారం :** నాగరాజు కవిత్వంలో ఆవేశంతో కూడిన ఆలోచన ఉంటుంది. గోపాల్ కవిత్వంలో ఆవేదనతో కూడిన ఆలోచన ఉంటుంది. గోపాల్ తన చుట్టూ ఉండే మనుషుల చుట్టూ, జీవితం చుట్టూ అమ్మ కొంగు పట్టుకుని పిల్లాడు తిరిగినట్టు తిరుగుతాడు. నాగరాజులో దుఃఖం వ్యంగ్యంగా మారుతుంది. గోపాల్ దుఃఖాన్ని , కరుణతో నింపేస్తాడు.

**ఆధార గ్రంధాలు :**

1. యాలై పూడ్సింది– పల్లెపట్టు నాగరాజు
2 . నీలి కళ్ళ నేల–పల్లెపట్టు నాగరాజు
3. దండ కడియం– తగుళ్ల గోపాల్

❖ ❖ ❖ ❖ ❖

# మానవత్వము

**పసుపులేటి నరసింహారావు, ఫోన్ : 8073060698**

తెలిసినంత రాసి తెలియజేసెదనండి
అర్థ శతకమొకటి అంద జేస్తు
చదువులమ్మ తల్లి చల్లగా దీవించ
మానవత్వ విలువ మనివి జేతు.

కిందపడిన వాని కించపరచకండి
పైకి లేవనెత్త వాని నెపుడు
చేయి చాపినంత చేయూత నిచ్చుటే
మానవత్వ మంద్రు మనుజు లార!

వెనుకబడిన వాని వెక్కిరించగ నుండి
వెన్ను తట్టి వాని వెనుక నిలిచి
ముందు నడచునటుల ఆదరించుటయేను
మానవత్వ మంద్రు మనుజు లార!

ఆటలాడునపుడు అపజయము కలుగ
గేలి చేయకుండి గెలవకున్న
ఓడినట్టి వాని ఓదార్చు చుండుటే
మానవత్వ మంద్రు మనుజు లార!

కలిమి కలుగ, పాత చెలులను వదిలేసి
కొత్తవారి తోడ కులక కుండి
చిన్న నాటి చెలుల చేయిపట్టి నడవ
మానవత్వ మంద్రు మనుజు లార!

చదువురాని వాని చవట యనక నుండి
పనికి రావు యనుచు వదలకుండి
వానికున్న నేర్పు వాడుకొనుట యేను
మానవత్వ మంద్రు మనుజు లార!

ఎచట కాలిడినను, ఏ దేశమేగినా,
మాతృభూమి నెపుడు మరవకుండి
అమ్మనేల నెపుడు, ఆదరించుట యేను
మానవత్వ మంద్రు మనుజు లార!

ఇతర భాషలన్ని ఎన్ని నేర్చిన గాని,
మాతృభాష నెపుడు మరచిపోక
తెలుగు భాషలోని తీపితనమును గ్రోల
మానవత్వ మంద్రు మనుజు లార!

చిన్నబుచ్చకుండి చిన్ననాటి గురువును
గురుతు పెట్టుకొనగ గురువు నెపుడు
గౌరవింప వాని గర్వపడు నటుల
మానవత్వ మంద్రు మనుజు లార!

# పురుడు నవల – సామాజిక, సాంస్కృతికాంశాలు

**రామా రత్నమాల,** సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ). హన్మకొండ.
ఫోన్ : 9885700062






**పరిచయం**

భూతం ముత్యాలు నల్గొండ జిల్లా దళిత జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకొని 2007లో వెలువరించిన నవల పురుడు. ఇది రచయిత రెండవ నవల. భూతం ముత్యాలు తను పుట్టి పెరిగిన కుటుంబంలో మరియు నల్గొండ జిల్లాలోని గ్రామాలలో దళిత సంస్కృతిని, సంప్రదాయాలను, మానవ సంబంధాలను 'పురుడు' నవలలో కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. దళారుల వల్ల దళితులు తక్కువ ధరకే వారి భూమిని అమ్ముకోవడం, దళితులు చదువుకోవడం, రిజర్వేషన్ల వల్ల రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం మొదలైన అంశాలు నవలలో కనిపిస్తాయి. వాస్తవిక సంఘటనలను ఇతివృత్తంగా చేసుకొని ఈ నవల రచించారు.

**ఇతివృత్తం**

రాములమ్మ, రాములు దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు లచ్చువమ్మ, కుమారుడు సత్తెం. ఈ నవలలో సత్తెం కథానాయకుడు. ఇతడు గుండ్లపల్లి నుండి పట్నం వెళ్లి చదువుకుంటాడు. నెలలు నిండిన లచ్చువమ్మ నీళ్లు తీసుకు రావడానికి బావి దగ్గరికి వెళ్లి నీళ్లు తోడుతూ బకెట్ అందుకోలేక బావిలో పడింది. ఇది చూసిన సాయమ్మ అరుపులతో చుట్టుపక్కల ఉన్నవాళ్లు అందరూ వచ్చి, బావిలోకి నిచ్చెన వేసి, గిరకకు తాడు బిగించారు. గౌండ్ల మొగిలయ్య బావిలోకి దిగి లచ్చువమ్మను బయటకు తీశాడు. మంత్రసాని లింగమ్మ వచ్చి చూస్తుంది. పురిటి నొప్పులు ఎక్కువైతాయి. పిండం అడ్డం తిరిగి తలకు బదులు కాళ్లు బయటకు వస్తే, లింగమ్మ కడుపులోని పసి గుడ్డును బయటకు లాగి తీస్తుంది. అంతా శుభ్రం చేసి, మైల బట్టలు మూటగట్టి, మల్లయ్య చెల్లెలు రాములమ్మ బావి కాడికి తీసుకుపోయి పాత గురిగి తీసి మాయి ముంతగా చేసి ఒక మూల ప్రదేశంలో పాతి పెట్టింది. అల్లుడు మల్లయ్య కబురు పంపగానే లచ్చువమ్మ తల్లి రాములమ్మ గుండ్లపల్లి నుండి వచ్చి, బిడ్డను తీసుకొని తన ఊరికి వెళ్ళింది.

పదకొండో రోజు వాళ్ల ఆనవాయితీ ప్రకారం పురుడు చేశారు. ఇరవై ఒకటవ రోజు కూడా ఘనంగా చేశారు. మల్లయ్యతో బిడ్డను మూడు నెలల సందున పంపిస్తానని చెప్పింది రాములమ్మ. మల్లయ్య భార్య లేకుంటే తనకేమీ తోచదని, ఇక్కడే ఉంటానని అంటాడు. ఇక్కడ ఉంటే అక్కడ తమ పొలం, చేను చెలక పనులు చూసేవారు లేరని మల్లయ్యకు నచ్చజెప్పి పంపిస్తుంది లచ్చువమ్మ.

కరువు వచ్చేసరికి మల్లయ్య తన అన్నను పొలాన్ని, చెలకను, పశువులను చూడమని చెప్పి అత్తగారింటికి వెళ్తాడు. గుండ్లపల్లిలో అందరు కోతలకు వెళ్తుంటే అత్త రాములమ్మ, బావమరిది సత్తెంలతో కలిసి వలిగొండ కాల్వ కిందికి పొలం కోతలకు వెళ్తాడు మల్లయ్య. కోతలు పూర్తయ్యాక జతకు పుట్టెడు వడ్లు తీసుకుని ఇంటికి చేరారు. ఇంటికి చేరాక రాములమ్మతో, మీ చిన్నాన్న కొడుకు నర్సింహ వచ్చాడని చెప్పాడు రాములు. మంచి రోజు చూసుకొని సత్తెం, తండ్రి రాములు కొత్తపల్లిలోని నరసింహ ఇంటికి వెళ్లి సుగుణను చూశారు. పిల్ల బాగానే ఉన్నా చదువు లేదని ఆలోచిస్తాడు సత్తెం. తల్లి, అక్క చెరో వైపు చెప్పి ఒప్పిస్తారు. చదువు పూర్తయ్యాకనే పెళ్లి చేసుకుంటా నంటాడు. తర్వాత సత్తెం ఇష్ట ప్రకారం షాదీఖానాలో సుగుణతో సంప్రదాయబద్ధంగా వివాహమయ్యాక భార్యను తీసుకొని పట్నంకు వెళ్ళిపోయాడు.

లచ్చువమ్మ, మల్లయ్యల కొడుకు జంగులు బడికి వెళ్తున్నాడు. భార్యాభర్తలిద్దరూ వర్షాలు పడితే వ్యవసాయం లేదంటే కూలో నాలో చేసుకుంటూ రాములు, రాములమ్మలకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. మల్లయ్య వారికి అల్లుడైనా తలలో నాలుకలా మెదులుతున్నాడు. నరసింహ తన భూమిలో బోరు మీద బోరు వేసి నీళ్లు పడక అప్పులపాలై దిగులుతో చనిపోతాడు.

పట్నం వెళ్లిన సత్తెం అప్పుల పాలై, పొలం అమ్మగా వచ్చిన డబ్బులన్నీ దుబారా ఖర్చు చేసి, ఏమీ తోచని స్థితిలో చాలా రోజుల తర్వాత ఊరికి వచ్చాడు. ఇంటికి వచ్చిన సత్తెంను అక్క లచ్చువమ్మ ఆప్యాయంగా పలకరిస్తుంది. గుండ్లపల్లిలో ఎలక్షన్ల సంబరం మొదలైంది. ఈసారి ఎస్సీలకు రిజర్వు అయింది. సత్తెం గ్రామ సర్పంచ్ కావాలని అనుకుంటాడు. ఎవరు పోటీ రాకుండా ఊరిలో

గ్రామ పెద్దల దగ్గరికి వెళ్లి మాట్లాడి ఊరి బాగుకోసం లక్ష రూపాయలు ఇవ్వగా సత్తెంను గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్తెం గ్రామపంచాయతీ జనరల్ బాడీమీటింగ్‌లో పాఠశాలకు ప్రహరీ గోడ, వంటగది, ఒక తరగతి గదిని మంజూరి చేయిస్తాడు. సత్తెంను ఊరంతా మెచ్చుకుంటారు. సుగుణ తండ్రి నరసింహ అప్పులపాలై చనిపోతే అప్పు ఇచ్చినవారు అతని ఇంటిని, భూమిని ఆక్రమించారు. పోలీసులు వచ్చి నర్సింహ బిడ్డ సుగుణకు రావలసిన భాగాన్ని ఇప్పిస్తే తీసుకొని సత్తెం, సుగుణలు ఇంటికి వస్తారు. వీళ్లను చూసిన లచ్చువమ్మ, మల్లయ్య, రాములు, రాములమ్మ సంతోషపడుతారు. ఇంతటితో నవల ముగుస్తుంది.

**పాత్ర చిత్రణ :** పురుడు నవలలో పాత్రలు లచ్చువమ్మ, మల్లయ్య, రాములు, రాములమ్మ, సత్తెం, సుగుణ, నరసింహ.

**సత్తెం :** ఈ నవలలో ప్రధాన పాత్ర సత్తెం. తన పరిధిలో ఏమి చేయగలడో అవన్నీ చేయగలిగినటువంటి పాత్ర సత్తెం. ఊహాజనిత శక్తులు గానీ, అతీంద్రియ శక్తులు గాని ఉన్న వ్యక్తిగా సత్తెం పాత్ర కనబడదు. మన చుట్టూ, మన మధ్య నిత్యం నివసించే సజీవ పాత్రగా సత్తెం పాత్ర మనకు కనబడుతుంది. ఒక గ్రామీణ యువకుడు చిన్న గ్రామ సర్పంచ్‌గా ఉంటే ఎటువంటి సాధక బాధకాలు ఉంటాయో తెలిపారు. ఏ అతిశయోక్తులకు పోకుండా ఉన్న పాత్ర సత్తెం. ఇలాంటివాళ్లు కోకొల్లలుగా కనబడుతుంటారు. దూరపు కొండలు నునుపు అని భావించి పట్టణానికి వెళ్లిన సత్తెం పరిస్థితులకు అతీతంగా కాకుండా పరిస్థితులకు లోబడిన వ్యక్తి. చదువుకునే రోజుల్లో ఎలాంటి సంకోచం లేకుండా తల్లిదండ్రులు మరియు బావతో కలిసి కూలి పనికి వెళ్లి కుటుంబ ఆర్థిక అభివృద్ధికి చేయూతనందించిన బాధ్యతాయుత వ్యక్తిగా, తల్లిదండ్రులు అక్క లచ్చువమ్మకు రెండు ఎకరాలు భూమిని రాసిచ్చినా గాని వ్యతిరేకించకుండా అక్కపై ప్రేమానురాగాలు చూపించిన వ్యక్తిగా, చొరవ, తెగువ, కార్యదక్షత, పట్టుదల గల నాయకునిగా సత్తెం పాత్రను చిత్రించాడు రచయిత.

**లచ్చువమ్మ :** పురుడు నవలలో ప్రధానమైన స్త్రీ పాత్ర లచ్చువమ్మ. ఈమె చాలా చురుకైనది, తెలివైనది. స్నేహితులకు ప్రాణప్రదమైనది. కలుపుగోలు అమ్మాయి. దిగువ మధ్యతరగతి కుటుంబాల్లోని స్త్రీలది పురుడు పోసుకునేవరకు కూడా పనిచేయవలసిన దీనస్థితి. కొడుకు జంగులు పుట్టాక లచ్చువమ్మ భర్త మల్లయ్యతో కలిసి పుట్టింటిలోనే ఉంటుంది. ఇద్దరు వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ ఉంటారు. తల్లిదండ్రులను లచ్చువమ్మ ప్రేమగా చూసుకుంటుంది. ఈమెకు తమ్ముడు అంటే కూడా వల్లమాలిన అభిమానం.

లచ్చువమ్మ తమ్ముడు సత్తెం దగ్గరికి వచ్చి పక్కన కూర్చొని **"ఔను తమ్మీ, కాలేజీకి పోతున్నావా, చదువు బాగా చదువుతున్నావా ఏమోరయ్యా నువ్వు ఒక్కనివన్నా మనిండ్లల్ల కాలేజీకి పోతున్నవ్‌గని అయ్య పేరు నిలబెట్టాలి. అమ్మ నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకుందో ఆళ్ల ఆశలన్నీ నువ్వు దీర్చాలి. నాకు తెలివొచ్చిన సంది సుత అమ్మ అయ్య ఇరాం లేకుండ రెక్కలు ధారబోసి సాకుతుండ్రు. నువన్న రాత పూతలల్ల బడ్డవ్. ఆళ్ల గిన్నేండ్ల శరలు నువ్ దీర్చాలే. ఆళ్లను జర నువ్వే సుఖ పెట్టాలే... ఆళ్ళు మట్కు ఎన్నొద్దులని గీ గొడ్డు కష్టం చేస్తరు. జర బాగ సదువు తమ్మీ"** (పురుడు నవల పుట:15) అనే మాటలు తమ్ముడు బాగా చదువుకోవాలనే లచ్చువమ్మ ఆకాంక్షను, తమ దళిత కుటుంబాలలో తన తమ్ముడు సత్తెం ఒక్కడే చదువుకుంటున్నాడనే గర్వాన్ని, సంతోషాన్ని, తండ్రి పేరు నిలబెట్టాలని, అమ్మ ఆశలను నెరవేర్చాలనే తపనను వ్యక్తం చేస్తున్నాయి. అమ్మానాన్నలు రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడుతున్నారు. భవిష్యత్తులో కుటుంబ బాధ్యతలను తమ్ముడు తీసుకొని వారిని సుఖపెట్టాలంటే చదువు ఒక్కటే మార్గమని దానితోనే మార్పు సాధ్యమనే సందేశాన్ని ఇస్తుంది. కుటుంబ సభ్యులకు ప్రేమ, ఆప్యాయతలను పంచి, మద్దతును అందించి, కుటుంబ సంబంధాలకు ప్రాధాన్యతనిచ్చి, వాటి బలోపేతంకై కృషి చేసే గొప్ప వ్యక్తిత్వం ఉన్న స్త్రీగా లచ్చువమ్మ పాత్రను భూతం ముత్యాలు చిత్రించారు.

**రాములమ్మ :** సమకాలీన దళిత కుటుంబాలలో సగటు స్త్రీకి నిలువెత్తు రూపం రాములమ్మ. నిరక్షరాస్యురాలైన పేద స్త్రీ అయినప్పటికీ కుటుంబ పోషణను నడిపించడంలో ముందున్న స్త్రీ రాములమ్మ. హావ భావంలో గానీ, ఆహార్యంలో గానీ, మాట తీరులో గానీ ఆలోచనలో గానీ, ఆ పాత్ర చలన పాత్రకు సజీవ చిత్రంగా కనబడుతుంది. కొడుకు విషయంలో కానీ, కూతురు విషయంలో గానీ, సమాజ విషయంలో గానీ తన పరిధిలో ఉన్న ఏ విషయమైనా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంది. కులంలో పేద కావచ్చు గానీ, గుణంలో పేద కాదు. ఆర్థికంగా స్థితిమంతురాలు కాకపోయినప్పటికీ మానసికంగా ఉన్నతమైన భావజాలం కలిగిన పాత్ర రాములమ్మ. కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడానికి తన వంతు కృషి చేసిన రాములమ్మ శ్రామిక స్త్రీ శక్తికి ప్రతీక అని చెప్పవచ్చు.

**పురుడు నవల – విశ్లేషణ :** భూతం ముత్యాలు పురుడు నవల అనేక అంశాల సమ్మేళనంగా కనిపిస్తుంది. నవలలో సందర్భానుకూలంగా ఆయా అంశాలను, పాత్రల సంభాషణల ద్వారా వివరించారు. ఈ నవలలో సామాజిక అంశాలు, సాంస్కృతిక అంశాలు, రాజకీయ అంశాలు, భాషా విశేషాలు మొదలైన అనేకాంశాలు దర్శనమిస్తాయి. ఒక్కో సందర్భంలో రెండు మూడు అంశాలు కూడా ఒకేసారి కనిపిస్తాయి. సందర్భానుకూలంగా రచయిత లేవనెత్తిన సంఘటనలు సూటిగా సమాజాన్ని ప్రశ్నిస్తున్నట్టు, హెచ్చరిస్తున్నట్టు, హితబోధ చేస్తున్నట్టు కనిపిస్తాయి. ఆయా

అంశాలను సమగ్రంగా విశ్లేషించడం ద్వారా భూతం ముత్యాలు పురుడు నవలలో ఔచిత్యం అంచనా వేయవచ్చు.

పురుడు నవల గత 30 సంవత్సరాల క్రిందటి కాలం వాస్తవిక సంఘటనల ఆధారంగా చిత్రించబడింది. ఆ రోజుల్లో మంత్రసానులు వచ్చి కాన్పు చేసేవారు. ఈ నవలలో కూడా లచ్చువమ్మ ప్రసవం కోసం మంత్రసాని లింగమ్మను పిలుస్తారు. ఇందులో బాలింత పాటించవలసిన ఆహార నియమాలు, జాగ్రత్తలు ఉంటాయి. స్త్రీలను ప్రసవం కోసం పుట్టింటికి తీసుకెళ్లే సాంప్రదాయాన్ని, కూలి పని, బండ పని, బేగరి పని చేసే దళితుల దయనీయ స్థితిని వివరించారు రచయిత. మాల మాదిగలు గొడ్డును కోసి, పోగులు వేయడం, ఆ పోగులను అమ్మడం, పచ్చి మాంసం వండడమే కాకుండా తునకలను ఎండబెట్టి వాటిని కూరగా వండడం వల్ల వారు గొడ్డు మాంసం తింటారనే విషయాన్ని రచయిత తెలిపారు.

**సామాజికాంశాలు :** 'పురుడు' నవలలో భూమి సమస్య, నీటి సమస్య, మానవ సంబంధాలు, సమకాలీన సమాజ పోకడలు మొదలైన అంశాలు కనబడతాయి

**భూమి సమస్య :** భూమి అనేది కేవలం వ్యవసాయ ఆధారమే కాక, కుటుంబ గౌరవం, కులాధిపత్యం, వారసత్వ పోరాటాలకు ప్రతీకగా నిలుస్తుంది. కరువు మొదలైందని తమ ఊర్లో ఉన్న భూమిని అమ్ముకొని అత్తగారి ఊరైన గుండ్లపల్లిలోనే ఉందామని భార్య లచ్చువమ్మతో మల్లయ్య అంటాడు. ఈ విషయం విన్న మామ రాములు తనకున్న 10 ఎకరాల భూమిలో రెండు ఎకరాలు ఇస్తానని అంటాడు. తమ్ముడు సత్తెం కూడా ఒప్పుకుంటాడు. పెళ్ళయ్యాక పట్టణానికి వెళ్లి అప్పుల పాలైన సత్తెం ప్రభుత్వం వారు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డులో భూములు పోతున్నవారికి లక్షలు కోట్లు ఇస్తున్నారని తెలిసి ఊరికి వస్తాడు. సత్తెం ఆర్థిక ఇబ్బందుల్లో పడేసరికి అక్కకి ఇచ్చిన భూమిని తీసుకొని అమ్ముకోవాలనుకుంటాడు. మనిషి ఎంత మంచివాడైనా ఆర్థిక పరిస్థితులు మనిషి ఆలోచనా విధానంలో మార్పును తీసుకొస్తాయనడానికి నిదర్శనం సత్తెం. పంచాయతీ వరకు వెళ్లిన వీరి భూమి సమస్య గ్రామ పెద్దలు భూమిని సత్తెంకు, లచ్చువమ్మకు సమాన వాటాలుగా పంచడంతో తీరుతుంది. **"ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణీకరణ నగరీకరణతో వ్యాపార సంస్కృతి ప్రతి పల్లెకు విస్తరించింది. ఫలితంగా భూమిని కన్నతల్లిగా భావించే రైతులు అప్పుల ఊబిలో నుండి బయటపడడానికి తాము ఇంతవరకు సేద్యం చేస్తూ వచ్చిన భూముల్ని కోల్పోవాల్సి వచ్చింది. సాగునీరు అందక భూముల్ని బీడు పెట్టాల్సి రావడంతో ఆక్రమణ మొదలైంది. ఫలితంగా తెలంగాణలో బడా వ్యాపారులు భూమిపై పెట్టుబడి పెట్టి అక్రమంగానో, సక్రమంగానో భూముల్ని అధీనంలోకి తెచ్చుకుని భూమిపై ధరలు పెంచి అమ్ముకుని లాభాలార్జించడం జరిగింది. ఈ పరిణామాన్నే రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటున్నాం".** (తెలంగాణ కథ – పరామర్శ డా. బన్న అయిలయ్య పుట: 97)

సత్తెం తనకొచ్చిన 5 ఎకరాల భూమిని ఎకరానికి రెండు లక్షల చొప్పున 10 లక్షలకు అమ్ముకుంటే. కొన్న వ్యక్తి రెట్టింపు ధరకు అమ్ముకుంటాడు. సత్తెం భూమిని అమ్మినందుకు బాధపడుతాడు. ఈ విధంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణ జీవనానికి ఆకర్షితులై, డబ్బు సంపాదించాలనే ఆశతో రియల్టర్ల వలలో పడి భూమిని కోల్పోయి అవస్థల పాలు కావడం ఈ నవలలో చూడవచ్చు.

**నీటి సమస్య :** చెరువే తెలంగాణ ఆదరువు. ఊరుమ్మడి బతుకుదెరువు. తెలంగాణలో వ్యవసాయం పూర్తిగా కాలువలు, చెరువులపైనే ఆధారపడి ఉండేది. సమృద్ధిగా వర్షాలు కురిసినా, చెరువులు ఎండి, పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొన్నది. ఉమ్మడి పాలన నాటి గడ్డు పరిస్థితులను నేడు తెలంగాణ ఎదుర్కొంటున్నది. సాగునీటి వసతి లేనప్పుడు భూగర్భ జల వనరులను వినియోగించు కొనుటకు గొట్టపు బావులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. భూగర్భ జల వనరులు కూడా తగ్గడంతో భూమి విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. రైతులు అప్పుల పాలై బోరు బావులు చెడిపోయి, పంటలకు నీరు అందక రైతు పరిస్థితి దిగజారిపోయింది. గ్రామాల్లో దళితులకు కొంత వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ, అక్కడ చెరువులు, కాలువలు లేక గొట్టపు బావులు వేసే పరిస్థితి లేక రైతులు భూమిని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సత్తెం మామ నరసింహ తన భూమిలో గొట్టపు బావులు వేసి నీరు పడక భూమిని అమ్ముకున్న విషయం ఈ నవలలో గమనించవచ్చు. ఇది నల్గొండ ప్రాంతంలోని పేద రైతు పరిస్థితికి అద్దం పడుతుంది. పట్టణాలకు వెళ్ళిన దొరలు భూములు కొని అక్కడ రింగ్‌రోడ్డు రావడంతో వారి భూములకు రెక్కలొచ్చి కోటీశ్వరులైనారు. అదే గ్రామాల్లోని రైతులు సాగునీటి వసతి లేక ఉన్న భూములు అమ్ముకొని ఆత్మహత్యలు చేసుకునే దుస్థితిలోకి నెట్టివేయబడ్డారు.

మనిషి జీవించడానికి ఆహారం ఎంత అవసరమో, నీరు కూడా అంతే అవసరం. ఆహారం లేకుండా కొన్ని వారాల వరకు ఉండ గలదు. కానీ నీరు లేకుండా మానవుడు కొన్ని రోజులు మాత్రమే జీవించగలడు. జీవనానికి ఆహారంతో పాటు నీరు కూడా ఒక ప్రాథమిక అవసరం. కానీ దళితులు మాత్రం కుల వివక్షతో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆధిపత్య కులాలవారు దళితులను నీటి వనరుల నుండి దూరం చేయడం వంటి సంఘటనలు కూడా జరుగుతున్నాయి. నీరు ప్రకృతి వనరు అయినప్పటికీ దళితుల విషయంలో నీటి లభ్యత ఒక తీవ్రమైన సమస్య.

**"పారేటి కిష్టమ్మ పక్కంగ పోతున్న**
**సుక్క జారదాయే బుక్క తడవదాయే**
**బావులెండిపాయే బోర్లు పీక్కపాయె**

**సవట భూములై చేలు చిన్నవాయె**

**దేశంలో నా జిల్ల ఫ్లోరిన్ గద్దరా**

**ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి కెక్కెరా**

**పండ్లు సూడబోతె గొగ్గిపండ్లాయే**

**కాళ్లు చూడబోతే వంకర్లు తిరిగెరా"** (పుట:84,85)

ఈ నవలా రచయిత నల్గొండ ప్రాంతానికి చెందిన వాడు కావడం వల్ల నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యను, త్రాగు, సాగు నీటి యొక్క ఆవశ్యకతను కళాకారుడైన యాదగిరి పాత్ర ద్వారా తెలియజేశాడు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ అధికంగా ఉండే భూగర్భజలాల ద్వారా ప్రజలు ఫ్లోరోసిస్ సమస్యను ఎదుర్కొన్నారు, దీనివల్ల దంత మరియు ఎముకల సమస్యలు ఏర్పడ్డాయి. ఈ సమస్య 1937లోనే గుర్తించబడింది, వేలాదిమంది ప్రజలు వికలాంగులుగా మారారు. నల్గొండ జిల్లా పక్కనే ప్రవహించే కృష్ణా నది సాగునీరు, తాగునీరు అందివ్వలేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**సాంస్కృతికాంశాలు :** ఒక సమాజం యొక్క జీవన విధానం, ఆచారాలు, నమ్మకాలు, కళలు, జ్ఞానం, నైతికత, చట్టాలు, ప్రమాణాలు, మరియు వస్తువులు కలిసి సంస్కృతి అవుతుంది. కాత్యాయని విద్మహే అన్నట్లు **"సంస్కృతి అంటే సమాజంలోని మానవ సంబంధాలకు మూలమైన సంపద యొక్క ఉత్పత్తినీ, దాని వినిమయ పద్ధతినీ ప్రతిఫలించే భావజాలం. మతం, నీతి, తత్వశాస్త్రం, సైన్స్, రాజకీయాలు అన్ని ఇందులో భాగంగా అభివృద్ధి చెందినవే. సంస్కృతి విలువలకు సంబంధించిన అంశం."** (విమర్శిని 18, సం. అనుమాండ్ల భూమయ్య పుట: 32)

**దళిత సంస్కృతి :** సంస్కృతి అంటే హీన స్థితి నుండి ఉత్తమ స్థాయికి చేరుకోవడానికి ఒక జాతి చేసే ప్రయత్నం అని కూడా చెప్పవచ్చు. దళిత సంస్కృతి శతాబ్దాలుగా దళితుల జీవన విధానంలో, వారి శ్రమలో, వారి ఉత్సవాలలో, వారి ఆచారాలలో, వారి పోరాటాలలో ఆవిష్కృతమై ఉంది. వారి జీవన విధానం, సంప్రదాయాలు, పాటలు, జానపద కళలు అన్నీ వారి సామాజిక అనుభవాల ప్రతిబింబం. పల్లెలలో దళితులు వ్యవసాయం, తోలు వృత్తులు, కూలి పనులు, వృత్తి ఆధారిత శ్రమలతో జీవనం గడిపారు. వీరి వృత్తులు, సామాజిక స్థితి వలన వారిలో ప్రత్యేకమైన సంస్కృతి, భాష, ఆచారాలు ఏర్పడ్డాయి. దళిత సంస్కృతిలో గ్రామ దేవతల పూజకు ప్రాముఖ్యం ఉంది. పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, పోతరాజు వంటి గ్రామదేవతలను వీరు పూజించేవారు.

**మొక్కులు - దేవతలు :** 'పురుడు' నవలలో దళితుల ఆచారాలు, విశ్వాసాలు, మొక్కులను, దేవతలను రచయిత సందర్భోచితంగా ప్రస్తావించారు. **"జానపదులు వారి దేవతలను కులాచారం ప్రకారం కూడా ఆరాధిస్తారు. జంతు బలులు ఇవ్వటం, మాంసాహారాన్ని నైవేద్యంగా పెట్టడం, మద్యాన్ని ఆయా దేవతలకు ఆరబోయడం, ముడుపులు కట్టడం, తమకు ఇష్టమైన కాయనో, పండునో దేవుని కోసం విడిచిపెట్టడం మొదలైనవి జానపదులు ఆరాధించే విధానంలో కొన్ని విశేషాలు. ఉప్పలమ్మ, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ మొదలైన దేవతలకు సంబంధించిన ఆరాధనలు కొంత భిన్నంగా కనిపిస్తాయి. ఉదాహరణకు ఉప్పలమ్మ పండుగను ఇంటి వద్ద కాని, స్వంత వ్యవసాయ క్షేత్రంలో కాని జరుపుకుంటారు".** (తెలుగు కవుల ఇష్ట దేవతా స్తుతి - విశేషాలు, బి. రాములు, పుట 11,12)

**"ఎల్లమ్మ దేవత పల్లెను, ప్రజలను రక్షించుటయే గాక, సంతులేని వానికి సంతానమొసంగుననియు పల్లెవాసుల నమ్మకము. కండ్లకలక, చర్మవ్యాధులు, కడుపునొప్పి, జ్వరములు, రోగములు వచ్చినపుడు ఎల్లమ్మకు మ్రొక్కుకొని మ్రొక్కులు తీర్చుచుందురు. స్వప్నమందు గవ్వలు సర్పము కానవచ్చిన ఎల్లమ్మ కలలోనికి వచ్చినదని గ్రామస్థులు తలంచుచుందురు. గవ్వలు, సర్పము ఎల్లమ్మ దేవతకు ప్రతీకలుగా భావింపబడుచున్నవి."** (తెలుగు జానపద సాహిత్యము-పురాగాథలు, డా.రావి ప్రేమలత, పుట:192) తెలంగాణ ప్రాంతమున శ్రావణమాసంలో మంగళవారము ఎల్లమ్మను పూజించి ఉపవాసముందురు.

మల్లయ్య భార్య లచ్చువమ్మ కడుపులో పిండం అడ్డం తిరగడంతో ప్రసవం సుఖవంతంగా జరగాలని జంగిలి పీరీల దేవునికి మొక్కు కుంటాడు. సత్తెం సర్పంచ్ గా ఎన్నికైతే దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవతకు మొక్కుకుంటాడు. గెలిచాక ఒక మంగళవారం కుటుంబంతో సహా వెళ్లి మొక్కు తీర్చుకుంటాడు. ఈ విధంగా తెలంగాణ గ్రామీణ సమాజంలో దేవతల పైనున్న భక్తి విశ్వాసాలు, మొక్కులు తీర్చుకోవడానికి పుణ్యక్షేత్రాలను సందర్శించడం ఈ నవలలో కనబడుతుంది.

**పురుడు : "పురుడు అనే పదానికి శబ్ద రత్నాకరం ఇచ్చిన అర్థం జాతాశౌచము, జాతాశౌచన సమయము".**[5] (శబ్ద రత్నాకరము, బి. సీతారామాచార్యులు, పుట: 1005)

'పురుడు' అంటే **"బిడ్డ పుట్టిన పదకొండోరోజు జరిపే ఒక తంతు. తల్లీ పిల్లకు స్నానం చేయించి సాయంకాలం మంత్రసాని, మంగలి ఇద్దరు కలిసి ఈ తంతు నడిపిస్తారు. అన్నం వండి ముందు కుంభంపోసి కత్తికి వెల్లుల్లి రాసి కాటుక పట్టి ఆ కాటుకతో అన్నపు రాశికి బొట్లుపెట్టి ఆ రాశిని బిడ్డను ఎత్తుకున్న తల్లితో దాటిస్తారు. ఈ దినం దాటితే ఒక గండం దాటినట్లు"** (ఆంధ్రభారతి ఆన్లైన్ నిఘంటువు, నల్లగొండ జిల్లా మాండలిక పద కోశం, రవ్వా శ్రీహరి)

నామకరణ పద్ధతి ప్రతి కుటుంబంలో ఉంటుంది. నామకరణం అంటే కొత్తగా పుట్టిన బిడ్డకు పేరు పెట్టే ఒక సంస్కారం. దీనిని

నామకరణోత్సవం లేదా బారసాల అని కూడా అంటారు. ఇది వ్యక్తి గుర్తింపు కోసం ఏర్పరచుకున్న పద్ధతి. నేడు ఈ నామకరణ పద్ధతి మారిపోయి వర్ణవ్యవస్థ పేర్లను కూడా ఆపాదించుకున్నదని చెప్పవచ్చు.

ఈ నవలలో లచ్చువమ్మకు, మంత్రసాని లింగమ్మ పురుడు పోసే విధానాన్ని, తల్లికి, పిల్లవానికి స్నానం చేయించడం, మల్లయ్య చెల్లెలు మాయి ముంతను మూలకు పాతి పెట్టడం, దేవునికి మొక్కుకొని ముడుపు కట్టడం సహజంగా చిత్రించారు రచయిత. ముడుపు కట్టడం జానపదుల సంప్రదాయంలో భాగమైన ఒక భక్తి పద్ధతి అయినప్పటికీ దళితులలో కూడా ఈ సంప్రదాయాన్ని చూడవచ్చు. తొలి కాన్పు తల్లిగారింట్లోనే చేయడం ఆనవాయితీ. కాబట్టి లచ్చవమ్మ తల్లి రాములమ్మ బిడ్డను, మనుమన్ని తీసుకొని తన ఇంటికి తీసుకెళుంది. పదకొండవ రోజు పేరు పెట్టి, ఇరవై ఒక్క రోజు బంధువులను పిలిచి రెండు యాటలు, ఐదారు కుండల కల్లు తెచ్చి పురుడు ఘనంగా చేస్తారు రాములమ్మ, రాములు దంపతులు.

**వివాహం : "వివాహం అనే పదంలో 'వి' అనగా విశిష్టము, 'వాహం' అనగా పొందుట అని అర్థము"** (భారతీయ సంస్కృతిలో స్త్రీ – డా. కత్తి పద్మారావు, పుట: 160)

మానవ జీవితంలో పెళ్ళికి అత్యంత ప్రాధాన్యత ఉంది. షోడశ సంస్కారాలలో పెళ్లి లేదా వివాహం అనేది ఒకటి, ఇది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాకుండా, రెండు కుటుంబాల మధ్య బంధం మరియు భార్యాభర్తలు తమ ధర్మాన్ని నెరవేర్చుకుంటూ, సంతానాన్ని పొందుతూ ఆనందంగా జీవించేలా చేసే ఒక పవిత్రమైన, విడదీయరాని బంధంగా గుర్తింపబడుతుంది. **"వివాహ విధానాలు ఆయా కాలాల్లో ఆయా సామాజిక వ్యవస్థలలో వస్తున్న మార్పులను బట్టి రూపొందాయి."** (భారతీయ సంస్కృతిలో స్త్రీ – డా. కత్తి పద్మారావు, పుట: 160)

పెళ్లికి ముందు పల్లె ప్రాంతాల్లో గ్రామదేవతను పూజిస్తారు. 'పురుడు' నవలలో పిండమ్మకు పూదిచ్చి పిందార చేస్తారు. రాములమ్మ తన కొడుకు సత్తెంకు చిన్నాన్న కొడుకు నరసింహ కూతురు సుగుణతో పెళ్లి జరిపిస్తుంది. ఒకప్పుడు పెళ్లి వేడుక 16 రోజులు ఉండేది. సత్తెం పెళ్లి నాటికి కాల అనుగుణంగా తక్కువ రోజుల్లో పెళ్ళి జరగడం గమనించవచ్చు.

పురుడు నవల తెలంగాణలోని నల్గొండ దళిత మాండలిక భాషలో రచించారు. ఈ నవల రచయిత రచనా పటిమను, భాషా ప్రయోగ విధానాన్ని తెలుపుతుంది. రచయిత ప్రయోగించిన సామెతలు, జాతీయాలు ఆకట్టుకుంటాయి.

**ఆధార గ్రంథాలు**

1. ఆంధ్ర భారతి ఆన్లైన్ నిఘంటువు, 2025.

2. తెలుగు కవుల ఇష్టదేవతా స్తుతి – విశేషాలు, డా.బి రాములు, సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ, వరంగల్లు, ప్రథమ ముద్రణ 2023.

3. తెలుగు జానపద సాహిత్యం – పురాగాథలు, డా. రావి ప్రేమలత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2011.

4. తెలంగాణ – కథ పరామర్శ: డా. బన్న అయిలయ్య, నానీ ప్రచురణలు, హనుమకొండ, 2017.

5. భారతీయ సంస్కృతిలో స్త్రీ, డా. కత్తి పద్మారావు, లోకాయత ప్రచురణలు, 2018.

6. విమర్శిని 18, పుట:32, తెలుగు విభాగం కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్. సం. ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య, మార్చ్, 2006.

7. శబ్ద రత్నాకరం, బి. సీతారామాచార్యులు, ఎమెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, 2018.

❖ ❖ ❖ ❖ ❖

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

# 'గౌడన్న బతుకు చిత్రమే వంకతాడు' దీర్ఘ కవిత సమీక్ష

**డా. రవికుమార్ చేగొని,** ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం, హైదరాబాద్.

**వృత్తులు, కులాలు :** భారతీయ సమాజపు పునాది ప్రాచీన భారతదేశంలో, ప్రతి వ్యక్తి జీవనం అతడు చేసే వృత్తిపై ఆధారపడి ఉండేది. ఆ వృత్తిని బట్టే సమాజంలో అతడి స్థానం, గౌరవం నిర్ణయించబడేవి. వృత్తే ఒక వ్యక్తికి గుర్తింపునిచ్చేది. కాలక్రమేణా ఈ వృత్తులు కులాలుగా రూపాంతరం చెందాయి. కొన్ని కులాలకు ఆధిపత్యం లభించింది. అయినప్పటికీ, ఎంతోమంది తమ వృత్తిని కేవలం జీవనోపాధిగా కాకుండా, దైవంగా భావించి, అంకితభావంతో జీవించారు. గౌడ కులం, వారి వృత్తి కూడా ఈ కోవలోనిదే. తాటి, ఈత చెట్లపై ఆధారపడి జీవనం సాగించే గౌడ వృత్తి ఒక సంస్కృతిగా, జీవన విధానంగా కొనసాగుతోంది. ఈ సంప్రదాయ వృత్తికి సంబంధించిన కష్టాలు, సంతోషాలు, సవాళ్ళను అక్షరబద్ధం చేసిన విశిష్ట రచన డాక్టర్ తండా హరీష్‌గౌడ్ రచించిన 'వంకతాడు' అనే దీర్ఘకవిత. ఈ కవిత గౌడ జాతి అంతరంగాన్ని, వారి ఆత్మాభిమానాన్ని, సామాజిక పోరాటాన్ని కళ్ళ ముందు నిలుపుతుంది.

**గౌడ వృత్తి :** ఒక కవిత్వం, ఒక జీవితం కవిత్వం ఏదైనా అంశాన్ని అందంగా చెప్పగలదు, కానీ ఒక కుల వృత్తిలోని అంతర్గత బాధలు, సుఖాలు, సవాళ్ళను నిజాయితీగా చిత్రీకరించడం అంత సులభం కాదు. 'వంకతాడు' కవితలో హరీష్ గౌడ్ తన బాల్యం, కుటుంబ నేపథ్యం, వృత్తిపరమైన అనుభవాలను ప్రాతిపదికగా చేసుకుని, గౌడ వృత్తి జీవనాన్ని అక్షర రూపంలోకి మలిచాడు. ఇది కేవలం ఒక కవిత కాదు, ఇది ఒక సమాజపు జీవిత పత్రం. గౌడ అన్న రోజువారీ కష్టాలను, చెట్లపై నుంచి కల్లు తీసే శ్రమను, ఆ తర్వాత మండవలో ఆ కల్లును అమ్ముకునే క్రమాన్ని కవి ఎంతో ఆర్ద్రంగా వర్ణించాడు. **"నురగలు కక్కే ఆ తెల్లని నది / పటువలో పట్టుకొచ్చి / మండవ దగ్గర కుసున్నోళ్ళ మనసు గాయాలకు మందు పూస్తవు"** వంటి పదాలతో, కవి గౌడ వృత్తి కేవలం డబ్బు సంపాదనకు కాకుండా, ప్రజల కష్టాలను తీర్చే ఒక వైద్యంగా చూపాడు. ఈ విధంగా కవి గౌడ వృత్తికి ఒక దైవత్వపు ఆపాదించాడు.

**వృత్తి సంబంధాలు, సామాజిక అన్వయం :** గౌడ వృత్తి కేవలం గౌడ కులానికి మాత్రమే పరిమితం కాదు, అది అనేక ఇతర కులాలతో పెనవేసుకుని ఉంది. కుమ్మరి చేసిన కుండలు, కమ్మరి పదునుపెట్టిన కత్తులు లేకుంటే గౌడ అన్నకు తన వృత్తిని కొనసాగించడం సాధ్యం కాదు. ఈ పరస్పర ఆధారితత్వం ద్వారా, కవి వృత్తుల మధ్య సహకారాన్ని, సామాజిక సంబంధాలను వివరిస్తాడు. ఒకవైపు కుల వ్యవస్థలోని అసమానతలు, మరోవైపు వృత్తుల మధ్య సామరస్యం. ఈ ద్వంద్వాలను కవి లోతైన అంతర్దృష్టితో ఆవిష్కరించాడు. ఈ కవితలో రాజకీయ, సామాజిక విమర్శలు కూడా ఉన్నాయి. "ఓటు" వేసేటప్పుడు మాత్రమే గౌడ కులాన్ని గుర్తుంచుకునే రాజకీయ నాయకులను కవి తీవ్రంగా విమర్శిస్తాడు. **"తాడు మీదికెళ్ళిబడి / తాళ్లు ఎక్కి-ఎక్కి / నడుము వంగిపోయినా / ఏ పథకం వెలుగించదు"** వంటి పంక్తుల్లో, గౌడ అన్న పడే కష్టాలు చెప్పారు.

**ఆధునిక సవాళ్ళు, భవిష్యత్ దిశానిర్దేశం :** కాలం మారేకొద్దీ, గౌడ వృత్తి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ వ్యాపారాల కారణంగా తాటి వనాలు తగ్గిపోతున్నాయి. మద్యం షాపుల పెరుగుదలతో కల్లుకు డిమాండ్ తగ్గుతోంది. ఈ పరిణామాల వల్ల గౌడ అన్న జీవితం సంక్షోభంలో పడిందని కవి ఆవేదన వ్యక్తం చేస్తాడు. ఒకప్పుడు పవిత్రంగా భావించిన కల్లును వృత్తిని పక్కన పెట్టి, డబ్బు కోసం అడ్డదారుల్లో వెళ్తున్న వారిని చూసి, చెట్ల పట్ల భక్తి ఉన్న గౌడ అన్న పడే బాధను కవి వర్ణించాడు. **"కల్లును పారబోసుకొని, చెట్టు తల్లిని తల్చుకొని ఏడ్చిన గౌడ్ అన్న"** ఈ పంక్తుల్లో కవి కేవలం ఒక వృత్తిపరుడి బాధను మాత్రమే కాకుండా, ఒక సంస్కృతి మాయమవుతున్న వేదనను కూడా చూపించాడు. వృత్తిలో సాంకేతిక మార్పులు, చదువుల ప్రాధాన్యం పెరగడంతో యువత ఈ వృత్తిని కొనసాగించలేకపోతోంది. ల్యాప్‌టాప్‌లు, కొత్త ప్రోగ్రామ్‌ల వైపు చూస్తున్న యువతకు, తాతలనాటి వృత్తి ఒక సవాలుగా మారింది. ఈ ద్వంద్వాన్ని కవి కవితలో సమర్థవంతంగా చిత్రీకరించాడు.

**కవిత్వంలోని ప్రతీకలు, అంతరార్థం :** 'వంకతాడు' కేవలం ఒక వృత్తిని వర్ణించే కవిత మాత్రమే కాదు. ఈ పేరులోనే ఎన్నో అంతరార్థాలు దాగి ఉన్నాయి. "వంకతాడు" అంటే చెట్టు ఎక్కే తాడు. కానీ కవి దానిని గౌడ జీవితానికి, వారి కష్టాలకు ప్రతీకగా ఉపయోగించాడు. అది జీవన పోరాటాన్ని, ఒక తరం నుంచి మరొక తరానికి వృత్తిని కొనసాగించాల్సిన బాధ్యతను సూచిస్తుంది. తాటి చెట్టును దైవంగా పూజించడం, దానికి దండం పెట్టడం వంటి ఆచారాలను ప్రస్తావించడం ద్వారా కవి వృత్తికి, ఆధ్యాత్మికతకు మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టంగా తెలియజేస్తాడు. **"ముంజల దేశానికి రాజు"** లేదా **"మూడు కన్నుల చందమామ"** వంటి పదబంధాలతో కవి ఈ వృత్తికి ఒక ఉన్నత స్థానాన్ని, రాజసత్వాన్ని కల్పించాడు.

**ఒక సామాజిక ఉద్యమంగా 'వంకతాడు' :** మొత్తంగా, 20 కవితల సమాహారంగా ఉన్న 'వంకతాడు', గౌడ వృత్తిలో ఉన్న ప్రతి అంశాన్ని లోతుగా స్పృశించింది.. ఈ కవిత గౌడ కుల జీవిత చిత్రణను మాత్రమే కాకుండా, భారతదేశంలోని ఇతర కులవృత్తుల సంక్షేమం గురించి కూడా ఆలోచింపజేస్తుంది. 'వంకతాడు' కేవలం కవిత్వం కాదు, అది సమాజంలో మరుగున పడిపోతున్న వృత్తుల వైపు చూపుతూ, వాటి పునరుద్ధరణకు ఒక మేలుకొలుపు పిలుపుగా నిలిచింది. కవి హరీష్ గౌడ్ తన వంశపారంపర్యం, అనుభవం, ఆత్మాభిమానాన్ని ఈ కవితకు అంకితం చేశారు. అందుకే 'వంకతాడు' తెలుగు సాహిత్యానికి ఒక అద్భుతమైన చేర్పుగా నిలిచింది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1 (55) హైదరాబాద్ నవంబర్ : 2025

# దళిత కవిత్వానికి బలమైన చేర్పు

**డా. పసునూరి రవీందర్,** కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత. ఫోన్ : 7702 648 825




ఆధునిక దళిత కవిత్వం అర్థం కావాలంటే, ఇవాళ్టి దళితుల స్థితిగతులు అర్థం కావాలి. ఒకనాడు దళితుల మీద కొనసాగిన వివక్ష, అంటరానితనాల రూపం మారింది. కొనసాగింపు మాత్రం ఆగలేదు. అలాగే అది వ్యవస్థీకృతమైన హింసగా రూపాంతరం చెందుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ దళిత కవికైనా తన బాధను వ్యక్తం చేయడమే ప్రథమ కర్తవ్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలోనే దళితకవి **పి.కేశవ కుమార్ తన కవితా సంపుటి ఆదిమ పోరుడులో** ఇదే రకమైన భావనను వ్యక్తం చేశాడు. ఆధునికంగా దళితులు విద్యా, ఉద్యోగ ప్రదేశాలతో పాటు సమాజంలో సైతం నిత్యం కుల వివక్షలకు గురవుతున్నారు. ఈ రకమైన ఆధిపత్యాన్ని నిరసిస్తూ కవిత్వరూపంలో దానిని వ్యక్తం చేయడం అనేది సాహసమే. ఆ పనినే తన భుజానికి ఎత్తుకున్నాడు ఈ కవి. తాను 1980వ దశకం ఉత్తరార్థం నుండి దళిత పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న తీరు, వాటిపై స్పందిస్తున్న విధానం ఈ కవిత్వం నిండా పరుచుకుని ఉంది. కారంచేడు, చుండూరు వంటి మారణ హెూమాలు నేటికి జరగకపోయినా, వాటి స్థానంలో మరోరూపంలో ఈ కుల వివక్షత అనేది నిత్యం దళితుల మనసులను గాయపరుస్తూనే ఉంది.

**“కవిత్వం అంటే అక్షర తాండవం! ఒక అన్వేషణ. ఒక తీరని వేదన. కవిత్వంలో చెప్పేది ఏదైనా బలంగా ఉండాలి. నంగి నంగి మాటలు ఉండకూడదు. కవికి కీర్తి కాంక్ష అసలే ఉండొద్దు. ఇక ఈ క్షణంలో ఈ కవిత రాయకపోతే చచ్చిపోతాం అన్నంత ఆవేశం వస్తేగాని ఒక మంచి కవిత పుట్టదు. కవిత పాఠకుడిని కదిలించడానికి ముందు కవిని కదిలించగలగాలి. ఇలాంటి అనుభవం కేశవ కుమార్లో కనిపిస్తుంది. అందుకే అంత గొప్ప చలనమున్న ప్రయోగాత్మకమైన కవిత్వం రాశాడు”** అంటాడు ఈ పుస్తకానికి ముందుమాటలు రాసినవారిలో ఒకరైన ‘మనకాలం’ మాసపత్రిక సంపాదకుడు కత్తి కళ్యాణ్. సాధారణ వ్యక్తులకు, కవులకు ఒక తేడా ఉంది. తాము అనుభవించిన దాన్నిగానీ, తాము చూసినవి, విన్నవి ఆ తరువాత కాలంలో సాధారణ వ్యక్తులు మరిచిపోతారు. కవులు మాత్రం తమ మనసు మీదికి తీసుకుని దానిని అక్షరాల రూపంలో వ్యక్తం చేస్తారు. ఈ రకమైన వ్యక్తీకరణలో మరొక పార్శ్వం కూడా ఉంది. దళిత కవుల వ్యక్తీకరణకు, సాధారణ కవుల వ్యక్తీకరణకు కూడా తేడా ఉంది. దళితకవికి జీవితం జీవన్మరణ సమస్య. అలాంటి జీవితం నుండి విముక్తిని కోరుకుంటాడు. అందుకు తన కవిత్వాన్ని ఒక సాధనగా మలుచుకుంటాడు. సమాజంలో చర్చకు పెట్టాల్సిన విషయాలను ఎత్తిచూపుతాడు. ఈ సమయంలో తనకు మిత్రులే కాదు, శత్రువులు కూడా ఏర్పడతారు. తాను పెట్టిన ఘాటైన విమర్శను తనలాంటి దళితులు స్వీకరిస్తారు. అదే ఆధిపత్యకులాలకు చెందినవారిలో కొందరు నొచ్చుకుంటారు. ఈ కవిత్వాన్ని సునాయాసంగా వ్యతిరేకిస్తారు. లేదా విస్మరిస్తారు. పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తారు. అయినా సరే దళితకవిగా తన బాధ్యతను మరిచిపోకుండా నెరవేర్చాడు కవి కేశవ కుమార్. ఇందులో తన కార్యక్షేత్ర ప్రభావం ఉంది. తాను ఎక్కడ ఉంటే అక్కడ స్పందించడమే తనకు తెలిసిన మొదటి పని. అందుకే కారంచేడు దగ్గరి నుండి రోహిత్ వేముల ఘటన దాకా తన పోయెట్రీకి క్యాన్వాస్గా మారింది. అలాగని మూస ధోరణిలో కేవలం కులం తాలూకు ప్రతిఫలనాలు మాత్రమే ఈ **‘ఆదిమ పోరుడు’**లో లేవు. అనేక సామాజిక సందర్భాలను కవిగా తాను ఒడిసి పట్టుకున్నతీరు ఏ పాఠకుడినైనా ఆకట్టుకుంటుంది. ఆలోచింపజేస్తుంది. అలాంటి సజీవమయమైన కవిత్వం ఇందులో ఒదిగి ఉంది.

ఉద్యమ సందర్భాలను కవిత్వంగా మలచడం అందరి వల్ల కాదు. అందుకే ఉద్యమ కవిత్వం నినాదప్రాయం అనే మాట కూడా ఉంది. ఈ కవి మాత్రం తన భావాన్ని చక్కని ప్రకృతి పోలికలతో, తాత్విక గాఢతతో వ్యక్తం చేశాడు. తెలుగు శాఖలలో తెలుగు కవిత్వాన్ని చదువుకున్న కవి కాదు. తాను ఫిలాసఫీ ఆచార్యునిగా పని చేస్తున్నప్పటికీ చక్కని తెలుగులో తన భావాలను వ్యక్తం చేశాడు. అదే ఈ కవిత్వానికి ఉన్న వైవిధ్యం. 1990వ దశాకాన్ని కుదిపేసిన దళిత కవిత్వ ఉద్యమ ఉధృతిలో తన వంతు భాగస్వామ్యం కలిగిన కవి కేశవ కుమార్. అందుకే తాను ఆగిపోలేదు. ఆ తరువాత కూడా తాను అలసిపోలేదు. అందుకు కారణం దళితుల మీద కొనసాగుతున్న హింస. ఆ హింసకు వ్యతిరేకంగా తన కవిత్వ గొంతుకను విచ్చిమోశాడు ఈ కవి.

**“ఊర్లు మారుతుంటాయి**
**బాధితుల పేర్లు మారినట్టు**
**మాలో మాదిగో మహరో చెమారో**
**కోటేశో కారంచేడో ఇళవరసనో**
**కీళ్వేన్మనో**

**హత్రాసో ప్రణయో జజ్జరో టేకు లక్ష్మీ**
**ఈ దేశమంతా**
**అదే అత్యాచార ఆచారం**
**హతుడు ఎప్పుడూ ఒక్కడే**
**హంతకుడు కూడా అనాదిగా ఒక్కడే**
**వాడి పేరేదైతేనేం**
**అదే కుల క్రౌర్యం"(నా పేరే రేపటి పోరురా!")** (పుట. సంఖ్య124)

అంటూ మారుతున్న దేశంలో మారని కులజాఢ్యాన్ని కవిత్వం నిండా ప్రకటిస్తాడు ఈ కవి. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో తెలుగు సమాజంలోనే కాదు యావత్ దేశమంతటా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ పరిస్థితుల మీద కవిత్వ తిరుగుబాటు జెండాను ఎగరేస్తున్నాడు.

విశ్వవిద్యాలయాలు సైతం వివక్షతల కేంద్రాలుగా మారిన తీరును ఈ కవి నిరసిస్తున్నాడు. తాను చదువుల్లోకి వచ్చిన నేపథ్యాన్ని తలుచుకుని వలపోస్తున్నాడు. కులాన్ని పట్టుకుని వ్రేళాడే ఛాందసత్వాలను నిరసిస్తున్నాడు. హైదరాబాద్ సెంట్రల్యూనివర్సిటీ వంటి ఉన్నతస్థాయి విశ్వవిద్యాలయాల్లో సైతం సునీత వంటి విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆధిపత్య కులాలకు చెందిన ఆచార్యుల ఫలితంగా సెంథిల్, బాలరాజు, పుల్యాల రాజు, రోహిత్ వేముల వంటి ఎందరో నేలరాలిపోయారు. వారందరి జీవితాలు తెలిసిన ఆ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా ఈ కవి, దళిత విద్యార్థుల గొంతుకగా నిలిచాడు. మేధావుల గడ్డగా వర్ధిల్లాల్సిన విశ్వవిద్యాలయాలు ఈ ఆధునిక కాలాన కూడా ఇలాంటి పూర్వ సమాజపు తిరోగమన లక్షణాలతో కొట్టుమిట్టాడుతుండడాన్ని ఈ కవి వ్యతిరేకిస్తున్నాడు. అందుకు ఉదాహరణే ఈ కవితా సంపుటిలోని మొదటి కవిత **"ఆ పిల్ల ఈ ప్రపంచాన్ని తన్ని ఎటో వెళ్లిపోయింది".**

**"సునీతా...ఓ నా ప్రియమైన సునీతా**
**మా ఆనందాల్ని, కలల ప్రపంచపు దొల్లను**
**నువ్వు భయంకరంగా త్రీడీలో చూసి జారుకొన్నావు**
**ఇప్పుడు మేం**
**ఒకరి కళ్లలోకి ఒకరం అనుమానంగా చూసుకుంటున్నాం**
**ఒకరి ఆలోచనల్లోకి ఒకరం మైక్రోస్కోప్లో చూసి**
**కోరలు ఉన్నాయేమోనని వెతుకుతున్నాం**
**హఠాత్తుగా జీవితం అంటే భీతిల్లిపోయి**
**'ప్రేమ'కు రక్తం అంటుకున్న విధ్వంసాన్ని చూసి**
**భయం భయంగా బతుకుతున్నాం"**(పుట. సంఖ్య. 31)అంటాడు.

ఇదే కవితను మరో దళితేతర కవి రాసి ఉంటే అందులో ఇంత దు:ఖం వ్యక్తం కాదు. అది కేవలం సహానుభూతి మాత్రమే అవుతుంది. కానీ, ఇక్కడ కవి స్వయంగా దళితుడు కావడం వల్ల సునీత అన్యాయపు అకాల మరణం పట్ల ఒక సహానుభూతిని వ్యక్తం చేశాడు. ఈ దేశంలో చదువుకే కాదు, ప్రేమకు కూడా కుల ముందనే చేదునిజాన్ని అంతే పచ్చిపచ్చిగా కవిత్వీకరించాడు కవి.

ఈ పుస్తకానికి ముందుమాట రాసిన పోస్ట్మాడర్నిస్ట్ విమర్శకుడు బి.తిరుపతిరావు ఒక మంచి పరిశీలన చేశారు. **"భారతదేశంలో కులం అనేక అనుభవాల స్వభావాన్ని లోతుగా ప్రభావితం చేస్తూ, బాల్యం నుండి వృద్ధాప్యం వరకు దళితుల జీవితాన్ని నిర్వచిస్తుంది. నిర్దేశిస్తుంది. వృత్తిపరమైన జీవితంలోనూ కులం వెంటాడుతుంది. అందువల్ల దళిత జీవితం, దాన్ని ఆశ్రయించి ఉండే అనుభవం అత్యంత నిర్దిష్టం. ప్రతీది కుల దృష్టికోణాన్ని ప్రతిఫలిస్తుంది. దళిత కవులు జీవితంలోని వివిధ దశలను, అనుభవాలను పరిశీలిస్తూ, తమ రచనలలో ఈ కుల ఆధారిత వాస్తవికతను ప్రతిఫలిస్తారు"** (పుట.సంఖ్య. 8) అంటారు. సరిగ్గా తిరుపతిరావు అన్నట్టే ప్రతీ జీవన సందర్భంలో సైతం కులం దళితులను వెంటాడే తీరును కవి కేశవకుమార్ అద్భుతంగా వ్యక్తీకరించారు.

**"వోర్నీ యబ్బ!**
**ఎన్ని అబద్ధాలు పోగుచేసి**
**ఈ చరిత్ర పుస్తకాల్ని కుట్టేరురా**
**లైబ్రరీల్లో పేర్చిన ఈ పుస్తకాలన్నీ**
**ప్యాక్ చేసి**
**పీకాక్ లేక్లోకి పారేయాల్సిందే!"**(పుట. సంఖ్య. 42)అంటాడు.

చరిత్ర పొడుగున జరిగిన వక్రీకరణల పట్ల ఈ కవి తన నిరసనను ఈ విధంగా వ్యక్తం చేస్తున్నాడు. ముఖ్యంగా అకాడమిక్స్లో నెలకొన్న ద్వంద్వ విలువల పట్ల ఒక ధర్మాగ్రహం ఈ కవిలో ఉందనే విషయం ఈ కవిత్వం చదివిన ఎవరికైనా సులభంగానే అర్థమవుతుంది.

దళిత గాయకుల వలెనే దళిత కవుల్లో సైతం వర్గ స్పృహ ఒకటి నెలకొని ఉంది అనడానికి ఈ ఆదిమపొరుడులో పలు కవితలు సాక్ష్యంగా నిలుస్తాయి. ఇవాళ మల్టీనేషనల్ కంపెనీలు అడవుల మీద కన్నేశాయి. అక్కడ సహజ వనరులను దోచుకోవడానికి అడవులను ఖాళీ చేపిస్తూ ఆదివాసీ బిడ్డలను అక్కడినుండి వెళ్లగొడుతున్న తీరును ఈ కవి బహిరంగంగా ఖండిస్తున్నాడు. ఈ పరిణామాల వెనుక దాగిన అంతర్జాతీయ కుట్రలను తేటతెల్లం చేస్తున్నాడు.

**"సూపర్ మార్కెట్ కత్తి కాటుకి**
**బీళ్లయిపోయిన పంటపొలాలు**
**మల్టీనేషనల్ ప్రోజెక్ట్లు వేటకి**
**కుళ్లబొడిపోయిన అడవులు**

కరువు కలరా సోకి
ఎండిన డొక్కలైన పల్లెలు
కూలిపోయిన నమ్మకాలు
కాళ్లకింద కదిలిపోతున్న పౌరభూమి
ఊరిని పైరుని అడవిని దేశాన్ని
ఆవరించిన విషపు పురుగులీలలా
బహురూప భంగిమల్లో
రాజమాంత్రికుడి విపరీత దర్శనం”(ఇప్పుడు వీస్తున్న గాలి) (పుట.సంఖ్య92) అంటాడు.

అస్తిత్వవాద కవులకు తమ అస్తిత్వమే ప్రధానం అయినప్పటికీ తమ తోటి అస్తిత్వాల పట్ల ఒక బాధిత కన్సెర్న్ ఉండాలి. అదే ఈ కవిలో కూడా ఉంది. తోటి బాధిత సమూహమైన ఆదివాసీలు, ముస్లింల పట్ల కూడా తన కవితాక్షరాల మద్దతును ప్రకటించాడు. దేశంలో ఎన్ఆర్సీ వివాదం దుమారం రేపింది. ఎవరు ఈ దేశవాసులో తేలాలి అన్న చర్చ ముందుకు వచ్చింది. ఆ సమయంలో షాహిన్ బాగ్లో కొంతమంది ముస్లిం తల్లులు పెద్దెత్తున నిరసనను తెలియజేశారు. ఆ సందర్భంగా కూడా ఈ కవి తన అక్షరాల చేత మద్దతును ప్రకటించాడు. ఈ రకమైన స్పందన అన్ని అస్తిత్వాలలో చూడలేం. కొందరు కొన్ని విషయాలకే పరిమితం అవుతారు. కేశవ కుమార్ మాత్రం విశాల ప్రాపంచిక దృక్పథంతో ఈ సమాజాన్ని పరిశీలిస్తున్నాడు. బాధితుల పక్షాన నిలబడి గొంతు విప్పుతున్నాడు. అందుకే ఎక్కడ బాధితుల విషయం ముందుకు వచ్చినా తన వంతు మద్ధతును కవిత్వం ద్వారా తెలియజేస్తున్నాడు.

కేవలం అస్తిత్వ వాదాలకే కాదు అణగారిపోతున్న ప్రజలందరి వైపున గొంతు విప్పుతున్నాడు. ఢిల్లీలో రైతులు నల్లచట్టాలకు వ్యతిరేకంగా గళం విప్పారు. ఎన్నో నిరసనర ప్రదర్శనలు చేశారు. ఆ సందర్భంలో కూడా కవి నిజమైన ప్రజాస్వామిక వాదిగా వారికి మద్ధతుగా నిలిచాడు. అందుకే ఈ కవితల్లో ప్రజాస్వామ్యానికి నిర్వచనం చెప్పిన దీర్ఘకవిత కూడా ఒకటి ఉంది.

“ప్రజాస్వామ్యమంటే
మెజారిటీ మతమోడో, కులమోడో
ఒంటరివాడిపైనో, మైనారిటీవాణ్ణి చేసో
చెలాయించే రాజకీయ కుట్ర కాదు
బలహీనుడు కూడా బలవంతుడికి
లొంగని ప్రజా ప్రణాళిక
బానిసలూ అధికారం అందుకునే న్యాయ సూత్రం
ప్రజాస్వామ్యమంటే...
మెజారిటీ ఓట్ల ఆమోదం కాదు
ఓట్ల వెనక నోట్లు కాదు
నోట్ల వెనకనున్న కులదోపిడీ కాదు
అదో సామాజిక నైతిక సమానత్వం!”(పుట.సంఖ్య 90)అంటాడు.

కవిత్వ వ్యక్తీకరణకు భాష ఒక ఆయుధం. ఈ కవిత్వంలో భాష పరంగా ఒక పాఠక సౌలభ్యం ఉంది. చాలా పరిణతి చెందిన కవిత్వభాష పట్ల ఈ కవికి పట్టు ఉంది. అందుకే తాను ప్రధాన స్రవంతిలో రాసే కవుల ధీటుగా దళిత వేదనను పలికించాడు. అందరికీ అర్థమయ్యే భాషలో కవిత్వాన్ని చాలా గాఢతతో పలికించాడు. ఫిలాసఫీ అధ్యయనం చేసిన కవిగా దళిత జీవన తాత్వికతను బలంగా పలికించాడు. అలాగే వ్యంగ్యోక్తులతో వ్యవస్థకు చురకలు వేశాడు. అది ఒక ధర్మాగ్రహ ప్రకటన గానే చూడాల్సి ఉంటుంది. మొత్తంగా ఈ ఆధునిక కాలాన దళిత సాహిత్య గమనానికి ఒక బలమైన చేర్పుగా ఈ ఆదిమ పౌరుడు కవిత్వాన్ని భావించాల్సి ఉంటుంది.

❖ ❖ ❖ ❖ ❖


# శిలాక్షరం

(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం ‘శిలాక్షరం’.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

# జానపద కళల పునరుజ్జీవనం - సమాలోచన

**(అంతర్జాతీయ సదస్సు, 15 అక్టోబర్, 2025 బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణగూడ, హైదరాబాదు)**

**డా. వర్ధ వేణు**, అధ్యాపకులు, తెలుగుశాఖ, బి.జె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 99638 15484

జనపదాలలో నివసించే వారినీ జానపదులు అంటారు. జానపదులు రోజువారి కార్యక్రమంలో తమ పనులు తాము చేసుకుంటూ పొలం పనులు చేసుకుంటారు. వారి శ్రమను మర్చిపోవడానికి పదం పాడు, అనుకుంటూ పాటలు పాడుకుంటారు. ఇలా వారి కష్టాన్ని శ్రమను మర్చిపోతూంటారు. జానపదులు తీరిక సమయాలలో, రాత్రి వేళలో, వేషధారణలో ఆటలాడుకుంటారు. ఆ ఆటలు ఆడుకోవడంతో దానికి తోడుగా వాద్యాలు వాయించడం జరుగుతుంది. ఇలా లయబద్ధంగా జానపదులు తమ కళారూపాలను ప్రదర్శిస్తూంటారు. వాటిలో యక్షగానం, బుర్రకథ, హరికథ, చిందు ఎల్లమ్మ, మార్కండేయాట, బీరప్పాట, లత్కోర్ సాబ్, బుడ్డం కాదు వంటి హాస్య పాత్రలు తెలంగాణలో ఎక్కువగా కనబడతాయి. లత్కోర్ సబ్ హాస్యంగా అందరిని నవ్విస్తూ బిక్షం యాచిస్తూ జీవనం సాగిస్తాడు. తెలంగాణలో ప్రత్యేకంగా కళాకారులు వారి వృత్తితో జీవనంగా సాగిస్తూంటారు.

ఎంతోమంది కళాకారులు తమ వృత్తినివదిలిపెట్టి ఇతర ఉద్యోగాల్లో స్థిరపడడానికి ప్రయత్నిస్తూన్నారు. కళాకారులకు ఆ వృత్తితో జీవనం సాగించడం కష్టంగా మారింది. ప్రస్తుత ఆధునిక కాలంలో కళాకారుల వృత్తులను ఎవరు ఆదరించడం లేదు.

జానపద కళలు వాటి గొప్పతనాన్ని మరిచిపోకూడదు. మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా జానపద కళారూపాలు ఉన్నాయి. వీటిని కాపాడుకోవాలని ఉద్దేశంతో ఈ అంతర్జాతీయ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నారాయణగూడ వారు **జానపద కళల పునరుజ్జీవనం - సమాలోచన** అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు.

ప్రారంభ సమావేశంలో జ్యోతి ప్రజ్వలన ప్రార్థన గీతంతో ఈ సమావేశం ప్రారంభమైంది. అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. దీపిక స్వాగతోపన్యాసం ఇస్తూ అతిథులను విశిష్టాతిథులను ముఖ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ ప్రారంభ సమావేశానికి అధ్యక్షులుగా కాలేజ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. డిగ్రీ కళాశాలల జాయింట్ డైరెక్టర్ బాలభాస్కర్ గారు ముఖ్య అతిథిగా ఉన్నారు. కీలకోపన్యాసానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు, విశిష్టాతిథులుగా ప్రజాకవి జయరాజ్ గారు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రస్తుత తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ గారు, క్రొవ్విలి గోపాలకృష్ణ గారు మలేషియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ గారు ప్రారంభ సమావేశంలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో సమన్వయకర్తగా అసోసియేట్ ప్రొఫెసర్ రాపోలు శ్రీనివాస్ గారు జానపద కళలు నాగరికతలో కనుమరుగవుతున్న తరుణంలో ఈ సదస్సు ప్రాముఖ్యతను సంతరించుకుంటుందన్నారు. జానపద కళలను కాపాడుకోవాలని దాని కోసం ఈ సదస్సు ద్వారా కళలకు పునరుజ్జీవనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ జానపద కళలు మనిషి మనుగడకు ఎంతో అవసరమని తన పాటతో ఈ సమావేశంలో రక్తి కట్టించారు.

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు వీరు జానపదుల పొడుపు కథల మీద పరిశోధన చేశారు. జానపదులు తమ కళల ద్వారా తమ సంప్రదాయాలు, సాంఘిక ఆచారాలు, జానపదుల వేట, ఆట, వ్యవసాయం, గృహం, గుడి, వీధి, రంగస్థలం, రికార్డు డాన్స్, ఆకాశవాణి, దూరదర్శన్, ఆడియో వీడియో, జానపదుల జీవితంలో ఉంటాయన్నారు.

**"శ్రీరామ నామం మరువం మరువం"** దీనికి జానపదుల కూర్పు

**"గాంధీ నామం మరువం మరువం"**

జానపద కళలు మానవత్వం నుంచి దైవత్వం వైపు కూడినవన్నారు. జానపద కళల ద్వారా సామాజిక సమస్యల మీద అవగాహన కల్పించవచ్చన్నారు.

క్రొవ్విలి గోపాలకృష్ణమూర్తి గారు సినిమాల్లో జానపద నృత్య గీతాలు ఉండాలి. పేరిణి నృత్యం ఇప్పుడు అద్భుతంగా ప్రదర్శించబడుతున్నటువంటి కళగా చెప్పారు. తెలంగాణలో ఉన్నటువంటి అన్ని కళలు ఒక క్యాట్ లాగ్ లాగా తయారు చేయాలి. జానపద కళారూపాల మ్యూజియం ఉంటే బాగుంటుందన్నారు.

ఆచార్య సాగి కమలాకర శర్మ గారు ఈ సదస్సు ఎవరికోసం ఉద్దేశించబడింది. అంటూ కళలన్నీ కూడా విద్యార్థులకు చేరాలి. స్థానికతతో ఉండేటువంటి కళారూపాలను ప్రదర్శించే వారిని ప్రోత్సహిస్తూ ఉండాలన్నారు. జానపద కళారూపాలను ప్రదర్శిస్తూ ఉన్నప్పుడు ప్రారంభంలో శ్రీమాతా రూపంలో ఉన్నటువంటి




అమ్మవారికి ఆదిదేవుడు గణపతికి నమస్కరిస్తూ ఆ కళారూపాన్ని ప్రారంభిస్తారు. ఈ ప్రకృతితో మమేకమైన జానపద కళారూపాలను కాపాడుకోవడం మన బాధ్యతగా భావించాలన్నారు.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు ముందుగా నిర్వాహకులకు అభినందనలు తెలుపుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో జానపద కళల పాత్ర అని పిహెచ్‌డి గ్రంథం వచ్చింది. తెలంగాణ ఉద్యమం విజయవంతం అవ్వడానికి జానపద కళలు కళాకారులే కారణమని తెలిపారు.

అసోసియేట్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ హైదరాబాద్. వీరు జానపద కళల దినోత్సవం ఆగస్టు 22 అంటూ ఆశ్రిత కులంలో ఉన్నటువంటి కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

జడ్చర్ల ప్రిన్సిపల్ సుకన్య గారు తోలుబొమ్మలాట చాలా నైపుణ్యంతో కూడుకున్న ఆట అంటూ ఇటువంటి ఆటలను, కళలను మందుతరాల వారికి అందించగలగాలన్నారు.

వీరితో ఈ ప్రారంభ సమావేశం పూర్తయింది. ఈ సమావేశానికి సి.వి. లక్ష్మీనారాయణ అసిస్టెంట్ ప్రొఫెసర్ వందన సమర్పణ చేశారు.

మొదటి సమావేశంలో అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్. రఘు గారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి విషయ నిపుణులుగా ఆచార్య పులికొండ సుబ్బారావు గారు ఉన్నారు. ఈ సమావేశంలో 16 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

రెండవ సమావేశానికి అధ్యక్షులుగా అసోసియేట్ ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు గారు, విషయం నిపుణులుగా ఆచార్య చెగిచెర్ల కృష్ణారెడ్డి గారు ఉన్నారు. ఈ సమావేశంలో పత్ర సమర్పకులు 17 మంది పాల్గొన్నారు.

మూడో సమావేశంలో అసోసియేట్ ప్రొఫెసర్ తండు కృష్ణయ్య గారు అధ్యక్షత వహించారు. విషయ నిపుణులుగా ప్రొఫెసర్ అజ్మీర సిల్మా నాయక్ గారు ఉన్నారు. ఈ సమావేశంలో 15 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

నాలుగవ సమావేశంలో అధ్యక్షులుగా అసోసియేట్ ప్రొఫెసర్ ఏలే విజయలక్ష్మి తెలుగుశాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు ఉస్మానియా విశ్వవిద్యాలయం గారు వహించారు. విషయ నిపుణులుగా అసోసియేట్ ప్రొఫెసర్ నాళేశ్వరం శంకరం గారు ఉన్నారు. ఈ సమావేశంలో 15 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

మొత్తం ఈ ప్రత్యక్ష (offline) సమావేశంలో 63 మంది పత్ర సమర్పణ చేశారు.

మొదటి పరోక్ష (Online) ఈ సమావేశానికి అధ్యక్షులుగా అసోసియేట్ ప్రొఫెసర్ జవ్వాజీ నీరజ గారు విషయ నిపుణులుగా ఆచార్య బిట్టు వెంకటేశ్వర్లు గారు ఉన్నారు. ఈ సమావేశంలో మొత్తం 16 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

రెండవ సమావేశంలో అధ్యక్షులు అసోసియేట్ ప్రొఫెసర్ ఎం మాంతయ్య విషయనిపుణులుగా ప్రొఫెసర్ ఎం జయదేవ్ గారు ఈ సమావేశంలో ఉన్నారు. మొత్తం 19 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

మూడవ సమావేశంలో అధ్యక్షులెడా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. రమేష్ బాబు, విషయ నిపుణులుగా ప్రొఫెసర్ గోనా నాయక్ గారు ఉన్నారు. ఈ సమావేశంలో మొత్తం 17 మంది పత్ర సమర్పుకులు పాల్గొన్నారు.

నాలుగవ సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అట్టెం దత్తయ్య ఢిల్లీ యూనివర్సిటీ విషయ నిపుణులుగా ప్రొఫెసర్ శ్రీ బద్రి కుర్మారావు ఢిల్లీ విశ్వవిద్యాలయం వారు ఉన్నారు. ఈ సమావేశంలో మొత్తం 22 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

మొత్తం పరోక్ష సమావేశంలో 74 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు. ప్రత్యక్షంగా పాల్గొన్నవారు 63 మంది పరోక్షంగా పాల్గొన్నవారు 74 మంది మొత్తం ఈ అంతర్జాతీయ సదస్సులో 137 మంది పత్ర సమర్పకులు పాల్గొన్నారు.

ఈ అంతర్జాతీయ సదస్సులో జానపద కళలు ప్రపంచీకరణ అనే అంశంపై 7 పత్రాలు, సామాజిక చైతన్యం నేపథ్యం అంశంపై 16 పత్రాలు, భక్తి ప్రబోధం పైన 5 పత్రాలు, జిల్లాలో జానపద కళలు పైన 4 పత్రాలు, హాస్యం పైన 3 పత్రాలు, చలనచిత్రాలలో జానపద కళలు పైన 4 పత్రాలు, జానపద కళలు ప్రతీకలలో 2

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2025




పత్రాలు, జానపద అస్తిత్వం పైన 3 పత్రాలు, కులవృత్తుల పైన 5 పత్రాలు, కోలాటం ఒగ్గు కథ పై 2 పత్రాలు, తోలుబొమ్మలాట పై 2 పత్రాలు, శారద కాండ్రు మీద 1 పత్రం, గంగిరెద్దు పై 1 పత్రం, యాదవ కుల ఆశ్రితుల పైన 3 పత్రాలు యక్షగానంపై 3 పత్రాలు, పటం కథలపై 2 పత్రాలు, గ్రామాభివృద్ధిలో జానపద కళలు పైన 3 పత్రాలు, ప్రసార మాధ్యమాలపై 6 పత్రాలు మిగతా అంశాలపై ఒక్కొక్క పత్రం వచ్చాయి.

**ముగింపు సమావేశం :**

ఈ సమావేశంలో సభాధ్యక్షులుగా కెప్టెన్ డాక్టర్ విజయకుమార్ బిజెఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గారు వహించారు. **'జానపద కళలు - పునరుజ్జీవనం సమాలోచన'** అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించడానికి కారణం అంతరించిపోతు న్నటువంటి కళలు బ్రతికించుకోవాలన్నారు. ఈ ఉద్దేశంతో మా కళాశాలలో సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సదస్సు ద్వారా సమాచారం అటు విద్యార్థులకు కళాకారులకు చేరి పూర్వవైభవం రావడానికి కొంత అవకాశం ఉందన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ డి.ఎస్.ఆర్ రాజేందర్ సింగ్ సంయుక్త సంచాలకులు కళాశాల విద్య హైదరాబాద్ గారు, మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను జానపద కళలు కాపాడుతున్నాయన్నారు. ఈ జానపద కళల ద్వారా జ్ఞానంతో పాటు ఆనందాన్ని పంచుతా యన్నారు. పూర్వం జానపద కళలు మౌఖిక సాహిత్యం ద్వారా ఒకరి నుంచి ఒకరికి అందించబడ్డాయన్నారు. ఒకప్పుడు యక్షగానం బుర్రకథ చెప్పే పంతులు ఉండేవారు. ఇప్పుడు వాళ్లు కనుమరుగై పోయారన్నారు. డాక్టర్ పాపిరెడ్డి సుధీర్ రెడ్డి మలేషియా, డాక్టర్ కొలిచాల సురేష్ అమెరికా గారు వీరు అంతర్జాలం ద్వారా ఈ సదస్సులో పాల్గొన్నారు. జానపద కళల గురించి వీరు అనేక విషయాలు వివరించారు. డాక్టర్ విస్తాలి శంకర్రావు వీరు అంతర్జాలం ద్వారా మద్రాస్ యూనివర్సిటీ నుంచి మాట్లాడారు. ఈ ఒకరోజు అంతర్జాతీయ సదస్సు సంచాలకులు డాక్టర్ రాపోలు శ్రీనివాస్ తెలుగుశాఖాధ్యక్షులు అదేవిధంగా ఈ సదస్సుకు డాక్టర్ సి.వి.లక్ష్మినారాయణ గారు ఆర్గనైజింగ్ సెక్రటరీగా మరియు ఈ సదస్సుకు ఉపసంచాలకులుగా డాక్టర్ ఎం.దీపిక గారు, డాక్టర్ వర్ద వేణు గారు ఈ బాధ్యత వహించారు.

❖ ❖ ❖ ❖ ❖


## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# స్వ'కృతి'






**తెలంగాణ వెలుగులు (పద్య రచన)**
డా. ఎన్.ఆర్. వెంకటేశం
వెల : 100/-
ప్రతులకు: ఎన్. విక్రాంత్,
3-11-91, వీధి. నెం. 3, ఆర్.టి.సి. కాలనీ,
ఎల్.బి. నగర్, హైదరాబాద్ - 500 074.
ఫోన్ : 934 650 2342




**ప్రాచీన తెలుగు మార్గాన్వేషణ - పరిష్కరణ**
**(శాసనాలు - నాణేలు - తాళపత్రాలు - లిపి)**
కూర్పు : డా. సగిలి సుధారాణి
వెల : 330/-
ప్రతులకు :ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం,
భారతీయ భాషల సంస్థ, మానస గంగోత్రి,
మైసూరు - 570006. కర్ణాటక




**మహతీ శత కవితా లహరి**
ఎం. అరుణ కుమారి
వెల : 175 /-
ప్రతులకు : రచయిత్రి, 301, మాలని ఐకాన్
అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 8, గాంధీ నగర్,
హైదరాబాద్ - 500 080
ఫోన్ : 99851 96847




**వాట్సాప్ వార్ (కథల సంపుటి)**
నిదానకవి నీరజ
వెల : 150 /-
ప్రతులకు : రచయిత్రి,
3-11-91, లలితా కుటీర్,
ఆర్‌టిసి కాలనీ, ఎల్.బి. నగర్,
హైదరాబాద్. ఫోన్ : 9908948649




**అరుణారుణ నయనాలు (కవితా సంపుటి)**
ఎం. అరుణ కుమారి
వెల : 150 /-
ప్రతులకు : రచయిత్రి, 301, మాలని ఐకాన్
అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 8, గాంధీ నగర్,
హైదరాబాద్ - 500 080
ఫోన్ : 99851 96847

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్‌అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com




**కవితా కదంబం**
ఎం. అరుణ కుమారి
వెల : 160 /-
ప్రతులకు : రచయిత్రి, 301, మాలని ఐకాన్
అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 8, గాంధీ నగర్,
హైదరాబాద్ - 500 080
ఫోన్ : 99851 96847




**జీవాతువు**
పరిమి శ్రీరామనాథ్
వెల : 150 /-
ప్రతులకు : పరిమి శ్రీరామనాథ్
ఫోన్ : 91003 66764




**శ్వాస**
మారెళ్ళ రవిశాస్త్రి
వెల : 600/-
ప్రతులకు : నిరవి సంస్థానం ట్రస్ట్
హైదరాబాద్
ఫోన్ : 86395 79629
90300 20559

# కృత్రిమ శిల్పం

మునుగూరి పురుషోత్తం
ఫోన్ : 9505391696





నిశీధిని చూస్తూ ...
నీలాకాశంతో మాట్లాడుతూ..
నిండైన నీ సమాజంలో
నిలబడుతూ...
నీవు చెప్పినట్టుగా
ఓ కొత్త శిల్పంగా తయారు కావడానికి
నన్ను నేను
అనుక్షణం చెక్కుకుంటున్నాను..!

ఒక్కో భావనా శిలాతలుపులు
ఒంటినుండి
రాలిపోతూ...
కొత్త రూపంగా మారినా..
ఉలితో చేసిన ఆ గాయాలు
విపరీతమైన నొప్పికి గురౌతున్నాయి.
అయినా కూడా...
నీ పరీక్షలో
పరాజితుడుగానే
మిగిలిపోతున్నాను.

పూర్తి శిల్పంగా మారడానికి
నీ వాళ్ళ మధ్యలో నిలబడిన
ప్రతిసారి
అనేకమైన నీ కుటిల ప్రశ్నలను
ఎదుర్కుంటూ...
ఎప్పటికప్పుడు మాడిపై
అవుతూనే ఉన్నాను..!

ఈ మధ్య
ఎక్కడ చెక్కినా ...
అశ్రువుల ఆనవాళ్ళే
కనిపిస్తున్నాయి..

శిల్పంగా మారాలన్న ప్రతిసారి,
ఆ ఆర్ద్రతే ఆటంకాన్ని కలిగిస్తుంది.



అందుకూ
నన్ను నేను చెక్కుకున్న ప్రతిసారి,
ఓ ప్రశ్న
నన్ను వెక్కిరిస్తూ ఉంటుంది
నేను సహజ శిల్పాన్నా..?
లేకా కృత్రిమ శిల్పాన్నా..? అని.
ఆ అనుమానమే అసలైన శిల్పానికి
అవరోధంగా మారుతుంది..

ఎలా చెక్కినా నచ్చనపుడు..!
ఎన్నిసార్లు చెక్కినా నచ్చనపుడు..!
అసలు నీకోసం
నన్ను నేను ఎందుకు చెక్కుకోవాలి.?
నీకు నచ్చే శిల్పంగా ఎందుకు
మారాలి..?

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో & సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

**IUI | IVF | ICSI | IMSI | HSG**



**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

Scanned with OKEN Scanner